భారీ వాహనాల్లో తరలుతున్న గ్రానైట్ ముడిరాళ్లు



బిల్లుల్లేవ్.. మామూళ్లే!

గ్రానైట్‌లో కొత్త 'రూట్' తెరతీసిన ఉత్తరాది ట్రేడర్లు

- క్వారీల యజమానులకు డాలర్ల ఆశ చూపుతున్న వైనం
- రాయల్టీ చెల్లించకుండానే ముడిరాయి, శ్లాబుల రవాణా
- ఏజెంట్ల ద్వారా చెన్నై పోర్టుకు తరలింపు
- అధికారులకు లంచాల ఎర
- స్థానిక ఫ్యాక్టరీలకు ట్రాక్టర్ల ద్వారా సరఫరా
- ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి

గ్రానైట్‌లో అక్రమాలు కొత్తపుంతలు తొక్కుతున్నాయి. ముడిరాయి కొనుగోలు, శ్లాబుల తయారీ, రవాణా అంతా నిబంధనలకు విరుద్ధంగా సాగుతోంది. ఇటీవల పరిశ్రమలో ఉత్తరాది వ్యాపారుల ఆధిపత్యం మొదలైంది. నేరుగా క్వారీ యజమానులతో మాట్లాడుకొని ఎలాంటి రాయల్టీ లేకుండా పెద్దమొత్తంలో ముడిరాయిని కొనుగోలు చేసి గుట్టుచప్పుడు కాకుండా ఏజెంట్ల ద్వారా చెన్నై పోర్టుకు తరలిస్తున్నారు. అక్కడి నుంచి విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. డాలర్ల ఆశ చూపడంతో క్వారీల నిర్వాహకులు కూడా ఈ అక్రమానికి వంతపాడుతున్నారు. మొత్తం వ్యవహారంలో వ్యాపార సంస్థల నిర్వాహకులు, క్వారీ యజమానులకు కాసుల పంట పండుతుండగా ప్రభుత్వ ఖజానాకు భారీగా గండిపడుతోంది. దీన్ని అడ్డుకోవాల్సిన సంబంధిత శాఖల అధికారులు మిన్నకుంటున్నారు. వారికి కూడా పెద్దఎత్తున మామూళ్లు అందుతుండటమే ఇందుకు కారణమన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.


కర్నూల్‌రోడ్‌పై రాయి రవాణా చేస్తూ నిలిచిపోయిన ట్రాక్టర్

చీమకుర్తి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : చీమకుర్తి మండలం రామతీర్థం పరిసర ప్రాంతాల్లో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన గెలాక్సీ గ్రానైట్ పరిశ్రమ విస్తరించింది. దీనికి అనుబంధంగా కటింగ్, పాలిషింగ్ ఫ్యాక్టరీలు, కంకర మిల్లులు భారీగా ఉన్నాయి. ప్రభుత్వానికి రాయల్టీ, ఇతరత్రా పన్నుల రూపంలో ఏటా రూ.వందల కోట్ల ఆదాయం సమకూరుతుంది. ఇప్పుడు ఆ రాబడికి భారీగా గండిపడుతోంది. గ్రానైట్ పరిశ్రమలో ఉత్తరాది వారు వివిధ విభాగాల్లో ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తున్నారు. ట్రేడర్లు (ఎగుమతిదారులు)గా అవతారమెత్తారు. సదరు ట్రేడర్లు బయ్యర్లుగా మారి నేరుగా క్వారీ యజమానుల నుంచి ముడిరాళ్లను కొనుగోలు చేస్తున్నారు. ఇక్కడే భారీ స్థాయిలో కటింగ్ ఫ్యాక్టరీలను సైతం ఏర్పాటు చేసుకున్నారు. ఫ్యాక్టరీల నిర్వాహకులు శ్లాబు విధానంలో గ్రానైట్ రాయిని కొనుగోలు చేయలంటే ప్రభుత్వానికి బ్లేడుకు కనీస మొత్తం అయిన రూ.27వేలు చెల్లించాలి. ఆతర్వాత గనుల శాఖ పర్మిట్ ఇస్తుంది. దాన్ని తీసుకెళ్లి క్వారీ యజమానులకు చూపితే వాళ్ల ముడిరాయిని విక్రయిస్తారు. అందుకు సంబంధించిన రాయల్టీని కూడా ప్రభుత్వానికి చెల్లించి కొనుగోలుదారుడికి బిల్లు ఇవ్వాల్సి ఉంటుంది. ఉత్తరాదికి చెందిన రెండు సంస్థల యజమానులు క్వారీ యజమానులకు డాలర్ల ఆశ చూపి నిబంధనలకు విరుద్ధంగా రాయిని కొనుగోలు చేస్తున్నారు.

రాయల్టీకి రాంరాం

డాలర్ల పంట పండుతుండడంతో కొందరు గ్రానైట్ క్వారీల నిర్వాహకులు ప్రభుత్వానికి ఎలాంటి రాయల్టీ చెల్లించకుండానే విక్రయిస్తున్నారు. నిబంధనల ప్రకారం ముడిరాళ్లకు సరాసరిన క్యూబిక్ మీటర్‌కు దాదాపు ఆరు వేల రూపాయలను రాయల్టీ రూపంలో క్వారీ యజమానులు ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది. కానీ లెక్కల్లో ఎలాంటి రాయి కొనుగోలు చేసినట్లు చూపించడం లేదు. డాలర్ల చెల్లింపు ద్వారా ఎలాంటి సమస్య లేకపోవడంతో కొందరు వ్యాపారులు మహదానందపడిపోతున్నారు. ఏకమొత్తంలో భారీ మొత్తంలో ముడిరాయిని విక్రయిస్తున్నారు.

రాయి తరలింపునకు ఏజెంట్లు

ఎలాంటి రాయల్టీ చెల్లించకుండా కొనుగోలు చేసిన ముడిరాయిని, తమ ఫ్యాక్టరీల్లో తయారు చేసిన శ్లాబులను ఉత్తరాది కంపెనీల యజమానులు గుట్టుచప్పుడు కాకుండా చెన్నై పోర్టుకు తరలిస్తున్నారు. స్థానిక రవాణా ఏజెంట్లకు భారీ మొత్తం ఆశ చూపి గ్రానైట్ ట్రాలీలు, కంటైనర్లను రాష్ట్ర సరిహద్దులు దాటిస్తున్నారు. ఇలా చెన్నై పోర్టుకు ముడిరాయి, శ్లాబులు చేరుతున్నాయి. అక్కడి నుంచి ఇతర దేశాలకు ఎగుమతి అవుతున్నాయి. లారీల్లో తరలించకుండా ట్రాక్టర్ల ద్వారా ఒకట్రెండు రాళ్లను ఫ్యాక్టరీలకు చేరవేస్తూ ఎవ్వరికీ అనుమానం రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. రామతీర్థం వద్ద ఉన్న క్వారీల నుంచి ముడిరాయిని తీసుకెళ్తున్న ట్రాక్టర్ పంక్చర్ అయి కర్నూల్‌రోడ్డుపై నిలిచిపోవడం అందుకు నిదర్శనం. ఉత్తరాదికి చెందిన వ్యాపారులు, గ్రానైట్ క్వారీల నిర్వాహకుల నిర్వాకంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండిపడుతోంది. ఇంత జరుగుతున్నా గనుల శాఖ అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.


వెల్లంపల్లి కేంద్రంలో కొనుగోళ్లను ప్రారంభించి మాట్లాడుతున్న పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్

అదే జోరు

- రెండో దశ పొగాకు కొనుగోళ్లు ప్రారంభం
- కిలో రూ.280 పలికిన గరిష్ఠ ధర
- వెల్లంపల్లి, ఒంగోలు-2 కేంద్రాల్లో పాల్గొన్న బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్

ఒంగోలు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : దక్షిణాది పొగాకు మార్కెట్‌లో రెండో దశ కొనుగోళ్లలోనూ అదేజోరు కొనసాగింది. ఈ ప్రాంతంలోని ఏడు కేంద్రాల్లో బుధవారం వేలం ప్రారంభమైంది. అన్నిచోట్లా కిలోకు గరిష్ఠ ధర రూ.280 పలికింది. దక్షిణాదిలో ఉన్న 11 కేంద్రాల్లో తొలి విడతగా ఈనెల 10న ఒంగోలు-1, కొండపి, పొదిలి, కందుకూరు-1 కేంద్రాల్లో పొగాకు వేలం ప్రక్రియ ప్రారంభమైంది. కిలో రూ.280 గరిష్ఠ ధరను వ్యాపారులు ఇచ్చారు. గత సీజన్‌లో ప్రారంభం రోజున కిలోకు గరిష్ఠ ధర రూ.230 ఇవ్వగా ఈ ఈసారి రూ.50 పెంచి రూ.280కు కొనుగోలు చేశారు. వారం పది రోజులుగా అదే గరిష్ఠ ధరతో మార్కెట్ నిలకడగా సాగుతోంది. ఈ నేపథ్యంలో రెండో దశగా మిగిలిన ఏడు కేంద్రాలైన ఒంగోలు-2, వెల్లంపల్లి, టంగుటూరు. కనిగిరి, కందుకూరు-2, కలిగిరి, డీసీపల్లి కేంద్రాల్లో బుధవారం నుంచి వేలం మొదలైంది. ఒంగోలు-2, వెల్లంపల్లిల్లో పొగాకు బోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్‌కుమార్ ప్రారంభించారు. వైస్‌చైర్మన్ బొడ్డపాటి బ్రహ్మయ్య, దక్షిణాది ఆర్‌ఎం లక్ష్మణరావు, స్థానిక రైతులు, వ్యాపారప్రతినిధులు పాల్గొన్నారు. ఇతర వేలం కేంద్రాల్లో అక్కడి అధికారుల నేతృత్వంలో కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. ఐటీసీ, జీపీఐలతోపాటు కీలకమైన పది కంపెనీలకుపైగా బయ్యర్లు పాల్గొన్నారు. రాష్ట్రంలో పంట ఉత్పత్తి అధికమైన నేపథ్యంలో రైతులు, గ్రేడింగ్ బాగా చేసుకొని బేళ్లను అమ్మకాలకు తీసుకురావాలని ఈసందర్భంగా బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్ సూచించారు. తద్వారా మంచి ధరలు పొందాలని కోరారు.

ఇంటర్ విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు

- రానున్న విద్యా సంవత్సరం ఆరంభంలోనే అందజేత

ఒంగోలు విద్య, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ యాజమాన్యంలోని కళాశాలల్లో ఇంటర్మీడియెట్ చదివే విద్యార్థులకు 2025-26 విద్యా సంవత్సరానికి ఉచితంగా పాఠ్య పుస్తకాలు ఇవ్వనున్నారు. ఈమేరకు సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు ఉత్తర్వులు ఇచ్చారు. ఇంటర్మీడియేట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలతోపాటు ఒకేషనల్, నీట్, ఇంజనీరింగ్‌కు సంబంధించిన స్టడీ మెటీరియల్, ప్రాక్టికల్ మాన్యువల్స్ ప్రాక్టికల్ పరికరాలు, నోట్ పుస్తకాలు ఉచితంగా అందించనున్నారు. వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పునఃప్రారంభమైన వెంటనే వీటిని ఇవ్వనున్నారు.



డ్వామాలో సాఫీగా బదిలీల కౌన్సెలింగ్

నాలుగు విభాగాల్లో 129 మంది హాజరు

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా)లో పనిచేస్తున్న ఉద్యోగుల బదిలీల కౌన్సెలింగ్ బుధవారం సాఫీగా సాగింది. పంచాయతీరాజ్ కమిషనర్ ఇచ్చిన మార్గదర్శకాలకు అనుగుణంగా బుధవారం స్థానిక డ్వామా కార్యాలయంలో సీనియారిటీ జాబితా ఆధారంగా ఈ ప్రక్రియను నిర్వహించారు. ఏపీవోలు, ఈసీలు, టెక్నికల్ అసిస్టెంట్లు (టీఏ), కంప్యూటర్ ఆపరేటర్లకు సంబంధించిన నాలుగు విభాగాల్లో 129 మందిని బదిలీ చేశారు. డ్వామా పీడీ జోసఫ్‌కుమార్, డీఆర్వో చినఓబులేశు, జడ్పీ సీఈవో చిరంజీవి పాల్గొన్నారు.



హెచ్‌ఎంపై గుర్తు తెలియని మహిళల దాడి

బాలికల హైస్కూల్‌లోకి వెళ్తున్న ముసుగు మహిళలు

- ప్రధానోపాధ్యాయురాలి మెడలోని నల్లపూసల దండ అపహరణ
- కనిగిరి బాలికల హైస్కూల్‌లో ఘటన

కనిగిరి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : కనిగిరిలోని బాలికల హైస్కూల్ హెచ్‌ఎంపై కొందరు గుర్తు తెలియని మహిళలు దాడికి పాల్పడ్డారు. ఊపిరాడక కిందపడిపోయిన ఆమె మెడలోని నల్లపూసల దండను లాక్కెళ్లారు. ఈ ఘటన బుధవారం స్కూల్‌లోనే చోటుచేసుకుంది. అందిన సమాచారం మేరకు.. కనిగిరి హైస్కూల్‌లో బాలికల పట్ల ఓ ఉపాధ్యాయుడు అనుచితంగా ప్రవర్తించినందుకు నిరసనగా బంధువులు, కుటుంబ సభ్యులు మంగళవారం ఆందోళనకు దిగారు. ఈ నేపథ్యంలో బుధవారం ఓ బాలిక బంధువులమంటూ కొందరు మహిళలు ముసుగులు వేసుకొని స్కూల్‌లోకి ప్రవేశించారు. హెచ్‌ఎం విజయలక్ష్మితో వాగ్వాదానికి దిగారు. ఆఫీసు గదిలో మాట్లాడుకుందామని చెప్పి ఆమె లోపలికి వెళ్తుండగా ఒక్కసారిగా దాడికి పాల్పడ్డారు. దీంతో గతంలో గుండెకు శస్త్ర చికిత్స జరిగి ఉన్న ఆమె కింద పడిపోయారు. అక్కడ ఉన్న స్వీపర్ అడ్డుకోబోగా ఆమెపైనా మహిళలు చేయిచేసుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు స్కూల్ వద్దకు చేరుకుని మహిళలను చెదరగొట్టి బయటకు పంపారు. అయితే తనపై మహిళలు దాడి చేయడంతోపాటు, కిందపడిపోయిన సమయంలో మెడలోని రూ.1.50 లక్షల విలువైన నల్లపూసల దండను లాక్కొని వెళ్లారని హెచ్‌ఎం విజయలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీరాం తెలిపారు.

ఉపాధ్యాయుడి అరెస్టు.. రిమాండ్

విద్యార్థినిని వేధింపులకు గురిచేసిన ఉపాధ్యాయుడు రంగారెడ్డిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. ఆయన్ను బుధవారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించినట్లు డీఎస్పీ సాయిఈశ్వర్ యశ్వంత్ విలేకరులకు తెలిపారు. నిందితుడిని ఒంగోలు సబ్ జైలుకు తరలించినట్లు చెప్పారు. ఈ ఘటనకు సంబంధించి పట్టణంలో రాస్తారోకో చేసి ప్రజలను ఇబ్బందులకు గురి చేసిన వారిపై, ఉపాధ్యాయుల విధులకు ఆటంకం కలిగించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ తెలిపారు. ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేసినట్లు ఎంఈవో నారాయణరెడ్డి తెలిపారు.

భూకబ్జా కేసులపై దృష్టి సారించండి

- దర్యాప్తులో వేగం పెంచండి
- సిట్‌కు ఎస్పీ దామోదర్ సూచన

7

పది పరీక్షల్లో అంతా ఓపెన్..!

రంజాన్ వేళలు
ఇఫ్తార్: 6.26 (గురువారం సాయంత్రం)
సహర్: 4.54 (శుక్రవారం ఉదయం)


కందుల కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ అన్సారియా, జేసీ గోపాలకృష్ణ

రైతులకు ఆదాయం కల్పించడమే లక్ష్యం

- కలెక్టర్ తమీమ్ అన్సారియా
- చిమటలో కందుల కొనుగోలు కేంద్రం పరిశీలన

మద్దిపాడు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : రైతులు పండించిన పంటకు మంచి ధర కల్పించి ఆదాయం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. అందులో భాగంగా జిల్లాలో మార్క్‌ఫెడ్ ద్వారా కందులు కొనుగోలు చేస్తున్నట్టు చెప్పారు. బుధవారం ఆమె మద్దిపాడు మండలం చిమట గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కందుల సేకరణ కేంద్రాన్ని బుధవారం పరిశీలించారు. మార్క్‌ఫెడ్ అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం రైతులతో మాట్లాడారు. ఎన్ని ఎకరాల్లో కంది పంటను వేశారు? ఎకరాకు ఎంత దిగుబడి వచ్చింది? కొనుగోలు కేంద్రంలో ఇబ్బందులు ఏమైనా ఉన్నాయా? అని ఆరా తీశారు. రైతులకు ఎలాంటి అసౌకర్యం, ఇబ్బందీ లేకుండా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని మార్క్‌ఫెడ్ అధికారులను ఆదేశించారు. క్వింటాకు రూ.7,550 మద్దతు ధరతో కందులు కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం చిమట గ్రామస్థులు గ్రామంలో నెలకొన్న తాగునీరు, శ్మశాన వాటిక సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. వాటి పరిష్కారానికి ఆమె హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జేసీ గోపాలకృష్ణ, మార్క్‌ఫెడ్ డీఎం హరికృష్ణ, కనిగిరి ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాసరావు, ఏడీఏ బాలాజీ నాయక్, నిర్వాహకులు మలసాని కోటేశ్వరరావు, యర్రమోతు శ్రీనివాసులు, తహసీల్దార్ జ్వాలా నరసింహం, ఎంపీడీవో జగదీష్, ఏవో వెంకటేష్ పాల్గొన్నారు.


జిల్లా ప్రజాప్రతినిధుల భేటీలో ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

సమన్వయంతో అభివృద్ధి సాధిద్దాం

- ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి
- కీలక ప్రజాప్రతినిధులతో అసెంబ్లీ ఆవరణలో భేటీ
- దేవదాయ శాఖకు సంబంధించిన అంశాలపై చర్చ
- వచ్చేనెలలో నియోజకవర్గ స్థాయి సమావేశాలు

ఒంగోలు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లా అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రజాప్రతినిధులందరం సమన్వయంతో సాగుదామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సూచించారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో దేవదాయశాఖ పరిధిలో ఉన్న భూములు, ఆలయాల అభివృద్ధిపై ఎమ్మెల్యేల సూచన మేరకు మంత్రి ఆనం బుధవారం అసెంబ్లీ ఆవరణలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జిల్లాకు చెందిన మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి, ముత్తుముల అశోక్‌రెడ్డి, కందుల నారాయణరెడ్డి, దేవదాయ శాఖ కమిషనర్ వినయ్‌చంద్ తదితరులు పాల్గొన్నారు. సింగరాయకొండ, పాకల, టంగుటూరులలో దేవదాయ శాఖ భూముల విషయమై నెలకొన్న వివాదంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను మంత్రి డాక్టర్ స్వామి ఈ సందర్భంగా వివరించారు. ఒంగోలులోని సుజాతనగర్ ప్రాంతంలో సమస్యతోపాటు దేవదాయ భూమి 22 ఎకరాలను వేలం వేయాల్సిన అవసరాన్ని ఎమ్మెల్యే జనార్దన్ ప్రస్తావించారు. మార్కాపురంలోని చెన్నకేశవస్వామి భూముల అన్యాక్రాంతంపై తక్షణం విచారణ చేయించాలని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మంత్రిని కోరారు. కనిగిరి పట్టణంలో దేవాలయ భూమి నాలుగు ఎకరాలకు అద్దె చెల్లించి పాఠశాలకు, క్రీడాప్రాంగణంగా వినియోగిస్తున్న విషయాన్ని అక్కడి ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఆయా అంశాలపై తగు చర్యలను మంత్రి రామనారాయణరెడ్డి హామీ ఇచ్చారు.

త్వరలో పశ్చిమప్రాంతంలో పర్యటన

ప్రస్తుత వేసవిలో తాగునీటి సమస్య, జిల్లా అభివృద్ధి అంశాలు సమావేశంలో చర్చకు వచ్చాయి. ఈసందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ అందరం సమన్వయంతో సాగి ఆయా సమస్యల పరిష్కారం, అభివృద్ధి పనులకు ప్రాధాన్యమిద్దామని సూచించారు. వచ్చేనెల తొలివారంలో జిల్లాలోని పశ్చిమప్రాంతంలో పర్యటించి తాగునీరు, ఇతర సమస్యల పరిష్కారంపై దృష్టి పెడదామన్నారు. జిల్లాస్థాయికి పరిమితం కాకుండా నియోజకవర్గస్థాయిలో కూడా సమీక్షలు నిర్వహించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. కొందరు విదేశీ ప్రయాణాలకు వెళ్లనున్న నేపథ్యంలో వచ్చేనెల 10వతేదీ తర్వాత ఈ సమావేశాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు సమాచారం.

స్థానిక సంస్థల ఉప ఎన్నికలకు నోటిఫికేషన్

- మార్కాపురం, త్రిపురాంతకం ఎంపీపీ పదవులకు ఎన్నిక

7

శిలాఫలకంలో ఎమ్మెల్యే బీఎన్ పేరు చేర్పు

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కలెక్టరేట్‌లో ఇటీవల ఆవిష్కరించిన డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విగ్రహ శిలాఫలకంపై సంతనూతలపాడు శాసనసభ్యుడు బీఎన్.విజయకుమార్ పేరు లేకపోవడంతో వివాదం నెలకొంది. ఈనేపథ్యంలో ఎమ్మెల్యే బీఎన్ చేరుస్తూ మరలా కొత్తగా శిలాఫలకాన్ని ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ దళిత ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈదర విజయభాను, రాష్ట్రప్రధాన కార్యదర్శి బెంగుళూరి సునీల్‌కుమార్‌ల ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి సంతనూతలపాడు ఎమ్మెల్యే విజయకుమార్‌ను కూడా ఆహ్వానించారు. అయితే విగ్రహ ఆవిష్కరణ కోసం ఏర్పాటు చేసిన శిలాఫలకంపై ఎమ్మెల్యే విజయకుమార్ పేరు లేదు. దీంతో ప్రోటోకాల్ ప్రకారం పేరు లేకపోవడంతో ఈ విషయం ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డితో పాటు సీఎంవోకు కూడా చేరింది. దీంతో కలెక్టర్ తమీమ్ అన్సారియాకూడా నిర్వహకులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈనేపథ్యంలో ముందు వేసిన శిలాఫలకాన్ని తొలగించి మంగళవారం అర్ధరాత్రి ఎమ్మెల్యే బీఎన్ పేరును చేర్చిన కొత్త శిలాఫలకం ఏర్పాటు చేశారు.

పాకల తీరంలో యువకుడు అదృశ్యం

సింగరాయకొండ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పాకల తీరంలో యువకుడు అదృశ్యంపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బుధవారం రాత్రి కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. టంగుటూరు మండలం ఎం.నిడమనూరుకు చెందిన చాట్రగడ్డ సిసింద్రీ తన సోదరుడు హర్ష, పెద్దమ్మ కుమారుడు దినేష్‌తో కలిసి పాకల సముద్ర తీరానికి వచ్చారు. సుమారు రెండు గంటల తరువాత సిసింద్రీ కనిపించడం లేదని దుస్తులు మాత్రం ఒడ్డున ఉన్నాయని హర్ష, దినేష్.. మెరైన్ పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మెరైన్ పోలీసులు విషయాన్ని ఎస్సై బి.మహేంద్రకు తెలిపారు. వెంటనే ఆయన పాకల తీరానికి వెళ్లి డ్రోన్‌తో తీరాన్ని జల్లెడపట్టారు. అయినా సిసింద్రీ ఆచూకీ లభించలేదు. పలు కోణాల్లో పోలీసులు ఆరా తీస్తున్నారు. ఒడ్డున దుస్తులు ఉండటంలో సముద్రంలో గల్లంతై ఉండొచ్చనే అనుమానాన్ని కూడా వ్యక్తం చేస్తున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేంద్ర తెలిపారు.

విధుల నుంచి ముగ్గురు ఉపాధ్యాయుల తొలగింపు

సింగరాయకొండ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు జరుగుతున్న స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులోని బాలికల ఉన్నత పాఠశాలను, భాష్యం హైస్కూల్, మూలగుంటపాడు గవర్నమెంట్ హైస్కూల్‌లోని పరీక్షా కేంద్రాలను బుధవారం డీఈవో కిరణ్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సమయంలో విధుల్లో నిర్లక్ష్యంగా ఉన్న బాలికల పాఠశాలలో ఒకరిని, మూలగుంటపాడు హైస్కూల్‌లో ఇద్దరు ఉపాధ్యాయులను ఇన్విజిలేషన్ విధులు నుంచి తొలగించారు.

వేలంలో మల్లవరం దేవాలయానికి ఆదాయం

మద్దిపాడు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మల్లవరం శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయానికి ఈ ఏడాది వేలం ద్వారా అదనంగా ఆదాయం లభించినట్లు ఈవో దామా నాగేశ్వరరావు తెలిపారు. దేవాలయ పరిధిలో ఉన్న దుకాణాల వేలం ద్వారా రూ.10.72 లక్షలు అదనపు ఆదాయం వచ్చినట్లు చెప్పారు. గత ఏడాది రూ.9,34,500 రాగా, ఈ సంవత్సరం దుకాణాలను రూ.13,75,000లకు వేలం దక్కుందన్నారు. బుధవారం నిర్వహించిన వేలంలో కొబ్బరికాయలు అమ్ముకునే హక్కు రూ.1.46 లక్షలు, టీ, టిఫిన్, కూల్ డ్రింక్, తినుబండారాలు అమ్ముకునే హక్కు రు.1.74లక్షలకు, కొప్పరి చిప్పలు పోగు చేసుకునే హక్కు రూ.45 వేలకు సుబ్బాయమ్మ దక్కించుకున్నారు. పెండ్లి మండపం ఏర్పాటు చేసుకునేందుకు రూ.3.8లక్షలకు షేక్ మీరావలి దక్కించుకోగా, జనరేటర్స్ లైటింగ్ వేసుకునే హక్కును రూ.2.66 లక్షలకు శివరామకృష్ణ, ఐస్ క్రీం అమ్ముకునే హక్కు రూ.22 వేలకు, బొమ్మల అంగడికి రూ.29వేలకు నాగమణి, ఇక సోడాలు అమ్ముకునే హక్కును రూ.10వేలకు లంక సుబ్బారావు దక్కించుకున్నట్లు ఈవో తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ వేణు, గ్రామస్థులు, పాటదారులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ట్రైసైకిల్, కుట్టు మిషన్ పంపిణీ


ట్రైసైకిల్, కుట్టుమిషన్‌ను అందజేసిన నిర్వాహకులు

ఒంగోలు కల్చరల్, మార్చి 19(ఆంధ్ర జ్యోతి): నిరుపేదలైన దివ్యాంగునికి మూడు చక్రాల సైకిల్, అలాగే దివ్యాంగురాలి జీవనోపాధికి కుట్టమిషన్‌ను బుధవారం స్థానిక అన్నవరప్పాడు శివం శరణాలయంలో అందజేశారు. శివం ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గొల్లపూడి శ్రీహరి ఆధ్వర్యంలో దివ్యాంగుడు రాజారాంనకు మూడు చక్రాల సైకిల్‌ను, గోపాల్‌నగర్‌కు చెందిన బాపట్ల రేఖకు కుట్టు మిషన్‌ను తెలుగుదేశం పార్టీ నాయకుడు పమిడి రవితేజ జన్మదినం సందర్భంగా వాటిని అందించారు. అనంతరం సంచార వాహనం ద్వారా నగరంలోని 300 మంది యాచకులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో గోగినేని రాకేష్, శేఖర్ నారాయణ రావు, హరీష్, నవీన్, సాద్విక్, ప్రసాద్, నాగరాజు, తిరుమల పాల్గొన్నారు.

పేస్‌లో ముగిసిన వర్క్‌షాపు

ఒంగోలు విద్య, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్, ఎంబీఏ విద్యార్థులకు రెండు రోజుల పాటు నిర్వహించిన డిజైన్ థింకింగ్ వర్క్‌షాపు బుధవారంతో ముగిసింది. ఎంబీఏ విభాగానికి చెందిన గంటా స్మిత సమాజానికి అవసరమైన నూతన వస్తువులు రూపకల్పన, ఉత్పత్తి, ఉపయోగాలు, మార్కెటింగ్‌లో తెలుసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కళాశాల కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ మాట్లాడుతూ విద్యార్థులకు ఇటువంటి వర్క్‌షాపులు ఎంతో అవసరమన్నారు. మార్కెట్‌కు అవసరమైన నైపుణ్యాలను విద్యార్థులు పెంపొందించుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ జీవీకే.మూర్తి, డీన్ సీవీ.సుబ్బారావు, విభాగాధిపతి మేరిజోత్స్న, డీన్ ఆర్.వీరాంజనేయులు పాల్గొన్నారు.

సాగరమాల అపెక్స్ కమిటీ మీటింగ్‌లో సత్య


సమావేశంలో పాల్గొన్న చైర్మన్ సత్య

టంగుటూరు మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : న్యూఢిల్లీలో బుధవారం జరిగిన నేషనల్ సాగర్‌మాల అపెక్స్ కమిటీ మీటింగ్‌లో రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య పాల్గొన్నారు. ఈ మీటింగ్ యూనియన్ మినిస్టర్ ఫర్ షిప్పింగ్, శ్రీసర్బానంద్ సోనోవాల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో దేశవ్యాపితంగా సముద్ర రవాణా, పోర్టు అభివృద్ధి, జలమార్గాల వినియోగం వంటి కీలక అంశాలపై చర్చ జరిగింది. సమావేశంలో సముద్ర రవాణా, పోర్ట్ మౌలికసదుపాయాల ద్వారా ఆర్థిక వృద్ధిని పెంచడంపై చర్చ జరిగింది. రాష్ట్రంలో దీనికి సంబంధించిన ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయడం ద్వారా దేశ ఆర్థిక అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. ఏపీ సాగర్ ప్రాజెక్టులను వేగవంతం చేయాలని, ఇందుకు మరిన్ని నిధులు విడుదల చేయాలని సత్య విజ్ఞప్తి చేశారు.

చెల్లని చెక్కు కేసులో రెండేళ్ల జైలు

ఒంగోలు క్రైం, మార్చి19(ఆంధ్రజ్యోతి): చెల్లని చెక్కు కేసులో నిందితుడు పర్వతరెడ్డి వెంకటసూర్యనారయణకు రెండేళ్ల జైలుశిక్ష విధిస్తూ ఫస్ట్‌కాస్ మేజిస్ట్రేట్ ఎస్.కోమలివల్లి తీర్పు ఇచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు ఒంగోలు నగరం రాజపానగల్‌రోడ్డులో నివాసం ఉండే పర్వతరెడ్డి వెంకటసూర్యనారాయణ, సంతనూతలపాడు మండలంలో ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న చిదేళ్ళ కళ్యాణ్‌కుమార్ స్నేహితులు. 2018లో కళ్యాణ్‌కుమార్, వెంకటసూర్యనారాయణకు రూ.4,85,000 అప్పుగా ఇచ్చారు. అందుకు ఆయన బ్యాంక్ చెక్కులు ఇవ్వగా అవి బ్యాంక్‌లో చెల్లలేదు. దీంతో కళ్యాణ్‌కుమార్ కోర్టులో కేసు నమోదు చేయగా విచారించిన మేజిస్ట్రేట్ వెంకటసూర్యనారాయణపై నేరం రుజువు కావడంతో రెండేళ్ళు జైలు, పరిహారంగా రూ.6లక్షలు చెల్లించాలిని న్యాయాధికారి తీర్పు ఇచ్చారు.

ఘనంగా శ్రీనివాస కల్యాణం

నాగులుప్పలపాడు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఉప్పుగుండూరు గ్రామంలోని ఆర్యవైశ్య కళ్యాణమండపంలో బుధవారం శ్రీనివాస కల్యాణం ఘనంగా నిర్వహించారు. అఖిల భారత శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ పెనుగొండ పీఠాధిపతి శ్రీప్రజ్ఞానంద సరస్వతి బాలస్వామి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. కార్యక్రమంలో వాసవీక్లబ్ అడ్మినిస్ట్రేటివ్ ఉపాధ్యక్షులు కొంజేటి సురేష్‌బాబు, అమరా వేణు, జలంధర్‌రావు, రామమోహనరావు, తూనుగుంట్ల శ్రీనివాసరావు, రాజా, సావిత్రి, రోహిణి, ధనలక్ష్మి పాల్గొన్నారు.

పొగాకు రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలి

● బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్


ఒంగోలులో వేలాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ యశ్వంత్‌రావు, పలువురు అధికారులు

మద్దిపాడు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): పొగాకు రైతులకు గిట్టుబాటు ధర లభించేలా కంపెనీ ప్రతినిధులు సహకరించాలని బోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్‌కుమార్ కోరారు. బుధవారం వెల్లంపల్లి పొగాకు వేలం కేంద్రంలో వేలం ప్రారంభానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై కంపెనీల ప్రతినిధులు, రైతులతో మాట్లాడారు. పొగాకు సాగుకు ఈ ఏడాది ఖర్చులు విపరీతంగా పెరిగిపోయిన నేపథ్యంలో రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. నాణ్యమైన పొగాకును వేలం కేంద్రాలకు తీసుకువచ్చి మంచి ధరను పొందాలని, బేళ్లలో ఎలాంటి అన్య పదార్థాలు కలువకుండా చూడాలని సూచించారు. ఆనవాయితీగా చంద్రపాడు గ్రామ రైతులకు చెందిన 18 పొగాకు బేళ్లను వేలానికి తీసుకురాగా కంపెనీల వారు అన్ని బేళ్లను కిలో రూ.280 వంతున కొనుగోలు చేశారు. ఈ ఏడాది బోర్డు 10 మిలియన్ కేజీల పొగాకు అనుమతించగా సుమారుగా 15.75 మిలియన్ కేజీల పొగాకు రైతులు పండించినట్లు అంచనా. కంపెనీలు పూర్తిగా పాల్గొనే వరకూ క్లస్టర్ల వారీగా వేలం నిర్వహిస్తామని, వచ్చే నెల 8, 10 తేదీల నుంచి వేలాన్ని వేగవంతం చేస్తామని నిర్వహణాధికారి కోవి రామకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో బోర్డు ఆర్‌ఎం లక్ష్మణరావు, బోర్డు వైస్ చైర్మన్ బోడపాటి బ్రహ్మయ్య, సభ్యులు పొద వరప్రసాద్, రైతు సంఘం అధ్యక్షులు అబ్బూరి శేషగిరిరావు, వరహాల చౌదరి, ఉమామహేశ్వరరావు, శ్రీరామమూర్తి, సుధాకర్, గంగిరెడ్డి, హరిబాబు, సత్యనారాయణరెడ్డి, గోవిందరాజులు, వెంకయ్య, ఐటీసీ లీఫ్ మేనేజర్ శివకుమార్, జీపీఐ మేనేజర్ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ప్రైవేటు' అమ్మకాలు చేయొద్దు

ఒంగోలు(రూరల్): రైతులు తమ పొగాకును తొందరపడి ప్రైవేటు వ్యాపారులకు విక్రయించవద్దని, గిట్టుబాటు ధరలు వచ్చేలా తన వంతు కృషి చేస్తానని చైర్మన్ యశ్వంత్‌కుమార్ కోరారు. బుధవారం ఒంగోలు పొగాకు వేలంకేంద్రం-2లో పొగాకు వేలాన్ని ఆయన ప్రారంభించి మట్లాడారు. వేలంలో సర్వేరెడ్డిపాలెం, యరజర్ల గ్రామాలకు చెందిన 18బేళ్ల పొగాకు వేళ్లను ఉంచగా కిలో రూ.280 వంతున వ్యాపారులు కొనుగోలు చేశారు. కార్యక్రమంలో ఆర్‌ఎం లక్ష్మణరావు, వేలం నిర్వహణాధికారి తులసి, వైస్ చైర్మన్ బొడపాటి బ్రహ్మయ్య, సభ్యులు పొద వరప్రసాదు, లీఫ్ మేనేజర్ శివకుమార్, నాయకులు వడ్డెళ్ల ప్రసాద్, పెనుబోతు సునీల్, యర్రంనేని వెంకటశేషయ్య, గుడిపూడి రాజారావు, దొడ్డా సీతారామయ్య, బండారు రామాంజనేయులు, దేవబత్తిన వెంకన్న, చెరుకూరి వాసు తదితరులు పాల్గొన్నారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

● కలెక్టర్ అన్సారియా


కలెక్టర్ అన్సారియాకు జ్ఞాపికను అందజేస్తున్న నాగసత్యలత, రవికుమార్

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ఉన్నత స్థానానికి చేరుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక శ్రీహర్షిణి డిగ్రీ కాలేజీలో బుధవారం జరిగిన ఉద్యోగమేళాకు ముఖ్యఅతిథిగా కలెక్టర్ హాజరై ప్రసంగించారు. ఉద్యోగ నియామకాలకు ఎంపికైన అభ్యర్థులు చిన్న, పెద్ద కంపెనీ అని చూడకుండా కొంతకాలం అనుభవం వచ్చేంత వరకు పనిచేస్తే అభివృద్ధి చెందుతారన్నారు. మరో అతిథి ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ సతీమణి నాగసత్యలత మాట్లాడుతూ యువతకు ప్రైవేటు రంగంలో ఉపాధి అవకాశాలను కల్పించడం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అనంతరం నిర్వహించిన ఉద్యోగ మేళాలో 51 కంపెనీలు పాల్గొనగా 1,615 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వారికి ఇంటర్వ్యూలు నిర్వహించి 506 మందిని ఎంపిక చేసి 134 మందికి ఉద్యోగనియామక పత్రాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంప్లాయిమెంట్ అధికారి భరద్వాజ్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి రవితేజ, హర్షిణి విద్యాసంస్థల అధినేత గోరంట్ల రవికుమార్, స్టెప్ సీఈవో శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

ప్రతి ఓటుకు ఆధార్ అనుసంధానం : డీఆర్వో

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రతి ఓటుకు ఆధార్ అనుసంధానం చేస్తామని డీఆర్వో చిన ఓబులేషు తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో బుధవారం రాజకీయపార్టీల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రతినెలా రాజకీయ పార్టీలతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామని, జిల్లాలో పోలింగ్ కేంద్రాలు సరిగా ఉన్నాయా లేవా అనేది గుర్తిస్తామని పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రంలో 1400 ఓట్లు దాటితే కొత్త పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేస్తామన్నారు. రాజకీయ పార్టీలు బూత్ లెవల్ ఏజెంట్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. జిల్లాలో చనిపోయిన వారి ఓట్లను తొలగించేందుకు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో ఒంగోలు, కనిగిరి ఆర్డీవోలు లక్ష్మీప్రసన్న, ఎం.కేశవర్ధనరెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎం.వెంకట శివరామిరెడ్డి, ఎస్.జాన్సన్, కుమార్, వరకుమార్, ఎంవీ.సత్యనారాయణ, కలెక్టరేట్ ఏవో శ్రీనివాసరావు, జిల్లా ఎన్నికల సెల్ సూపరిండెంట్ రాజ్యలక్ష్మి, పలు రాజకీయపార్టీల ప్రతినిధులు వెంకట్రావు, డీఎస్.క్రాంతికుమార్, ఎస్కే.రసూల్, బి.రాజశేఖర్, గుర్రం సత్యం, వేశపోగు సుదర్శన్, వెంకట స్వామి, రమేష్, ఎన్నికల సెల్ అధికారులు రాజశేఖర్‌రెడ్డి, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

బీసీల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

● టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని

ఒంగోలు నగరం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం బీసీల అభ్యున్నతి కోసం కృషి చేస్తోందని, ఈక్రమంలో ఆదరణ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ కోరారు. బుధవారం స్థానిక కలెక్టర్ సమావేశం హాలులో జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ ఆదరణ పథకం కింద కులవృత్తులు చేసుకుంటున్న వారికి 90 శాతం సబ్సిడీతో పరికరాలను అందజేస్తుందన్నారు. మహిళకు కుట్టుమిషన్ నేర్పించి మిషన్‌లను కూడా ఉచితంగానే అందిస్తుందని చెప్పారు. బీసీ కార్పొరేషన్ ఈడీ వెంకటేశ్వరావు మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా అన్ని ముఖ్య కేంద్రాల్లో మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ ఇస్తామన్నారు. సమావేశంలో పలు బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

బౌద్ధంతోనే సర్వ మానవ సంక్షేమం

ఒంగోలు(రూరల్), మార్చి19(ఆంధ్రజ్యోతి): బౌద్ధధర్మంతోనే సర్వమానవ సంక్షేమం సాధ్యమని ప్రభుత్వ వైద్యశాల ప్రొఫెసర్ డాక్టర్ సీహెచ్.సుధాకరరావు పేర్కొన్నారు. బౌద్ధధర్మ ప్రచార సమితి ఆధ్వర్యంలో బుధవారం ఒంగోలులో ప్రచార యాత్రను నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు చావలి సుధాకరరావు, చుండూరి రంగారావు, డీఈసీహెచ్ సుధీర్‌బాబు, ఇందుర్తి రంగారావు, వై.మహేష్, గుంటూరి మాస్తాన్‌రావు, పెద్దన్న, సుందరం, ఏఎల్.ప్రసాద్, సుబ్బారావు, జార్జి, జి.మురహరిరావు, బి.చెన్నకేశవులు, జి.నాగేశ్వరరావు, విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ పేరయ్య పాల్గొన్నారు.

మహిళల మనోబలానికి ప్రతీక సునీతా విలియమ్స్

ఒంగోలు కల్చరల్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మహిళల మనోబలానికి ప్రతీక సునీతా విలియమ్స్ అని ఏపీ మహిళాభ్యుదయ సమితి అధ్యక్షురాలు తేళ్ల అరుణ అన్నారు. తొమ్మిది నెలలు అంతరిక్షంలో ఉండి బుధవారం భూమి మీదకు తిరిగివచ్చిన సునీతా విలియమ్స్‌ను అభినందిస్తూ స్థానిక హౌసింగ్ బోర్డు శక్తిసదన్‌లో సమితి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో సింహాద్రి జ్యోతిర్మయి, మారేపల్లి సూర్యకుమారి, నాళం నరసమ్మ, బీరం అరుణ, శ్రీదేవి, భాను, కనకదుర్గ, నాగేంద్రమ్మ పాల్గొన్నారు.

టీకాల కార్యక్రమం పరిశీలన

సంతనూతలపాడు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): పేర్నమిట్టలో బుధవారం జరిగిన గాలికుంటు టీకాల కార్యక్రమాన్ని డీఏహెచ్‌వో డాక్టర్ బేబీరాణి పరిశీలించారు. 54 పశువులకు టీకాలను వేశారు. కార్యక్రమంలో డాక్టర్ చిరంజీవి, సిబ్బంది పాల్గొన్నారు.

కేజీబీవీ అడ్మిషన్ల నోటిఫికేషన్ విడుదల

ఒంగోలు విద్య, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కాస్తూర్బాగాంధీ బాలికావిద్యాలయాల్లో(కేజీబీవీ) 2025-26 విద్యాసంవత్సరంలో 6,11 తరగతుల్లో ప్రవేశాలు, 7,8,9,10,12 తరగతుల్లో ఖాళీ సీట్ల భర్తీ కోసం అడ్మిషన్ నోటిఫికేషన్ విడుదలైంది. ఈ మేరకు సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అడ్మిషన్లకు ఈనెల 22నుంచి ఏప్రిల్ 11వ తేదీ వరకు ఆన్‌లైన్ అప్లికేషన్లు స్వీకరించనున్నారు. అనాథ, బడిబయట పిల్లలు, బడిమానేసిన వారు(డ్రాఅవుట్), పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న బాలికలు మాత్రమే దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తులను కేజీబీవీ వెబ్‌సైట్ నుంచి పొందవచ్చు. అడ్మిషన్‌కు ఎంపికైన విద్యార్థులకు ఫోన్ మేసేజ్ ద్వారా సమాచారం పంపుతారు. అన్ని కేజీబీవీల నోటీసు బోర్డుల్లో కూడా నోటిఫికేషన్ వివరాలు ఉంచారు. సమాచారం కోసం 7075159996, 7075039990 సెల్ నంబర్లలో సంప్రదించాలని ఉత్తర్వుల్లో కోరారు.

మల్లు స్వరాజ్యం స్ఫూర్తితో ఉద్యమించాలి

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : మహిళా ఉద్యమ నేత మల్లు స్వరాజ్యం స్ఫూర్తితో సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం తృతీయ వర్ధంతి కార్యక్రమం బుధవారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో జరిగింది. ముందుగా స్వరాజ్యం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు బి.రాజ్యలక్ష్మి, వై.అంజనీదేవి తదితరులు పాల్గొన్నారు.

రైజ్‌లో వర్క్‌షాప్

ఒంగోలు విద్య, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని రైజ్ కృష్ణసాయి ప్రకాశం గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూట్‌లో ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరం సీఎస్‌ఈ విభాగానికి చెందిన ఏఐ అండ్ ఎంఎల్, డీఎస్ విద్యార్థులకు గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న వర్క్‌షాప్ బుధవారంతో ముగిసిందని కళాశాల కరస్పాండెంట్ శిద్దా హనుమంతరావు తెలిపారు. హైదరాబాద్ హాక్‌బోట్ సంస్థ శిక్షకులు నవీన్‌నాయక్, వి.హర్షితలు విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, మిషన్‌లెర్నింగ్ టూల్‌ను వివరించారు. కళాశాల డైరెక్టర్ ఏవీ.భాస్కరరావు మాట్లాడుతూ యూనివర్శిటీ సిలబస్‌తో పాటు ఇటువంటి వర్క్‌షాపులు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమన్నారు. గౌరవ చైర్మన్ ఇస్కాల చిన రంగమన్నార్ మాట్లాడుతూ విద్యార్థులు తమ నైపుణ్యాలను పెంపొందించుకునేందుకు ఇవి ఎంతో దోహదపడతాయని చెప్పారు. కార్యక్రమంలో సీఎస్‌ఈ విభాగాధిపతులు కె.నారాయణరావు, జి.భార్గవి, అధ్యాపకులు పాల్గొన్నారు.

26న ధర్నా : సీపీఎం

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : ఇళ్ళ పట్టాలు, టిడ్కో ఇళ్ళు, పగటిపూట మంచినీటి సరఫరా కోసం ఈనెల 26వతేదీన కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నాను విజయవంతం చేయాలని సీపీఎం నాయకులు కోరారు. ఒంగోలులోని సీపీఎం కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులు రమేష్, తంబి శ్రీనివాసులు మాట్లాడారు. నగరంలో పలు డివిజన్లలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ధర్నాను నిర్వహిస్తున్నట్లు వారు చెప్పారు.

కొత్త ఓటర్లను చేర్పించాలి

కొండపి, మార్చి19 (ఆంధ్రజ్యోతి): అర్హత ఉన్నవారు ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు బీఎల్వోలు అవగాహన కల్పించాలని ఈఆర్వో కుమార్ అన్నారు. బుధవారం కొండపిలోని మండల పరిషత్ సమావేశం హాలులో బీఎల్వోలకు జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటర్లకు ఆధార్ కార్డు అనుసంధానం చేసేందుకు ఓటర్ల ఆధార్ కార్డులు సేకరించుకోవాలని అన్నారు. సమావేశంలో తహసీల్దార్లు జ్వాలా నరిసింహం, వి.పుల్లారావు, అంజనేయులు, జనార్ధన్, డిప్యూటీ తహసీల్దార్ డేవిడ్‌రాజు పాల్గొన్నారు.

బీసీలు అభివృద్ధి చెందాలి

పొన్నలూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఏపీ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం బీసీ వాణిజ్య ప్రతినిధుల రాష్ట్ర సదస్సు మండలంలోని వెల్లటూరు గ్రామంలో నిర్వహించారు. ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శంకర్రావు ఈ సందర్భంగా మాట్లాడుతూ బీసీలందరూ ఐక్యంగా అభివృద్ధి చెందాలని సూచించారు. బీసీలు ఆర్థికంగా ఎదగడానికి సంఘం తనవంతు సహకారం అందిస్తుందన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి

కొత్తపట్నం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): రైతులు ప్రకృతి వ్యవసాయం చేసేలా ప్రోత్సహించాలని జిల్లా ప్రకృతి వ్యవసాయశాఖ జిల్లా పీడీ సుభాషిణి కోరారు. బుధవారం కొత్తపట్నంలో ఆమె మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు తమ విస్తీర్ణం వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం విజయలక్ష్మి, విజయమ్మ పాల్గొన్నారు.

50శాతం రాయితీపై పరికరాలు

సంతనూతలపాడు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): రైతులకు 50శాతం రాయితీపై వ్యవసాయ పరికరాలను ఇస్తుననట్లు ఏవో పావని తెలిపారు. బుధవారం పేర్నమిట్ట, మంగమూరులో పొలంపిలుస్తోంది నిర్వహించారు. ఆ శాఖ అధికారి వివి.శేషమ్మ పాల్గొన్నారు.

కారును ఢీకొన్న అంబులెన్స్.. ఒకరికి గాయాలు

సింగరాయకొండ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): సింగరాయకొండ జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న కారు ఆకస్మాత్తుగా నెమ్మదించడంతో వెనుక వస్తున్న అంబులెన్స్ ఢీకొట్టింది. దీంతో కారులోని ఎయిర్ బెలూన్స్ తెరుచుకోవడంతో అందులో ప్రయాణిస్తున్న వారు సురక్షితంగా బయటపడ్డారు. డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన బుధవారం జరిగింది. టంగుటూరు మండలం కాకుటూరుపాలెం నుంచి అమృత్‌కుమార్ తమ కుటుంబం సభ్యులతో శ్రీకాళహస్తికి బయల్దేరారు. సింగరాయకొండలోని కందుకూరు ఫ్లైఓవర్ వద్దకు చేరుకునేసరికి కారు నెమ్మదించింది. దీంతో వెనుకవైపు విజయవాడ నుంచి బెంగుళూరు వెళ్తున్న అంబులెన్స్ బలంగా ఢీకొట్టింది. దీంతో కారు నుజ్జునుజ్జయింది. అంబులెన్స్ ముందుభాగం కూడా పాక్షికంగా దెబ్బతింది. సకాలంలో ఎయిర్ బెలూన్స్ తెరుచుకోవడంతో కారులో ప్రయాణిస్తున్న ఐదుగురు సురక్షితంగా బయటపడ్డారు. కారు డ్రైవర్ సాయికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న టంగుటూరు హైవే మొబైల్ పోలీసులు శశిధర్‌రెడ్డి, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడిన కారు డ్రైవర్‌ను ప్రథమ చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

11మంది మందుబాబులకు జరిమానా

● ఒకరికి రెండు రోజుల జైలు

ఒంగోలు క్రైం, మార్చి19(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపిన 12మందిలో 11 మందికి రూ.31వేల జరిమానా, వారిలో ఒకరికి రెండు రోజులు బెయిలు లేని జైలు, రూ.5వేల జరిమానా విధిస్తూ న్యాయాధికారి వీఎస్.రామారావు బుధవారం తీర్పు ఇచ్చారు. ఒంగోలు నగరంలో ట్రాఫిక్ పోలీసుల తనిఖీలో 12మంది మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడగా వారిని కోర్టులో హాజరుపరిచామని, పై విధంగా నిందితులకు కోర్టు శిక్ష విధించిందని ట్రాఫిక్ సీఐ పాండురంగారావు తెలిపారు. రహదారి నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలని ఆయన కోరారు.

వృద్ధుడి బలవన్మరణం

ఒంగోలు క్రైం, మార్చి19(ఆంధ్రజ్యోతి): రైలు కింద పడి వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఒంగోలు రైల్వేస్టేషన్ సమీపంలోని ఉత్తరం వైపున జరిగింది. స్థానిక రంగుతోటలో నివాసం ఉంటున్న బోయపాటి వెంకట్రావు(70) అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. బుధవారం సాయంత్రం 5 గంటల సమయంలో ఆయన తన కుమార్తె విజయలక్ష్మికి ఫోన్ చేసి తాను ఆత్మహత్య చేసుకునేందుకు రైల్వేస్టేషన్‌కు వెళుతున్నాని తెలిపాడు. రైల్వేస్టేషన్ సమీపంలోని అగ్రహారం గేటు సమీపంలో ఆయన తన కుమార్తెతో ఫోన్ మాట్లాడుతూనే రైలు కిందపడి బలన్మరణం చెందాడు. రైల్వే ఎస్‌ఐ అరుణకుమారి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బి.నిడమానూరులో ఇఫ్తార్ విందు

నాగులుప్పలపాడు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసం సందర్భంగా బి.నిడమానూరులోని ముస్లింలకు గ్రామ టీడీపీ నాయకుడు మారెళ్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బుధవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అంకిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, విజయ్, బి.శ్రీనివాసరావు, హరి, బుల్లయ్య, అయ్యప్ప, మౌలాలి, ఖాసిం, అల్లీసా, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కృషి

● స్పెషల్ కలెక్టర్ జ్యోతికుమారి

మద్దిపాడు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): గుండ్లకమ్మ ప్రాజెక్టు ప్రధాన ముంపు గ్రామాలైన ఘడియపూడి, గార్లపాడు నిర్వాసితుల కాలనీల్లోని ప్రధాన సమస్యలను పరిష్కరిస్తామని స్పెషల్ కలెక్టర్ జ్యోతికుమారి పేర్కొన్నారు. బుధవారం ఆయా కాలనీల శ్మశాన స్థలాల సమస్యల పరిష్కారం స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో మాట్లాడారు. గార్లపాడు ఆలయ ప్రహరీని, ఘడియపూడి శ్మశాన స్థలం తక్షణం ఇచ్చే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సృజనకుమార్, టీడీపీ నాయకులు చింతల శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ అన్నమనేని సుబ్బారావు, ముత్తనపల్లి రామలింగయ్య, నారాయణ, రామకృష్ణ, అంజిరెడ్డి, ఆర్‌వి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

కాపు కులంపై ఎందుకు వివక్ష ?

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : స్వయం ఉపాధి పథకాల ద్వారా అన్ని కులాల లబ్ధిదారులకు 21నుంచి 60 ఏళ్ళ వయస్సు అర్హతగా నిర్ణయించి తెలగ, బలిజ, కాపు, ఒంటరి కులాలకు 21నుంచి 50 ఏళ్ళ వరకు మాత్రమే పరిమితం చేయడాన్ని కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు కొక్కిరాల సంజీవకుమార్ ఒక ప్రకటనలో ఖండించారు. కూటమి ప్రభుత్వం తెలగ, బలిజ, కాపు, ఒంటరి కులాల వారికి మాత్రమే వయస్సు అర్హత తగ్గించడం తగదన్నారు. రాష్ట్రంలో తాము ఉన్నట్లా లేనట్లా అనేది అర్థం కాని పరిస్థితి ఏర్పడిందని, ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి పథకాల అర్హతకు ఈ కులాలకు కూడా 60 ఏళ్ళకు పెంచాలని ఆయన కోరారు.

ఎరువుల అక్రమ రవాణాపై నిఘా: అగ్రి డైరెక్టర్

అమరావతి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రసాయన ఎరువులు పక్కదారి పట్టకుండా నిరంతర నిఘా ఉంచాలని వ్యవసాయశాఖ డైరెక్టర్ డిల్లీరావు ఆదేశించారు. జిల్లా వ్యవసాయ, మార్క్‌ఫెడ్ అధికారులు, రైల్వే వ్యాగన్ రేక్ పాయింట్ అధికారులతో బుధవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వచ్చే ఖరీఫ్ అవసరాల కోసం ఎరువులను బఫర్ స్టాక్‌ను 2 లక్షల టన్నులకు పెంచనున్నట్టు చెప్పారు. ఎరువుల రవాణాలో ఖర్చులు అధికంగా ఉంటున్న విశాఖపట్నం, అన్నమయ్య, శ్రీసత్యసాయి జిల్లాలకు మూడు రైల్వే వ్యాగన్ రేక్ పాయింట్లు ఏర్పాటు చేయాలని కేంద్రానికి సీఎం చంద్రబాబు ప్రతిపాదనలు పంపారన్నారు. ఎరువులు సమృద్ధిగా వస్తున్నా.. కృత్రిమ కొరత, అధిక ధరలకు విక్రయం, అక్రమ తయారీ, రవాణా, వ్యవసాయేతర అవసరాలకు వినియోగాన్ని నియంత్రించాలని ఆదేశించారు.



గాయపడటానికి ముందు చర్చించుకుంటున్న ఏలూరి సాంబశివరావు, బీఎన్ విజయ్‌కుమార్



బంతి కోసం పరుగెడుతూ ముందుకు పడటంతో ముఖానికి అయిన గాయం

క్రికెట్ ఆడుతూ పడిన ఎమ్మెల్యే బీఎన్

- ముఖానికి తీవ్ర గాయం
- వైద్యశాలలో చికిత్స
- పదికుట్లు పడినట్లు సమాచారం
- విశ్రాంతి తీసుకోవాలని సూచించిన వైద్యులు
- ఫోన్‌లో మంత్రులు స్వామి, రవి పరామర్శ

ఒంగోలు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : క్రికెట్ పోటీలలో ఫీల్డింగ్ చేస్తూ సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్ గాయపడ్డాడు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా మూడు రోజుల పాటు శాసనసభ్యులకు వివిధ క్రీడా పోటీలను స్పీకర్ అయ్యన్నపాత్రుడు నేతృత్వంలో మంగళవారంనుంచి విజయవాడలోని ఇందిరా గాంధీ మునిసిపల్ స్టేడియంలో ఏర్పాటు చేశారు. తొలిరోజైన మంగళవారం రాత్రి క్రికెట్ పోటీలు నిర్వహించగా ఎమ్మెల్యే బీఎన్ ఆ పోటీలో పాల్గొన్నారు. ఫీల్డింగ్ చేస్తూ బంతి కోసం పరుగుపెడుతూ ఆయన ముందుకు పడిపోగా ముఖంపైన గాయాలు అయ్యాయి. నోటిలోపల కూడా గాయాలై రక్తస్రావం జరగడంతో వెంటనే వైద్యశాలకు తరలించారు. గొంతులో కుట్లు వేయాల్సి రావడంతో వైద్యులు పది కుట్ల వరకు వేసినట్లు సమాచారం. నాలుగైదు రోజులు ద్రవ ఆహారానికి పరిమితమై విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించారు. దీంతో విజయవాడలోని ఓ హోటల్‌లో విశ్రాంతి తీసుకుంటున్నారు. మంత్రులు డాక్టర్ స్వామి, గొట్టిపాటి రవికుమార్ ఇతర ఎమ్మె ల్యేలు ఫోన్‌లో బీఎన్‌ను పరామర్శించారు. సంతనూతలపాడు నియోజకవర్గముఖ్య నాయకులు పలువురు బుధవారం విజయవాడవెళ్లి పరామర్శించారు. అయితేనోటిలో కుట్లు వేయడంతో పెద్దగా మాట్లాడే అవకాశం లేనట్లు సమాచారం.

స్థానిక సంస్థల ఉప ఎన్నికలకు నోటిఫికేషన్

- మార్కాపురం, త్రిపురాంతకం ఎంపీపీ పదవులకు ఎన్నిక

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో స్థానిక సంస్థల్లో ఖాళీగా ఉన్న పదవులకు పరోక్ష పద్ధతిపై నియమించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీచేసింది. ఈనెల 27వతేదీన ఉప ఎన్నికలు నిర్వహించనున్నారు. ఎన్నికల కమిషన్ ఇచ్చిన ఆదేశాలతో జిల్లాలో ఖాళీగా ఉన్న పదవులను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్‌ను జారీ చేయనున్నారు. మార్కాపురం, త్రిపురాంతకం ఎంపీపీల పదవులకు ఉప ఎన్నిక జరగనుంది. పుల్లలచెరువు ఉపాధ్యక్ష పదవితో పాటు యర్రగొండపాలెం కో ఆప్షన్ సభ్యుల ఎన్నికలను ఆయా మండల పరిషత్ కార్యాలయాల్లో నిర్వహించనున్నారు. ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘం ఆదేశించడంతో తదనుగుణంగా జిల్లా పరిషత్ సీఈవో చిరంజీవి దృష్టి పెట్టారు. ఈనెల 27న ఉప ఎన్నికలు నిర్వహణ కోసం ఎన్నికల అధికారులను నియమించేందుకు కసరత్తు చేపట్టారు.కలెక్టర్ తమీమ్ అన్సారియా నుంచి అనుమతి వచ్చిన వెంటనే ఎన్నికల అధికారులను నియమించనున్నారు.

వెట్టి నుంచి విముక్తి

బానిస బంధనాల నుంచి సేచ్ఛలోకి
ఏడు కుటుంబాలకు రిలీఫ్ సర్టిఫికెట్లు, దుస్తులు, నిత్యావసర సరుకులు అందజేసిన కలెక్టర్





తమను ఏ విధంగా ఇబ్బంది పెట్టారో వివరిస్తున్న బాధిత మహిళలు (ఇన్‌సెట్లో) గిరిజన పిల్లలకు స్వీట్లు అందిస్తున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : వారంతా రోజువారీ కూలీలు..పేదరికాన్ని ఆసరాగా చేసుకొని ఉపాధి కల్పిస్తామని ఆశ చూపారు. వారి అమాయకత్వాన్ని అదునుగా చేసుకొని బానిసత్వంలో బంధించారు. ఉన్న గ్రామానికి దూరంగా దీన స్థితిలో కాలం వెళ్లదీస్తున్నారు. తాము పడుతున్న బాధలను ఎవరికీ చెప్పుకోలేని పరిస్థితిలో ఉండగా వారికి అధికారులు విముక్తి కల్పించారు. కొత్తపట్నం మండలం అలూరు. ఈతముక్కల గ్రామాలకు చెందిన ఏడుకుటుంబాలకు చెందిన 33 మంది చిలకలూరిపేట సమీపంలోని జామాయిల్ తోటల పనులకు వెళ్లారు. వారి అమాకత్వాన్ని, అవసరాన్ని ఆసరా చేసుకున్న యజమాని వారితో వెట్టిచాకిరి చేయిస్తున్నట్లు అధికారుల దృష్టికి వచ్చింది. వారిలో గర్భిణి, బాలింతల తోనూ బలవంతంగా పనిచేయిస్తున్నట్లు యానాది సంఘాల నాయకులు, ఇతర స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కలెక్టర్ తమీమ్ అన్సారియా దృష్టికితెచ్చారు. కలెక్టర్ అన్సారియా ఆదేశాలతో రెవెన్యూ, ఇతర సంబంధిత శాఖల అధికారులు రంగంలో దిగి ఆ జామాయిల్ తోట యజమాని నుంచి ఏడు కుటుంబాల్లోని 33 మందికి విముక్తి కల్పించారు. విముక్తి పొందిన ఆ ఏడు కుటుంబాలకు బుధవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో రిలీఫ్ సర్టిఫికెట్లతో పాటు స్వీట్లు, దుస్తులు, ఇతర వంట సరుకులను అందించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చట్ట ప్రకారం ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందించడంతో పాటు జీవనోపాధికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అమానవీయ స్థితిలో ఉన్న తమకు స్వేచ్ఛ కల్పించిన కలెక్టర్‌కు ఆ బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు ఆర్డీవో లక్ష్మీ ప్రసన్న, డీఎస్‌వో పద్మశ్రీ, పౌరసరఫరాల సంస్థ డీఎం వరలక్ష్మి, కొత్తపట్నం తహసీల్దార్ మధుసూదన్, స్వచ్ఛందసంస్థల ప్రతినిధులు ఆర్. సునీల్‌కుమార్, శ్యామ్, బాషా,డేవిడ్ తదితరులు ఉన్నారు.

కళతప్పిన గెలాక్సీ స్టాల్స్

- ముగిసిన జియామిన్ స్టోనా
- చైనాలో ఆర్థిక మందగమనంతో తీవ్ర నిరాశ
- క్వార్ట్జ్,ఇంజనీరింగ్ స్టోన్‌ల వైపు బయ్యర్ల ఆసక్తి
- చుక్కెదురుతో వెనుదిరిగిన గ్రానైట్ యజమానులు



స్టోనాలో ఏర్పాటు చేసిన క్వార్ట్జ్, ఇంజనీరింగ్ స్టోన్ కళాకృతులు

చీమకుర్తి, మార్చి19(ఆంధ్రజ్యోతి): నాలుగురోజులపాటు నిర్విరామంగా చైనాలో జరిగిన జియామిన్ స్టోనా బుధవారంతో ముగిసింది. గంపెడాశలతో చైనాకు వెళ్లిన గెలాక్సీ గ్రానైట్ యజమానులకు నిరాశను మిగిల్చింది.సంక్షోభ పరిస్థితుల నుంచి గెలాక్సీ గ్రానైట్ పరిశ్రమను జియామిన్ స్టోనా ప్రదర్శన గట్టెక్కిస్తుందన్న నమ్మకంతో వ్యవప్రయాసలకోర్చి చైనాకు వెళ్లిన గ్రానైట్ ఓనర్లకు చేదు అనుభవమే మిగిలింది. వెళ్లామా..వచ్చామా అన్నతీరులో మా చైనా సందర్శన జరిగిందని ఓ గ్రానైట్ బడా వ్యాపారి వ్యాఖ్యానించటం ఇందుకు నిదర్శనం. చైనా దేశంలో జియామిన్ వద్ద ప్రపంచ ప్రసిద్ధి గాంచిన స్టోనా ప్రదర్శన ఈనెల 16వ తేదీన ప్రారంభమై 19వతేదీన ముగిసింది. గెలాక్సీ గ్రానైట్ పరిశ్రమకు ఎంతో ముఖ్యమైన ఈ స్టోనా ఈసారి ఓనర్ల ఆశలను వమ్ముచేసింది. చీమకుర్తి పరిసర ప్రాంతాల్లో విస్తరించిన గెలాక్సీ గ్రానైట్ క్వారీలనుంచి వెలికితీసిన ముడిరాయి ఒకప్పుడు ఎనభైశాతానికి పైగా చైనాకు ఎగుమతి అయ్యేది. కరోనా తదుపరి నెలకొన్న పరిస్థితులతో సగానికి సగం ఎగుమతులు పడిపోయాయి. చైనా బయ్యర్లకు వీసాలు మంజూరు కూడా సంక్లిష్టం కావటంతో గెలాక్సీ ఎగుమతులపై ప్రభావం చూపింది. ఈ పరిస్థితుల్లో స్థానిక మార్కెట్‌పై ఎక్కువగా ఆధారపడిన ఓనర్లకు జియామిన్ స్టోన్ ఫెయిర్ ఒక ఆశాదీపంలా కనపడింది. చైనాకు వెళ్లి నేరుగా బయ్యర్లతో వ్యాపార ఒప్పందాలు కుదుర్చుకుందామనే ఆలోచనతో పోయిన గ్రానైట్ ఓనర్లకు చుక్కెదురయింది.



అందమైన కళాకృతులతో రంగుల క్వార్ట్జ్ స్టోన్లు

సవాళ్లుగా ఆర్థిక మందగమనం

చైనాలో నెలకొన్న ఆర్థిక మందగమనంతో కనస్ట్రక్షన్ రంగం డీలాపడి నిర్మాణరంగం నత్తనడకన నడుస్తుండటంతో బయ్యర్లు పెద్దగా ఆసక్తి ప్రదర్శించలేదు. ఇదే సమయంలో గెలాక్సీ గ్రానైట్ కన్నా తక్కువ రేటులో,సరికొత్త ఆకర్షణతో స్టాల్స్‌లో ప్రదర్శించబడిన క్వార్ట్జ్,ఇంజనీరింగ్ స్టోన్‌లపై బయ్యర్లు ఆసక్తి ఎక్కువగా కనపరచటం గెలాక్సీ గ్రానైట్ యజమానులకు మింగుడుపడకుండా ఉంది. సరికొత్త రంగులతో కళ్లకు ఆహ్లాదకరంగా కనబడటమే కాక గెలాక్సీ గ్రానైట్‌తో పోలిస్తే చాలా తక్కువ దరలో లభ్యమవుతుండటంతో బయ్యర్ల చూపు ఇంజనీరింగ్ స్టోన్స్‌పై పడింది. దీంతో గ్రానైట్ ఉత్పత్తులతో ఏర్పాటు చేసిన స్టాల్స్ కళ తప్పాయి. మొత్తం మీద జియామిన్ స్టోనా గతం కన్నా సందర్శకులు, బయ్యర్ల హాజరు ఎక్కువగా ఉండి సక్సెస్ అయినా గెలాక్సీ గ్రానైట్ పరిశ్రమకు ఒనగూరిన ప్రయోజనం లేకపోవటం బాధాకరంగా ఉందని స్టోనాకు హాజరైన ఓనర్లు పెదవి విరిచారు. ఇక ప్రత్యామ్నాయ దేశాలు, స్థానిక మార్కెట్ మీద ఎక్కువగా దృష్టిసారించి వ్యాపారాన్ని పెంచుకోవాలనే తలంపులో వ్యాపారులుండటం జియామిన్ స్టోనా తెచ్చిన పరిణామంగా కనబడుతోంది.

పది పరీక్షల్లో అంతా ఓపెన్..!



కాపీలు అందించేందుకు ఎర్రగొండపాలెం జూనియర్ కళాశాల ప్రహరీ దూకుతున్న విద్యార్థులు

ఎర్రగొండపాలెం రూరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : ఎర్రగొండపాలెం మండల కేంద్రంలో పదోతరగతి పరీక్షలు 8 కేంద్రాలలో జరుగుతున్నాయి. రెగ్యులర్‌తో పాటు ఓపెన్ పది పరీక్షలు కూడా జరుగుతున్నాయి. అయితే కొన్ని కేంద్రాలలో ఇటు రెగ్యులర్‌తో పాటు ఓపెన్ పరీక్షలు అంతా ఓపెన్‌గానే జరుగుతున్నాయనే విమర్శలు ఉన్నాయి. బుధవారం పరీక్షా కేంద్రాల వద్ద రెగ్యులర్ విద్యార్థుల తల్లిదండ్రుల కంటే ప్రైవేటు, ప్రభుత్వ ఉపాధ్యాయులు ఉండటం విశేషం. వారే పిల్లలను తీసుకొచ్చి కాపీలు పంపించారు. అయితే పరీక్షాకేంద్రాలలో ఉన్న సిబ్బంది దగ్గర ఉండి తలుపులు మూయించి మరీ కాపీంగ్ చేయిస్తున్నారు.

పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన మార్కాపురం సబ్ కలెక్టర్

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రాన్ని మార్కాపురం సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్ బుధవారం పరిశీలించారు. విద్యార్థులకు అవసరమైన వసతులు అందుబాటులో ఉండాలని అన్నారు. పరీక్షా కేంద్రంలో ఎటువంటి మాస్ కాపీంగ్ జరగకూడదని అన్నారు. పరీక్షా కేంద్రం డీవో, డీటీ నలగాటి మల్లికార్జున ఆయన వెంట ఉన్నారు.

ఆగిఉన్న స్కూల్ బస్సు దగ్ధం



కాలిపోతున్న ప్రైవేట్ స్కూలు బస్సు

పొన్నలూరు, మార్చి19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెరువుకొమ్ముపాలెం గ్రామంలో ఆగి ఉన్న ప్రైవేటు స్కూల్ బస్సు బుధవారం సాయంత్రం ప్రమాదవశాత్తు పూర్తిగా దగ్ధం అయ్యింది. కందుకూరులోని ఓ ప్రైవేటు కళాశాలకు చెరువుకొమ్ముపాలెం పరిసర గ్రామాల నుంచి విద్యార్థులను తీసుకెళ్లి వచ్చే బస్సు యథాప్రకారం బుధవారం సాయంత్రం స్కూల్ నుంచి విద్యార్థులను తీసుకువచ్చింది. విద్యార్థులు దిగిపోయాక డ్రైవర్ బస్సును నిలిపి లాక్ చేసుకున్నాడు. సుమారు గంట సేపటి తర్వాత బస్సులో నుంచి పొగలు వచ్చి కాలిపోయింది. వాహనంలోని తీగలు అంటుకుని మంటలు రేగాయని భావిస్తున్నారు. పొన్నలూరు ఎస్సై అనూక్ ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

భూకబ్జా కేసులపై దృష్టి సారించండి

- దర్యాప్తులో వేగం పెంచండి
- సిట్ బృందానికి ఎస్పీ సూచన

ఒంగోలు క్రైం,మార్చి19(ఆంధ్రజ్యోతి): నకిలీ పత్రాలు తయారు చేసి భూ కబ్జాలకు పాల్పడిన వారిపై ఏర్పాటు చేసిన సిట్ అధికారులతో ఎస్పీ ఏఆర్. దామోదర్ సమీక్షించారు. గత ప్రభుత్వంలో జరిగిన భూ కుంభకోణాలపై ఏర్పాటైన సిట్‌లో మొత్తం 109 కేసులు నమోదు కాగా వాటికి సంబంధించిన చార్జిషీట్‌లు కోర్టులో దాఖలు చేయాల్సి ఉంది. సిట్ ఆర్భాటంగా వేశారుకానీ, ఇప్పటికీ బాధితులకు న్యాయం జరగలేదు. వారికి న్యాయం జరగాలంటే కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాల్సి ఉంది. గతంలో ఎన్నికలు సమీపించడంతో హడావుడిగా సిట్ కార్యకలాపాలు నిలిపివేశారు. దీంతో తిరిగి సిట్‌లో ఉన్న పెండింగ్ కేసులపై పోలీసులు దృష్టి సారించి దర్యాప్తు వేగవంతం చేయాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ కోరారు. బుధవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఎస్పీ సిట్ కేసులు దర్యాప్తు గురించి పలు సూచనలు చేశారు. నకిలీ పత్రాలు తయారు , స్టాంపులు, ఫోర్జరీ లాంటి విషయాలలో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని అన్నారు. అదేవిధంగా రెవెన్యూ, మున్సిపల్, పంచాయతీ రాజ్, రిజిస్ట్రేషన్ శాఖలతో సమన్వయం చేసుకొని దర్యాప్తు వేగవంతం చేయాలన్నారు.

ఒకే ప్రాంతంలో, ఒకే తరహాలో జరిగిన కేసులన్నీ ఒక అధికారి దర్యాప్తు చేసేలా చర్యలు తీసుకున్నారు. కేసుల దర్యాప్తు వేగవంతం చేసి చార్జిషీట్లు దాఖలు చేయాలని కోరారు. నిందితులను సాక్ష్యాధారాలతో అరెస్టు చేయాలని అన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ కే.నాగేశ్వరరావు డీఎస్పీలు ఆర్.శ్రీనివాసరావు,లక్ష్మీనారాయణ, నాగరాజు, సాయిఈశ్వర్ యశ్వంత్, డీసీఆర్బీ సీఐ దేవప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తవాటర్‌షెడ్‌ల ఆమోదానికి చర్యలు తీసుకోండి

- కేంద్ర మంత్రి పెమ్మసానిని కలిసి కోరిన సత్య



కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సత్య, పక్కన విజయనగరం ఎంపీ అప్పలనాయుడు

ఒంగోలు కార్పొరేషన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : ఏపీ మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను బుధవారం ఢిల్లీలో కలిసి కొత్త వాటర్ షెడ్‌ల ఆమోదానికి చర్యలు తీసుకోవాలని వినతి పత్రం అందజేశారు. విజయనగరం పార్లమెంట్ సభ్యుడు కలిశెట్టి అప్పలనాయుడుతో పెమ్మసానిని కలిసిన సత్య పలు అంశాలపై మాట్లాడారు. భూవనరుల శాఖ, భారత ప్రభుత్వం 2021 ఆర్థిక సంవత్సరంలో ఎనిమిది డబ్ల్యూడీసీ పీఎంకేఎస్‌వై 2.0 ప్రాజెక్టులను అనుమతించిందని, ఈ ప్రాజెక్టుల అమలు 2025-2026 ఆర్థిక సంవత్సరంలో ముగుస్తుందని తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లాలో 1.50 లక్షల హెక్టార్లకన్నా ఎక్కువ భూమిని డబ్ల్యూడీసీ పీఎంకేఎస్‌వై 2.0 ప్రోగ్రామ్ కింద పునరుత్పత్తి చేయడానికి 41 కొత్త వాటర్ షెడ్ ప్రాజెక్టులను ఆమోదించాలని కేంద్ర మంత్రి పెమ్మసానిని కోరారు. ఈ ప్రాజెక్టుల అమలు ఆధారంగా వ్యవసాయ ఉత్పత్తి, గ్రామీణ ప్రాంతాల సామాజిక, ఆర్థిక స్థితిని మెరుగుపరచడంలో సహాయపడుతుందని వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రకాశం జిల్లా అభివృద్ధికి అన్ని విధాలుగా సహాయం చేస్తానని తెలిపారు.

సజావుగా పది పరీక్షలు

- 99.24 శాతం మంది హాజరు

ఒంగోలు విద్య, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పదవ తరగతి పరీక్షలు సజావుగా జరుగుతున్నాయి. బుధవారం జరిగిన హిందీ పరీక్షకు 99.24 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. మొత్తం 29,513 మందికి 29,290 మంది హాజరు కాగా 223 మంది గైర్హాజరయ్యారు. జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్‌కుమార్ ఒంగోలు, కొత్తపట్నం, ఈతముక్కల, సింగరాయకొండ మండలంలోని ఎనిమిది పరీక్షా కేంద్రాలను తనిఖీచేశారు. 25సిట్టింగ్ స్క్వాడ్లు, 9 ఫ్లయింగ్‌స్క్వాడ్లు 90 పరీక్షా కేంద్రాలను తనిఖీలు చేశారు.

ఓపెన్ పరీక్షలకు 402 మంది గైర్హాజరు

జిల్లాలో జరుగుతున్న ఏపీ ఓపెన్ స్కూలు సొసైటీ పదవ తరగతి పరీక్షలకు బుధవారం 402 మంది గైర్హాజరైనట్లు జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్‌కుమార్ తెలిపారు. ఇంగ్లీషు పరీక్షకు 1,377 మంది హాజరుకావాల్సి ఉండగా 975 మంది హాజరయ్యారు. ఆరుఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు 23 పరీక్షా కేంద్రాలను సందర్శించారు. పరీక్షల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదని డీఈవో తెలిపారు.



ప్రసన్నాంజనేయస్వామికి పూజలు చేస్తున్న గోపీచంద్, కుటుంబ సభ్యులు

శింగరకొండలో గోపీచంద్ ప్రత్యేక పూజలు

అద్దంకి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు పుల్లెల గోపీచంద్ కుటుంబ సభ్యులతో కలిసి శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో బుధవారం సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గోపీచంద్, కుటుంబసభ్యులను పూజారులు ఆశీర్వదించి సత్కరించారు. అక్కడి నుంచి కొండపైన ఉన్న లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలోనూ ప్రత్యేక పూజలు నిర్వహించారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న ఈఈ

ఎన్ఎస్‌పీ ఈఈగా సతీష్ బాధ్యతల స్వీకరణ

అద్దంకి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా సతీష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఒంగోలు డివిజన్‌లో డీఈగా పనిచేస్తూ ప్రమోషన్‌పై అద్దంకి ఈఈగా నియమించడంతో బుధవారం బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలోని డీఈలు రామకృష్ణ, స్వామి, లక్ష్మీనారాయణ, అనూరాధ, జయశంకర్, ఏఈ లు, కార్యాలయం సిబ్బంది ఈఈ సతీష్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సాగునీటి సరఫరా తీరు, తాగునీటి చెరువులు నింపటం తదితర అంశాలపై అధికారులతో చర్చించారు.

23న మార్టూరులో శ్రీనివాస కల్యాణం

మార్టూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం ఈనెల 23న ఆదివారం ఉదయం మార్టూరులో శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి కల్యాణ మండపంలో నిర్వహిస్తారు. తిరుమల దేవాలయం ప్రధాన అర్చకుడు వేణుగోపాల దీక్షితులు ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించనున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

అవీ..ఇవీ

రేపు అభయాంజనేయస్వామి తిరునాళ్ల



పూజలందుకుంటున్న అభయాంజనేయస్వామి

పొదిలి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉప్పలపాడు గ్రామ సమీపంలో, ముసినది ఒడ్డున ఏలూరు పంచాయతీ పరిధిలో వెలసిన అభయాంజనేయ, వరసిద్ధి వినాయక స్వామివార్ల 15వ వార్షికోత్సవ తిరునాళ్ల శుక్రవారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. కర్నూల్-ఒంగోలు ప్రధాన రహదారిలో ఉప్పలపాడు, మర్రిచెట్లపాలెం మధ్యలోని ముసినది బ్రిడ్జి సమీపంలో వెలసిన అభయాంజనేయ స్వామి, సీతారాముల, వరసిద్ధి వినాయక స్వామి తిరునాళ్లలో ఈ నెల 21న శుక్రవారం ఉదయం నుండి ఆకుపూజ, పొంగళ్ల కార్యక్రమాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. కావున వేలాదిమంది భక్తులు తరలివచ్చి అభయాంజనేయస్వామి మహోత్సవాన్ని జయప్రదం చేయాలని కమిటీ సభ్యులు కోరారు. అనంతరం స్వచ్ఛందంగా వివిధ రకాల సామాజిక వర్గాల ఆధ్వర్యంలో అన్నదాన, కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా రాత్రికి వివిధ రాజకీయపార్టీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే విద్యుత్ ప్రభలపై, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. వాటితో పాటు కోలాటం, పాటకచేరీలు, బ్రహ్మంగారి నాటకాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తిరునాళ్ల సందర్భంగా ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఎస్ఐ వేమన పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

సికిల్‌షెల్ ఎనీమియాపై గిరిజనులు అప్రమత్తంగా ఉండాలి

పెద్దదోర్నాల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): చెంచు గిరిజనులు సికిల్‌షెల్ ఎనిమియా(ఒకరకమైన రక్తహీనత)పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆ ప్రాజెక్టు అధికారి కే.రాహుల్ అన్నారు. మండలంలోని పెద్ద బొమ్మలాపురం పరిధిలోని వీర భద్రాపురం గూడెం గిరిజనులకు సికిల్‌షెల్ ఎనిమియా లక్షణాలపై అవగాహన కల్పించారు.

పదోతరగతి పరీక్షలకు నలుగురు గైర్హాజరు

పెద్ద దోర్నాల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పదవతరగతి పరీక్షలకు నలుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈవో మస్తాన్‌నాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 284 మందికి గానూ 281, రవీంద్ర హైస్కూల్‌లో 150మందికి 150 మంది, వసంత జూనియర్ కళాశాలలో 150 మందికి 149 మంది విద్యార్థులు హాజరయ్యారు. మూడు పరీక్షా కేంద్రాల్లో మొత్తం 584 మంది విద్యార్థులకు గానూ 580 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. ఈ క్రమంలో ఫ్లైయింగ్ స్క్వాడ్ గిరిధర శర్మ పరీక్షా కేంద్రాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

పరీక్షా కేంద్రాలను పరిశీలించిన పోలీసులు



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీఐ సుబ్బారావు

మార్కాపురం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతి పరీక్షలకు సంబంధించి పలుకేంద్రాల్లో పరిస్థితులపై మార్కాపురం పోలీసులు బుధవారం పరిశీలించారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర, బాలికల, నారాయణ, సాయిబాలాజీ కేంద్రాలను సీఐ పి.సుబ్బారావు సిబ్బందితో కలిసి వెళ్లి క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ముఖ్యంగా ఆయా కేంద్రాల వద్ద బయట ఎవరూ లేకుండా చూడాలని సిబ్బందిని సూచించారు. విద్యార్థులు కేంద్రాలకు వెళ్లేందుకు, పరీక్షల అనంతరం బయటకు వచ్చేందుకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ముఖ్యంగా ట్రాఫిక్‌ను ఎప్పటికప్పుడు క్రమబద్ధీకరించాలన్నారు. పరీక్షా కేంద్రాలకు సమీపంలోని జెరాక్స్ కేంద్రాలను మూసి వేయించాలన్నారు. ఎక్కడా చిన్నపాటి సమస్య తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఎస్సై డాక్టర్ రాజమోహన్‌రావు, సిబ్బంది ఉన్నారు.

చెంచుల అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం

- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు
- గిరిజన గూడేలలో వెలుగులు నింపుతున్న ప్రభుత్వం
- పౌష్టికాహార కిట్లు పంపిణీ



చెంచు మహిళలకు కిట్లు పంపిణీ చేస్తున్న ఎరిక్షన్ బాబు, పీవో

ఎర్రగొండపాలెం రూరల్ మార్చి 19 (ఆంధ్రజ్యోతి) రాష్ట్రంలో చెంచుల జీవితాల గురించి కాని వారి అభివృద్ధి గురించి గత పాలకులు పట్టించుకున్న పాపాన పోలేదని అందుకే వారిని ప్రజలు 11 సీట్లకే పరిమితం చేశారని ఎర్రగొండపాలెం టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. బుధవారం స్థానిక డా.బిఆర్ అంబేద్కర్ ఆడిటోరియంలో సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ శ్రీశైలం వారి ఆధ్వర్యంలో పౌష్టికాహార కిట్లు ఎలక్ట్రికల్ టూల్ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి 9 నెలల కాలంలో గిరిజనుల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని అన్నారు. ఇటీవల దోర్నాల మండలంలో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చొరవతో పలు గూడేలలో సోలార్ విద్యుత్ సదుపాయం ఏర్పాటు చేసినట్లు గుర్తు చేశారు. అలాగే వారి కోసం ప్రత్యేకంగా గృహనిర్మాణాలు అమలు చేశామన్నారు. అలాగే చెంచుల ఆరోగ్య దృష్ట్యా రక్తహీనత పెంచేందుకు రెండు వేల రూపాయల విలువైన నిత్యావసర సరుకుల కిట్లు పంపిణీ చేస్తునట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రతి చెంచు నివాసాన్ని పలకరించి వారి కష్టాలను తెలుసుకున్నట్లు తెలిపారు. వారి అభివృద్ధి కోసం తను శ్రీశైలం ఐటీడీఏ ద్వారా అభివృద్ధి చేస్తామన్నారు. అందుకు ప్రాజెక్టు అధికారి వెంకట శివప్రసాద్ కూడ పూర్తి సహకారం అందిస్తున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా చెంచు కుటుంబాలకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. అలాగే రైతులకు ఎంతో ఉపయోగపడే ఎలక్ట్రికల్ టూల్ కిట్లు పంపిణి చేశారు. ఆయా కార్యక్రమాలలో ఐటీడీఏ పీవోతో పాటు ఏపివో సురేష్, పీహెచ్‌వో ధనుంజయ్, ఎస్‌వో జి నాయక్, ఏపీటీవో మధుసుదన్ రావు, జూనియర్ అసిస్టెంట్ రాజ సిబ్బంది, టీడీపీ నాయకులు చేకూరి సుబ్బారావు, షేక్ మస్తాన్‌వలి, చెవుల ఆంజయ్య, శ్రీశైలపతి నాయుడు, వేగినాటి శ్రీను, సత్యనారాయణ గౌడ్, ఎంసీహెచ్ మంత్రునాయక్, వెంగళరెడ్డి, పయ్యావుల ప్రసాద్, భూమిరెడ్డి సుబ్బారెడ్డి, బి వెంకటేశ్వర నాయక్, చెవుల భయన్న, మూగన్న, అచ్యూతరావు, మల్లికార్జునాచారి, కూటమి నాయకులు, చెంచు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అధ్వానంగా పాములపల్లె రహదారి

కంకర పైకి తేలడంతో వాహనచోదకులకు కష్టాలు



కంకర తేలిన రహదారి

గిద్దలూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): గిద్దలూరు మున్సిపాలిటీలో భాగమైన పాములపల్లి గ్రామం వెళ్లాలంటే వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గిద్దలూరు నుండి సుమారు 3 కిలోమీటర్ల దూరంలో పాములపల్లి గ్రామం ఉంది. 3 కిలోమీటర్లలో 30కి పైగా ప్రాంతాలలో రోడ్డంతా అధ్వానంగా తయారైంది. పేరుకు తారు రోడ్డు అయినప్పటికీ, మట్టిరోడ్డు కంటే అధ్వానంగా ఉంది. తారు పోయి కంకర రాళ్లు లేచి గుంతలమయైంది. దీంతో వాహనాలు వెళ్లే సమయంలో టైర్ల కింద కంకరరాళ్లు లేచి పక్కన ఉన్న వారిని గాయపరుస్తున్నాయి. రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనదారులు కింద పడి గాయాలపాలు అవుతున్నారు. ఈ రోడ్డును పూర్తిస్థాయిలో పునః నిర్మించాలని పాములపల్లి గ్రామస్థులు కోరుతున్నారు.

బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు చేయాలని అభ్యర్థన

గిద్దలూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): గిద్దలూరులో బ్లడ్‌బ్యాంక్ ఏర్పాటు చేయాలని బీజేపీ నాయకులు కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గిద్దలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో కేవలం బ్లడ్ స్టోరేజ్ యూనిట్ మాత్రమే ఉండడంతో రక్తం కోసం తరచూ నంద్యాల, మార్కాపురం పట్టణాలకు రోగులు వెళ్లాల్సి వస్తోందన్నారు. పట్టణంలో పూర్తిస్థాయిలో బ్లడ్‌బ్యాంక్ ఏర్పాటు చేస్తే ఆపరేషన్ల సమయంలో రక్తం అవసరమైన వారికి స్థానికంగానే రక్తం లభిస్తుందని, ప్రభుత్వం, అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని బ్లడ్‌బ్యాంక్ ఏర్పాటు చేయాలని బీజేపీ పట్టణ అధ్యక్షులు ఎ.ఉదయ్‌శంకర్, జిల్లా ఉపాధ్యక్షులు బీవీ. రామాంజనేయులు, మైనారిటీ విభాగం అధ్యక్షులు షేక్ ఖాదర్‌వలిలు కోరారు.

పని ఒత్తిడిని తగ్గించాలని కార్యదర్శుల వినతి



ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

మార్కాపురం రూరల్, మార్చి19 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో పని ఒత్తిడిని తగ్గించాలని కోరుతూ పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీవో శ్రీనివాసులుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం పంచాయతీ సెక్రటరీలకు సర్వేల బాధ్యతను అప్పగించిందన్నారు. తాము విధులను సక్రమంగా నిర్వహిస్తామన్నారు. అయితే గ్రామ సచివాలయాలలో పనిచేస్తున్న ఇతర సిబ్బంది చేయాల్సిన పని చేయకపోయినా పంచాయతీ కార్యదర్శులను బాధ్యులను చేస్తూ ఒత్తిడి పెంచుతున్నారన్నారు. సచివాలయ ఉద్యోగులకు మాతృశాఖల అధికారుల ద్వారా ఆదేశాలను జారీ చేస్తున్నారన్నారు. అయితే వారి నిర్లక్ష్యానికి తమను బాధ్యులను చేస్తూ మెమోలు జారీ చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు రంగారెడ్డి, దిలీప్‌రెడ్డి, సుబ్బారావు, పెద్దిరాజు, విజయలక్ష్మి, అబిద్ హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

సీఎంకు ఎంఆర్‌పీఎస్ నేతల కృతజ్ఞతలు



సీఎంకు కృతజ్ఞతలు తెలుపుతున్న ఎంఆర్‌పీఎస్ నేతలు

కంభం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ అంశంలో ఏపీ సీఎం చంద్రబాబు నాయుడుకు ఎంపీఆర్‌పీఎస్ నేతలు పానుగంటి షాలెంరాజు ఆధ్వర్యంలో కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం కంభం మండలం కందులాపురం కూడలిలో డాక్టర్ బీఆర్.అంబేద్కర్ విగ్రహం వద్ద సీఎంకు కృతజ్ఞతలు తెలుపుతూ ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. 30 సంవత్సరాల ఎస్సీ వర్గీకరణ ఉద్యమ ఫలాలను అందుకునే సమయం ఆసన్నమైందన్నారు. ఉద్యమ కార్యకర్తల, నాయకుల త్యాగాలు వృథా కాలేదన్నారు. డాక్టర్ బీఆర్.అంబేద్కర్ ఆశించిన సామాజిక న్యాయం తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబునాయుడు, రేవంత్‌రెడ్డిల ద్వారా సహకారమైందన్నారు. కందులాపురం కూడలిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో షాలెంరాజు మాట్లాడుతూ ఎన్నికల ముందు జిల్లాల వారీగా వర్గీకరణ చేయాలన్న నిర్ణయంతో మాదిగ, ఉప కులాలకు నష్టం జరిగే ప్రమాదం ఉందన్నారు. రాష్ట్ర యూనిట్‌గా వర్గీకరణ చేయాలని ఎంఆర్‌పీ ఎస్ వ్యవస్థాపకులు ఉసురుపాటి బ్రహ్మయ్య ఆధ్వర్యంలో రాజీవ్ రంజన్‌మిశ్ర కమిషన్‌ను కలిసి చర్చించి రాష్ట్ర యూనిట్‌గా వర్గీకరణ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు పొడిచెర్ల రాజు, గోన మోహన్‌రావు, నేదురుపల్లి జయరాజ్, ఊదాల ఆనంద్, దుగ్గిపోగు నాగరాజు, వెంకటయ్య, పాల్గొన్నారు.

27 నుంచి ప్రాంతీయ వ్యవసాయ ప్రదర్శన

అమరావతి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): దక్షిణాది రాష్ట్రాల రైతులకు నికరాదాయం లభించేలా సాంకేతిక పరిజ్ఞానంపై ఈ నెల 27, 28, 29 తేదీల్లో గుంటూరు జిల్లా లాంలోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ప్రాంతీయ వ్యవసాయ ప్రదర్శన, సదస్సు జరుగుతుందని వర్సిటీ వీసీ శారదా జయలక్ష్మి తెలిపారు. ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ, పుదుచ్చేరి, లక్షద్వీప్, అండమాన్ రాష్ట్రాలకు ఉపయోగపడే ఈ సదస్సులో సాంకేతిక పరికరాల ప్రదర్శనకు 300 స్టాల్స్ ఏర్పాటు చేయనున్నట్లు బుధవారం చెప్పారు. కాగా పత్తి సాగు, పరిశోధనలు, భవిష్యత్ వ్యూహాలను చర్చించేందుకు ఈ నెల 21 నుంచి 23 వరకు లాంలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రంలో జాతీయ స్థాయి సమావేశం జరుగుతుందని లాం ఫాం అసోసియేట్ డైరెక్టర్ దుర్గాప్రసాద్ తెలిపారు.

ఎరువుల అక్రమ రవాణాపై నిఘా: అగ్రి డైరెక్టర్

అమరావతి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రసాయన ఎరువులు పక్కదారి పట్టకుండా నిరంతర నిఘా ఉంచాలని వ్యవసాయశాఖ డైరెక్టర్ ఢిల్లీరావు క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించారు. జిల్లా వ్యవసాయ, మార్క్‌ఫెడ్ అధికారులు, రైల్వే వ్యాగన్ రేక్ పాయింట్ అధికారులతో బుధవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వచ్చే ఖరీఫ్ అవసరాల కోసం ఎరువులను బఫర్ స్టాక్‌ను 2లక్షల టన్నులకు పెంచనున్నట్లు చెప్పారు. ఎరువుల రవాణాలో ఖర్చులు అధికంగా ఉంటున్న విశాఖపట్నం, అన్నమయ్య, శ్రీసత్యసాయి జిల్లాలకు మూడు రైల్వే వ్యాగన్ రేక్ పాయింట్లు ఏర్పాటు చేయాలని కేంద్రానికి సీఎం చంద్రబాబు ప్రతిపాదనలు పంపారన్నారు. ఎరువులు సమృద్ధిగా వస్తున్నా.. కృత్రిమ కొరత, అధిక ధరలకు విక్రయం, అక్రమ తయారీ, రవాణా, వ్యవసాయేతర అవసరాలకు వినియోగాన్ని నియంత్రించాలని అధికారులను ఆదేశించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు



చికిత్స అందిస్తున్న ఆరోగ్య సిబ్బంది

ఎర్రగొండపాలెం, రూరల్ మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : ఆటో-బైకు ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలైన ఘటన ఎర్రగొండపాలెం - మార్కాపురం జాతీయ రహదారి వెంబడి కొత్తపల్లి సమీపంలోని అనకుంట వద్ద బుధవారం రాత్రి చోటుచేసుకొంది. ఈ ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఘటనకు సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఎర్రగొండపాలెం మండలం కొలుకుల విద్యుత్ సబ్‌స్టేషన్‌లో చంటి షిఫ్ట్ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. విధులు ముగించుకొని కుంటకు బైక్‌పై వెళుతున్నాడు. అదేసమయంలో అమాని గుడిపాడు గ్రామానికి చెందిన సూరే సత్యనారాయణ ఎర్రగొండపాలేనికి ఆటోలు వస్తున్నారు. ఈ నేపథ్యంలో అనకుంట వద్ద రెండు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు కావడంతో జాతీయ రహదారి అంబులెన్సులో క్షతగాత్రులను ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వీరిని నరసరావుపేటకు రిఫర్ చేసినట్లు వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎస్సై పి చౌడయ్య ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సెమీస్‌కు చేరిన కోటయ్యగౌడ్

గిద్దలూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): భీమవరంలో జరుగుతున్న ఆల్ ఇండియా టెన్నిస్ సీనియర్ ర్యాంకింగ్ టోర్నమెంటులో గిద్దలూరుకు చెందిన టెన్నీస్ క్రీడాకారుడు కంచర్ల కోటయ్యగౌడ్ సెమిఫైనల్స్‌కు చేరుకున్నాడు. 65 వయస్సు గ్రూపులో హైదరాబాద్‌కు చెందిన చంద్రశేఖర్‌తో కలిసి కంచర్ల కోటయ్యగౌడ్ టోర్నమెంటులో పోటీపడ్డాడు. వివిధ దశల్లో విజయం సాధిస్తూ చెన్నై, మచిలీపట్నంకు చెందిన బాలసుబ్రమణ్యం, రమేష్‌బాబులను టై బ్రేక్‌లో 8-7 స్కోరుతో విజయం సాధించి సెమీఫైనల్‌కు చేరుకున్నాడు. ఆయన విజయంపై గిద్దలూరు వాసులు అభినందనలు తెలియజేస్తున్నారు.

థ్యాంక్యూ పోలీసు అంకుల్..!

విద్యార్థినిని పరీక్షా కేంద్రానికి తరలించిన ట్రాఫిక్ ఎస్సై



ఎస్సైకి ధన్యవాదాలు తెలుపుతున్న విద్యార్థిని

మార్కాపురం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): 'ఒకవైపు పరీక్షకు సమయం దగ్గరపడుతోంది. పరీక్షాకేంద్రం తెలియక ఒకవైపు తికమక. ఏం చేయాలో పాలుపోని పరిస్థితి. గమనించిన ఓ పోలీసు అధికారి వెంటనే సరైన సమయానికి తన వాహనంపై ఓ విద్యార్థినిని పదవ తరగతి పరీక్ష రాసే కేంద్రానికి తీసుకెళ్లాడు. ఈ సంఘటన బుధవారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల వద్ద చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే రెగ్యులర్ విద్యార్థులతో పాటు డిస్టెన్స్‌లో చదువుకునే వారికి కూడా పదో తరగతి పరీక్షలు జరుగుతున్నాయి. స్థానిక జెడ్పీ బాయ్స్ హైస్కూల్ వద్దకు ఉదయం 8.30 గంటలకు వేరే మండలానికి చెందిన ఓ విద్యార్థిని వచ్చింది. లోపలికి వెళ్తే తాను పరీక్ష రాసే కేంద్రం కాదని తెలుసుకుంది. హాల్ టిక్కెట్‌లో పరీక్షా కేంద్రం జెడ్పీ గర్ల్స్ హైస్కూల్ వద్ద ఉన్నట్లు గమనించింది. కేంద్రం ముందు హడావుడిపడుతున్న ఆ విద్యార్థిని పరిస్థితిని ట్రాఫిక్ ఎస్సై అహరోన్ గమనించాడు. విద్యార్థినిని అడిగి విషయం తెలుసుకున్నాడు. వెంటనే తన వాహనంపై గర్ల్స్ హైస్కూల్ కేంద్రం వద్దకు తరలించాడు. దీంతో ఆ విద్యార్థిని సమయానికి పరీక్షా కేంద్రానికి చేరుకుంది. సాయం చేసిన ఎస్సైకి షేక్‌హ్యాండ్ ఇచ్చి కృతజ్ఞతలు తెలిపింది. ట్రాఫిక్ ఎస్సై అహరోన్ వెంటనే స్పందించడంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మిరపలో సస్యరక్షణ చర్యలపై అవగాహన



మిరపతోటను పరిశీలిస్తున్న ఏవో శ్రీనివాసరావు

మార్కాపురం రూరల్, మార్చి19 (ఆంధ్రజ్యోతి). మండలంలోని బోడపాడు, ఇడుపూరు గ్రామాలలో బుధవారం ఏవో శ్రీనివాసులు పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పంటలను పరిశీలించి మిరపలో సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ భూసార పరీక్షలకు మట్టి సేకరించే విధానం గురించి రైతులకు కలిగే ఉపయోగాలను వివరించారు. పంటలను సాగు చేసే భూమిలో మట్టి నమూనాను చదరంగా ఉన్నచోట వి ఆకారంలో సేకరించాలన్నారు. చతుర్విభజన పద్ధతిలో చేసి 500 గ్రాముల మట్టిని మాత్రమే భూసార పరీక్షకు పంపిచాలన్నారు. భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా రసాయన, సేంద్రీయ ఎరువులను వినియోగించాలన్నారు. దాని వలన సాగు చేసిన పంటలలో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రాల సిబ్బంది సాయిరాం, పావనేశ్వరి, రైతులు పాల్గొన్నారు.

గిద్దలూరు : మండలంలోని నరవ గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో ఎం.విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ధాన్యం నిలువలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. రైతులు నిలువ చేసిన ధాన్యాన్ని క్రిమికీటకాలు ఆశించి నష్టపరుస్తున్నాయని పేర్కొన్నారు. ఆహార ధాన్యాన్ని నిలువ చేసినపుడు ముక్కుపురుగు, తొట్టుపురుగు, పుచ్చుపురుగు ఆశించి నష్టపరుస్తున్నాయని పేర్కొన్నారు. ధాన్యంలో 18 శాతం తేమ ఉంటుందని, దాన్ని 10-12 శాతం తేమ ఉండే వరకు ఆరబెట్టి నిలువ పెట్టుకోవాలన్నారు. వేప గింజల పొడిని ఉపయోగించి వరి, శనగ, కందులు తదితర వాటిని కీటకాల భారి నుండి రక్షణ పొందవచ్చన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారులు శ్రీనివాసరెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, వ్యవసాయ సహాయకులు సాయి కల్యాణి, భవాని, తదితరులు ప్రసంగించారు.

పెద్దదోర్నాల : రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలని ఏవో జవహర్‌లాల్ నాయక్ రైతులకు సూచించారు. మండలం లోని చింతల, మర్రిపాలెం గిరిజన గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో సాగు చేసిన మామిడి తోటలను ఆయన పరిశీలించారు. తోటల్లో తీసుకోవాలసిన సస్యరక్షణ చర్యలపై పలు సూచనలు చేశారు. అంతేగాకుండా వేసవి కాలంలో పంటలు పూర్తయ్యాక మట్టి నమూనాలు సేకరించి ఉచితంగా పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు. ఈ పరీక్షల ద్వారా నేల స్వభావాన్ని బట్టి ఎరువుల వినియోగించాలన్నారు. సూక్ష్మధాతువుల లోపాలు సవరణ, వేయాల్సిన పంటలు తద్వారా పెట్టుబడులు తగ్గించుకోవచ్చన్నారు. అనంతరం ప్రభుత్వ పథకాలను సద్వినియోగ పర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ముఖాముఖి

90శాతం ఈ క్రాప్ నమోదు

వి.బాలకృష్ణనాయక్, ఏవో, దర్శి



ప్రశ్న: మండలంలో ఈక్రాప్ నమోదు ఎంతమేరకు జరిగింది ?

జవాబు: మండలంలో సాగుచేసిన పంటలకు దాదాపు 90శాతం ఈక్రాప్ నమోదైంది. కౌలుకు సాగుచేసిన భూములు, రికార్డులకు ఎక్కని భూములకు మాత్రమే ఈ క్రాప్ జరగలేదు.

ప్ర: సాగర్ జలాలు నిలిపివేయటం వల్ల నష్టపోయే పరిస్థితి ఉందా ?

జ: సాగర్ నీరు మార్చి నెలాఖరు వరకు సరఫరా అవుతుంది. దాదాపు అన్ని పంటలు రైతుల చేతికొచ్చాయి. అక్కడక్కడా ఆలస్యంగా సాగుచేసిన వరి పైరు వెన్నుతీస్తుంది. ఆ పైరుకు కొంత నీరు అవసరమయ్యే అవకాశం ఉంది.

ప్ర: రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుందా ?

జ: రైతులు పండించిన పంటలను ఈక్రాప్ చేసుకొని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకునే అవకాశం ఉంటుంది. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రకారం విక్రయించుకొని రైతులు గిట్టుబాటు ధర పొందవచ్చు.

ప్ర: రబీ పంటల కొనుగోలుకు కేంద్రాలు ఆరంభించారా ?

జ: ఇంకా ప్రారంభించలేదు. త్వరలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు, కంది విక్రయ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తాం.

ప్ర: ఖరీఫ్‌లో కొనుగోలు కేంద్రాలు నామమాత్రంగానే పనిచేశాయి కదా ?

జ: కొనుగోలు కేంద్రాల నిర్వాహణ సివిల్ సప్లయ్ శాఖ ఆధ్వర్యంలో జరుగుతుంది. కేంద్రాల ఏర్పాటు, నిర్వాహణ ఆశాఖ అధికారులే చూస్తున్నారు. రైతుసేవా కేంద్రాల్లో నమోదు చేసుకున్నట్లయితే కొనుగోలు చేయించే ఏర్పాట్లు చేయిస్తాం.

దొనకొండ రైల్వేస్టేషన్ వెలవెల

- నాలుగేళ్లుగా స్టాపింగ్‌కు నోచుకోని ఎక్స్‌ప్రెస్ రైళ్లు
- రెండు, మూడింటినయినా నిలపాలంటూ ప్రయాణికుల విజ్ఞప్తి
- పట్టించుకోని ఉన్నతాధికారులు

దొనకొండ, మార్చి 19(ఆంధ్రజ్యోతి): దొనకొండ రైల్వేస్టేషన్ వెలవెలబోతోంది. కరోనాకు ముందు అన్నీ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు స్టాపింగ్ ఉండేది. కరోనా తర్వాత పునఃప్రారంభం నుంచి ఎక్స్‌ప్రెస్ రైళ్లకు దొనకొండలో హాల్టింగ్ సౌకర్యం తొలగించారు. దీంతో ప్రజలు రాకపోకలు జరుపుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పగలు నడిచే రైళ్లకు హాల్టింగ్ కల్పించి, రాత్రి వేళల్లో నడిచేవాటికి తొలగించారు. దీంతో విజయవాడ, విశాఖపట్టణం, బెంగుళూరు, తదితర ముఖ్యపట్టణాల నుంచి రాకపోకలు జరుపుకునే వారు వినుకొండ లేదా మార్కాపురం రైల్వేస్టేషన్‌లలో రైళ్లు దిగి ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించి గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు.

2021 సంవత్సరం నుంచి దొనకొండకు విచ్చేసిన రైల్వే ఉన్నతాధికారులకు స్థానికులు వినతిపత్రాలు అందజేశారు. నేటికీ ఎటువంటి ఫలితంలేదు. ఈవిషయమై స్థానికులు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి దృష్టికి తీసుకెళ్లి దొనకొండలో ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టింగ్ సౌకర్యం కల్పించేలా తగిన చర్యలు చేపట్టాలని విన్నవించారు. అందుకు ఎంపీ సానుకూలంగా స్పందించారు. ఈక్రమంలో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్‌జైన్ దొనకొండ పర్యటనకు వచ్చినప్పుడు ఎంపీ మాగుంట కూడా విచ్చేశారు. రైల్వే జీఎంను కలుసుకొని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ప్రధానంగా దొనకొండలో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ సౌకర్యం కల్పించాలంటూ విజ్ఞప్తి చేసి వినతిపత్రం అందజేశారు. నేటికీ ఎటువంటి స్పందన లేదు. దీంతో ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి రెండేళ్ళ క్రితం ఢిల్లీలో రైల్వే బోర్డు ఛైర్‌పర్సన్ జయవర్మసిన్హాను కలిసి దొనకొండలో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ సౌకర్యం కల్పించాలంటూ వివరించి వినతిపత్రం అందజేశారు. నెలలు గడుస్తున్నా ఎటువంటి ఫలితం లేకపోవడంతో ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది అమృత్‌భారత్‌పథకానికి దొనకొండ రైల్వే స్టేషన్‌ను ఎంపికచేశారు. దాదాపు రూ.17 కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. పనులు పూర్తయిన తర్వాత హాల్టింగ్ సౌకర్యం కల్పిస్తారని ప్రయాణికులు ఆశించారు. నేటికీ ఆఊసే లేదు. కనీసం కొండవీడు-అమరావతి, ధర్మవరం మూడు ఎక్స్‌ప్రెస్ రైళ్లకైనా దొనకొండలో హాల్టింగ్ సౌకర్యం కల్పించేలని కోరుతున్నారు.



దొనకొండ రైల్వేస్టేషన్

దొనకొండలో ఆగని ఎక్స్‌ప్రెస్ రైళ్లు

1.మచిలీపట్నం-బెంగుళూరు-మచిలీపట్నం కొండవీడు ఎక్స్‌ప్రెస్, 2.పూరి, యశ్వంత్‌పూర్-పూరి గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్, 3.విజయవాడ-హుబ్లీ-విజయవాడ అమరావతి ఎక్స్‌ప్రెస్, 4.హౌరా- వాస్కోడిగామా-హౌరా అమరావతి ఎక్స్‌ప్రెస్, 5.భువనేశ్వర్-బెంగుళూరు-భువనేశ్వర్ ప్రశాంతి ఎక్స్‌ప్రెస్, 6. ధర్మవరం- విజయవాడ ధర్మవరం ఎక్స్‌ప్రెస్ రైళ్లు

శరవేగంగా అభివృద్ధి పనులకు రూపకల్పన

- ఏప్రిల్‌లో బయోగ్యాస్ కంపెనీకి భూమి పూజ
- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి

కనిగిరి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): కనిగిరి నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు రూపకల్పన చేసినట్టు ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి తెలిపారు. బుధవారం అసెంబ్లీ సమావేశాల అనంతరం జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, దేవదాయ శాఖమంత్రి ఆనం రామనారాయణరెడ్డి సమక్షంలో జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సమావేశమయ్యారు. ఆయా విషయాలను డాక్టర్ ఉగ్ర వెల్లడించారు. కనిగిరి నియోజక వర్గంలో నెలకొన్న దేవదాయ భూముల సమస్యలు పరిష్కారంపై తీసుకోవాల్సిన చర్యలపై చర్చించినట్లు తెలిపారు. హనుమంతునిపాడు మండలంలో లక్ష్మీచెన్నకేశవస్వామి దేవాలయం అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై తగు సూచనలు చేసినట్లు తెలిపారు. వెలిగండ్ల మండల కేంద్రంలోని హైస్కూల్ ఆటస్థల ప్రాంగణంకై దేవాలయం భూములను కొనుగోలు చేసి ఆటస్థలానికి కేటాయించాలని కోరినట్లు తెలిపారు. కనిగిరిలోని విజయ మార్తేండేశ్వరస్వామి దేవాలయానికి సంబంధించిన భూములను గుర్తించటంతో పాటు శిథిలావస్థకు చేరుకున్నా ఆయా దేవాలయానికి సంబంధించిన రూముల స్థానంలో నూతనంగా నిర్మాణం చేపట్టాలని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి దృష్టికి తీసుకువెళ్ళినట్లు డాక్టర్ ఉగ్ర తెలి పారు.

పీసీపల్లి మండలంలో రిలయన్స్ బయోగ్యాస్ ఏర్పాటు విషయంపై రిలయన్స్ ప్రతినిధులు విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌తో చర్చించినట్లు తెలిపారు. ఏప్రిల్ 2 లేదా 18న బయోగ్యాస్ కంపెనీ నిర్మాణానికి మంత్రి లోకేష్ భూమి పూజ చేయనున్నట్టు తెలిపారు.



ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర ఆధ్వర్యంలో మంత్రి గొట్టిపాటిని కలసిన రిలయన్స్ కంపెనీ ప్రతినిధులు

పేరుకుపోయిన విద్యుత్ బకాయిలు

- వారంలోగా చెల్లించకపోతే సర్వీసులు కట్
- ప్రభుత్వ కార్యాలయాలకు నోటీసులు ఇచ్చిన అధికారులు

పీసీపల్లి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): పీసీపల్లి మండలంలో ప్రభుత్వ కార్యాలయాలు చెల్లించాల్సిన విద్యుత్ బకాయిలు కోటికిపైగా పేరుకుపోయాయి. గృహ వినియోగదారులు ఆర్థిక ఇబ్బందులతో ఒకటి, రెండునెలలు బిల్లులు చెల్లించకపోతే సరఫరా నిలిపివేసే విద్యుత్ అధికారులు ప్రభుత్వ కార్యాలయాలు లక్షల కొద్దీ బకాయిలు పేరుకుపోయినా పట్టించుకోలేదు. ఇటీవల సంబంధిత శాఖ ఉన్నతాధికారుల ఆదేశాలతో బిల్లులు బకాయిలు ఉన్న ప్రభుత్వ కార్యాలయాలకు విద్యుత్ శాఖ సిబ్బంది నోటీసులు జారీచేశారు. నోటీసులు అందుకున్న వారంలోగా అరియర్స్ చెల్లించకపోతే సరఫరా నిలిపివేస్తామని నోటీసులో పేర్కొన్నారు. విద్యుత్ ఏఈ లక్ష్మీరాజేష్ తెలిపిన వివరాల మేరకు..

మండలంలోని 18గ్రామ పంచాయతీలతో పాటు ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, తహసీల్దార్, ఎంపీడీవో, ఉపాధి హామీ కార్యాలయాలతో పాటు పోలీస్‌స్టేషన్, బాలుర హాస్టల్‌తో కలిపి మార్చి 15వ తేదీ నాటికి సుమారు రూ.1.67 కోట్లు విద్యుత్ బకాయిలు పేరుకుపోయాయి. పీసీపల్లి గ్రామ పంచాయతీ రూ. 48.70 లక్షలు, తలకొండపాడు రూ.2.22 లక్షలు, ముద్దపాడు రూ.14.71 లక్షలు, భట్టుపల్లి రూ.8 లక్షలు, గుదేవారిపాలెం రూ.3.21 లక్షలు, పెదఅలవలపాడు రూ. 7.28 లక్షలు, పోతవరం రూ.3.6 లక్షలు, నేరేడుపల్లి గ్రామ పంచాయతీ రూ.8.74 లక్షల బకాయిలు ఉన్నాయి. అలాగే, మారెళ్ల గ్రామ పంచాయతీ రూ.7.12 లక్షలు, మురుగుమ్మి రూ.9.3 లక్షలు, చినవరిమడుగు రూ.4.44 లక్షలు, వెంగళాయపల్లి రూ.5.25 లక్షలు, చింతగుంపల్లి రూ.7.75లక్షలు, లక్ష్మక్కపల్లి రూ.8.73 లక్షలు, పెద యిర్లపాడు రూ.14.33 లక్షలు, గుంటుపల్లి గ్రామ పంచాయతీ రూ.5.3 లక్షలు చెల్లించాల్సి ఉంది.

కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయం రూ.1.32 లక్షలు, తహసీల్దార్ కార్యాలయం రూ.1.07 లక్షలు, అంగన్‌వాడీ కేంద్రాలు రూ.1.31 లక్షలు, ప్రభుత్వ పాఠశాలలు రూ.5.15 లక్షలు, పీసీపల్లి పోలీసుస్టేషన్ రూ.84 వేలు, బాలుర వసతి గృహం రూ.57 వేలు, ప్రభుత్వ వైద్యశాల రూ.1.42 లక్షల బకాయిలు ఉన్నాయి. బకాయిలు ఉన్న ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పోలీసుస్టేషన్, బాలుర వసతి గృహంతోపాటు పంచాయతీల కార్యదర్శులకు విద్యుత్ అధికారులు నోటీసులు జారీ చేస్తున్నారు.

కాగా, ఎన్నో ఏళ్ల నుంచి లక్షల కొద్దీ విద్యుత్ బకాయిలు పేరుకుపోయిఉంటే ఇప్పటికిప్పుడు బకాయిలు చెల్లించాలని నోటీసులు ఇస్తే అంత నగదు ఏవిధంగా చెల్లించాలో అర్థంకాక ఇటు అధికారులు, అటు పంచాయతీ కార్యదర్శులు తలలు పట్టుకుంటున్నారు.

దర్శి ఏఎంసీ ఛైర్మన్‌గా దారం నాగవేణి?

దర్శి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): దర్శి ఏఎంసీ ఛైర్మన్‌గా దారం నాగవేణిని ఖరారు చేశారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, కడియాల రమేష్ నియోజకవర్గంలోని టీడీపీ కూటమి ముఖ్య నాయకులతో బుధవారం చర్చించారు. అందరి అభిప్రాయాలు సేకరించిన అనంతరం నాగవేణి పేరు ఖరారు చేస్తున్నట్లు ప్రకటించారు. దారం నాగవేణి ప్రస్తుతం దర్శి నగర పంచాయతీ 19వ వార్డు టీడీపీ కౌన్సిలర్‌గా పనిచేస్తున్నారు. దర్శి ఏఎంసీ ఛైర్మన్ పదవి జనరల్ మహిళకు కేటాయించారు. పార్టీ కోసం ఎంతోకాలంగా నిబద్ధతతో పనిచేస్తున్న ఆమె పేరును ఖరారు చేశారు. ఆమె భర్త దారం సుబ్బారావు గతంలో దర్శి పట్టణ టీడీపీ అధ్యక్షుడిగా పనిచేశారు. గత ఎన్నికల్లో వారిద్దరూ పార్టీ కోసం విశేష కృషి చేశారు. ఈనేపథ్యంలో నాగవేణి పేరును ప్రకటించారు. ఈసందర్భంగా డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి మాట్లాడుతూ ఏఎంసీ ఛైర్మన్ పదవికి నాగవేణిని అందరూ ఏకగ్రీవంగా ఆమోదించటం ఆనందదాయకమన్నారు. మిగిలిన సభ్యుల పేర్లు కూడా త్వరలో ఖరారుచేసి అధిష్ఠానానికి పంపుతామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఫణిదపు వెంకటరావు, దర్శి సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్, కూటమి నాయకులు పాల్గొన్నారు. కాగా, అల్లాభక్ష్ ఆధ్వర్యంలో జరిగిన ఇఫ్తార్ విందులో డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



నాగవేణిని అభినందిస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, పాపారావు తదితరులు

పరీక్షా కేంద్రాల తనిఖీ

పీసీపల్లి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షా కేంద్రాలను ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులు బుధవారం తనిఖీ చేశారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో రెండు పరీక్షా కేంద్రాలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒక పరీక్ష కేంద్రంలో విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. బుధవారం హిందీ పరీక్ష జరగగా, ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులు రామిరెడ్డి, వెంకట్రావులు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.

బాల్యవివాహాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి

సీఎస్‌పురం(పామూరు), మార్చి 19 (ఆంధ్రజ్యోతి): బాలకార్మిక వ్యవస్థ, బాల్య వివాహాలపై మండల స్థాయిలో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఎంపీడీవో ఎల్.బ్రహ్మయ్య పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం బంగారు బాల్యంపై మండలస్థాయి అధికారులతో టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై విద్యార్థినులకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో డాక్టర్ ఎస్.మురళి, సూపర్‌వైజర్ దేవాకృపానందం, ఏపీఎం లక్ష్మీనారాయణ, సీనియర్ అసిస్టెంట్ పద్మనాభం, స్వయం కృషి సేవా సంస్థ అధ్యక్షుడు షేక్ నాయబ్‌రసూల్, తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు ఈ -శ్రమ్ కార్డులు

పామూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద మత్స్యకారులకు ఈ- శ్రమ్ కార్డులు జారీ చేస్తున్నట్లు సహాయ కార్మిక అధికారి యాదాల సుబ్బరాయుడు తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పామూరు, సీఎస్‌పురం మండలాల్లోని మత్స్యకారులకు ఈ -శ్రమ్ కార్డుల జారీ పక్రియను ప్రారంభించారు. ఈ కార్డులకు 16 నుంచి 59 సంవత్సరాలు వయసు కలిగి కూలీ పనులు చేసుకొనే వారందరు అర్హులని తెలిపారు. ఈ కార్డులు కలిగి ఉంటం ద్వారా ప్రమాదంలో అంగ వైకల్యం ఏర్పడితే రూ.ఒక లక్ష, చనిపోతే రూ. రెండు లక్షలు నామినీకి ఇవ్వనున్నట్టు తెలిపారు. ఈ పథకం పూర్తిగా ఉచితమని పేర్కొన్నారు. అర్హత కలిగిన కార్మికులందరూ పీఎం కార్మిక కర్షక బీమా పథకంలో సభ్యులుగా చేరాలన్నారు. కార్యక్రమంలో కనిగిరి మత్స్యశాఖ ఇన్‌స్పెక్టర్ జి.రాము, ఫీల్డ్‌మన్ చంద్రశేఖర్, మోపాడు రిజర్వాయర్ మత్స్య సహాయకుడు శ్రీనివాసరెడ్డి, విఘ్నేష్, హరికృష్ణ, ఆంజనేయులు, మత్స్యకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఓగూరి ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

సీఎస్‌పురం(పామూరు), మార్చి 19 (ఆంధ్రజ్యోతి): దళారుల మాటలు నమ్మి తక్కువ ధరలకు పంటలను విక్రయించుకోవద్దని ఏవో బి.సంపత్‌కుమార్ రైతులకు సూచించారు. బుధవారం సీఎస్‌పురం మండలంలోని పెదగోగులపల్లి, కె.అగ్రహారం గ్రామాల్లో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించిందని చెప్పారు. కందులు కింటా రూ.7550 మద్దతు ధర ప్రకటించిందని తెలిపారు. పెద్దగోగులపల్లిలో కందులు కొనుగోలు కేంద్రం ఏర్పాటుచేసినట్లు చెప్పారు. వ్యక్తిగత వ్యవసాయ పనిముట్లు 50 శాతం రాయితీపై అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి పి.శ్రీనివాసులు, ఎ.వెంకటేశ్వర్లు, వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అలాగే, పామూరు మండలంలోని చింతలపాలెం, బలిజపాలెం గ్రామాల్లో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏవో కె.రాధ పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు.

దర్శిలో గుట్టుగా కాపీయింగ్

దర్శి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో గుట్టుగా కాపీయింగ్ జరుగుతుంది. ప్రధానంగా ప్రైవేట్ విద్యాసంస్థలకు కేటాయించిన కొన్ని పరీక్షా కేంద్రాల్లో కాపీయింగ్ జరుగుతున్నట్లు సమాచారం. దర్శిలో మొత్తం 12 కేంద్రాల్లో 1698 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. అందులో 420 మంది ఓపన్ పరీక్షలు రాసే ప్రైవేట్ విద్యార్థులు ఉన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థలకు కేటాయించిన కొన్ని కేంద్రాల్లో ఓపన్ పరీక్షలు రాసే విద్యార్థులు అధికంగా ఉన్నారు. దీంతో ఆకేంద్రాల్లో గుట్టుగా కాపీయింగ్ జరుగుతుంది.

ప్రభుత్వ పాఠశాలల్లో కేటాయించిన కేంద్రాల్లో పరీక్షలు కఠినంగానే జరుగుతున్నట్లు సమాచారం. స్క్వాడ్ అధికారులు పర్యవేక్షణ చేస్తున్నప్పటికీ కొన్ని కేంద్రాల్లో కాపీయింగ్ జరుగుతున్నట్లు తెలిసింది.

ఖాతాదారులకు మెరుగైన సేవలు

దొనకొండ, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ఖాతాదారులకు మెరుగైన సేవలందిస్తున్నట్టు స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, గుంటూరు డిప్యూటీ జనరల్ మేనేజర్ కృష్ణకుమార్ బిప్రభు పేర్కొన్నారు. బుధవారం దొనకొండలో నూతన బ్రాంచ్‌ను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ దేశంలో మూడోవంతు ప్రజలు ఎస్‌బీఐ ఖాతాదారులుగా ఉన్నారని చెప్పారు. కందుకూరు రీజనల్ మేనేజర్ కె.సూర్యప్రకాష్ మాట్లాడుతూ దొనకొండ పరిసర గ్రామాల ప్రజలకు సేవలందించాలనే లక్ష్యంతో అన్ని రకాల రుణాలు, డిపాజిట్లు, లాకర్ సౌకర్యాలతో బ్రాంచ్‌ను ఏర్పాటుచేసినట్టు చెప్పారు. అనంతరం ఆర్యవైశ్య మండల అధ్యక్షుడు కాళ్ల హనుమంతు, పలువురు వ్యాపార ప్రముఖులు డిప్యూటీ జనరల్ మేనేజర్ కృష్ణకుమార్‌ను శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ వేమా సాయిరాం, నగదు అధికారి సుధాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమిత భూమిని పరిశీలించిన తహసీల్దార్

తాళ్లూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): తాళ్లూరు ఎస్సీ కాలనీ సమీపాన గల ప్రభుత్వ భూమిని ఆక్రమించి సాగు చేస్తున్నారు. దీనిని స్వాధీనం చేసుకొని పేద ఎస్సీలకు పట్టాలు ఇవ్వాలని కాలనీకి చెందిన అనపర్తి సుబ్బారావు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈక్రమంలో బుధవారం తహసీల్దార్ కె.సంజీవరావు విచారణ చేపట్టారు. ఎస్సీ కాలనీ సమీపాన సర్వే నెంబర్ 476లో 4 ఎకరాల 80 సెంట్ల ప్రభుత్వ భూమి ఉంది. అందులో రెండు ఎకరాలను కస్తూర్బా పాఠశాలకు కేటాయించారు. మిగిలిన భూమిని కాలనీకి చెందిన వ్యక్తి ఆక్రమించాడని గతంలోనే 2015లో ఫిర్యాదుదారుడు అధికారులకు విన్నవించాడు. అప్పటి తహసీల్దార్, సర్వేయర్, వీఆర్వోలు భూమిని పరిశీలించి దాదాపు ఎకరా భూమిని ఆక్రమించుకున్నట్లు గుర్తించి హద్దు రాళ్లు ఏర్పాటుచేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఆస్థలాన్ని మరలా ఆక్రమించి సాగు చేస్తున్నారు. అనపర్తి సుబ్బారావు ఫిర్యాదుతో అధికారులు సదరు భూమిని పరిశీలించారు. ప్రభుత్వ భూమిగా గుర్తించి హద్దురాళ్లు వేసి స్వాధీనం చేసుకుంటామని తహసీల్దార్ సంజీవరావు తెలిపారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ వై.శ్రీనివాసరావు, వీఆర్వో నాగలక్ష్మి, విలేజ్ సర్వేయర్ ఖాదర్‌బాషా, అనపర్తి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

తాళ్లూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొర్రపాటివారిపాలెం గ్రామంలో జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఒంగోలు డివిజన్ పంచాయతీరాజ్ ఈఈ వై.కోటేశ్వరరావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామంలో సీసీరోడ్లు, సైడు కాలువల నిర్మాణాలు చేపట్టినట్టు చెప్పారు. మండలంలో 58 పనులకు రూ.3 కోట్లు మంజూరుకాగా, ఇప్పటికీ 53 పనులు పూర్తయ్యాయన్నారు. నాణ్యతా ప్రమాణాలతో పనులు చేయిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈ ఎం.వెంకటేశ్వర్లు, గొల్లపూడి వేణుబాబు, కొర్రపాటి రామయ్య తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

ముండ్లమూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పసుపుగల్లు పంచాయతీ పరిధిలోని కోళ్ల ఫారంలో రేషన్ బియ్యం పట్టుబడ్డాయి. రేషన్ బియ్యం ఉన్నట్టు సమాచారం అందటంతో బుధవారం సాయంత్రం దాడులు చేసినట్టు దర్శి ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ ఎస్.రాధాకృష్ణ తెలిపారు. 13 క్వింటాళ్ళ 81 కేజీల రేషన్ బియ్యం పట్టుబడినట్టు తెలిపారు. కోళ్ళ ఫారం నిర్వాహకులు మేడగం రమణారెడ్డిపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు. పట్టుబడిన రేషన్ బియ్యాన్ని వీఆర్‌ఏ వరగాని ఏసుకు అప్పగించినట్టు తెలిపారు. ఈ దాడుల్లో ఆర్‌ఐ పీఎస్ఆర్ మూర్తి, ముండ్లమూరు వీఆర్‌వో కె.దయానందం ఉన్నారు. పట్టుబడిన బియ్యాన్ని వివిధ ప్రాంతాల్లో కొనుగోలు చేసి కోళ్ళ దాణాకు వినియోగిస్తున్నట్టు డీటీ తెలిపారు.

తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలి

ముండ్లమూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయాధికారి ఎండీ ఫరూక్ రైతులకు సూచించారు. బుధవారం మండలంలోని శంకరాపురం, నూజెండ్లపల్లి గ్రామాల్లో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విచ్చలవిడిగా పురుగు మందులు వాడకుండా వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు పాటించాలన్నారు. వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద పనిముట్లకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కూరపాటి మహేశ్వరి, నారాయణ స్వామి, వీఏఏలు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి అన్యాక్రాంతంపై సర్పంచ్ ఫిర్యాదు

పామూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమిని ఆక్రమించుకొని విక్రయాలు జరిపిన వారిపై చర్యలు తీసుకొని స్వాధీనం చేసుకోవాలని కోరుతూ తహసీల్దార్‌కు గ్రామ సర్పంచ్ ఫిర్యాదు చేశారు. ఈక్రమంలో ఏప్రిల్ 4న విచారణకు హాజరుకావాలని 9 మందికి నోటీసులు జారీ చేశారు. మండలంలోని మోట్రావులపాడు రెవెన్యూ గోపాలపురంలో సర్వే నెంబరు 167 - 3లో ఉన్న 2 ఎకరాల 40 సెంట్ల ప్రభుత్వ భూమిపై వివాదం నెలకొంది. ఆక్రమించిన ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని కోరుతూ మంగళవారం చింతలపాలెం సర్పంచ్ మెడబలిమి గురవయ్య, గ్రామస్థులు తహసీల్దార్ రమణారావుకు ఫిర్యాదు చేశారు. ఈక్రమంలో విచారణకు హాజరుకావాలని 9 మందికి రెవెన్యూ సిబ్బంది నోటీసులు జారీ చేశారు.

వైభవంగా స్వామివార్ల తిరునాళ్ల

కురిచేడు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మంలంలోని ఆవులమంద పంచాయతీ పరిధిలోని బొల్లికొండపై వెలసిన లక్ష్మీ బొల్లికొండ్రాయ స్వామి తిరునాళ్ల బుధవారం వైభవంగా జరిగింది. ఉదయం స్వామి వారికి పంచామృత అభిషేకం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. రాత్రికి ఏడు విద్యుత్ ప్రభలు ఏర్పాటుచేశారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ స్వామి వారిని దర్శించుకొని పూజలు చేశారు. తిరునాళ్ళలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ ఏర్పాట్లుచేసింది. ఎస్ఐ శివ బందోబస్తు నిర్వహించారు. భారీ ఎత్తున అన్నదానం నిర్వహించారు.

పంటల నమోదు జాబితాను సరిచూసుకోవాలి

తాళ్లూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రబీలో వేసిన పంటల నమోదు జాబితాను రైతు సేవాకేంద్రాల్లో ప్రదర్శించినట్టు ఏవో బి.ప్రసాదరావు తెలిపారు. జాబితాలోని వివరాలను రైతులు సరిచూసుకోవాలన్నారు. బుధవారం లక్కవరం, దోసకాయలపాడు గ్రామాల్లో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఈకేవైసీ ప్రాముఖ్యతను రైతులు గుర్తించాలన్నారు. కార్యక్రమంలో వీఏఏ వీరాంజనేయులు, భార్గవి పాల్గొన్నారు.

పొగాకు బ్యారన్ దగ్ధం

తాళ్లూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): తాళ్లూరులోని ఇడమకంటి నాగిరెడ్డికి చెందిన పొగాకు బ్యారన్ బుధవారం వేకువజామున దగ్ధమైంది. పొగాకు కర్ర గొట్టంపై పడటంతో పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. 1200 పొగాకు కర్రలు, బ్యారన్‌లోని అన్ని వస్తువులు కాలిపోయి రూ.8 లక్షల నష్టం వాటిల్లింది. సమాచారం అందుకున్న అద్దంకి అగ్నిమాపక సిబ్బంది వెళ్లి మంటలను పూర్తిగా అదుపు చేశారు.

ఈకేవైసీ చేయించాలి

తాళ్లూరు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు రేషన్ కార్డుల్లో గల సభ్యులందరికీ ఈకేవైసీ చేయించాలని తహసీల్ధార్ కె.సంజీవరావు పేర్కొన్నారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఈకేవైసీపై రేషన్ డీలర్లకు జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మండలంలో 4645 మందికి ఈకేవైసీ చేయాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఇమ్మానియేల్‌రాజు, డీటీ ప్రశాంత్ పాల్గొన్నారు.



ఓఆర్ఆర్ ఆమోదం.. బైపాస్ రద్దు

ట్రాఫిక్ కష్టాలు తీరేలా.. ఎయిర్‌పోర్టు కు ఉమ్మడి గుంటూరు జిల్లావాసులు సులభంగా చేరేలా.. రాజధాని అమ రావతి అభివృద్ధిలో కీలకమైన ప్రాజెక్టుగా ఉన్న విజయ వాడ తూర్పు బైపాస్‌ను కేంద్రం రద్దు చేసింది. రాజధాని అమరావతికి చుట్టూ ఔటర్ రింగు రోడ్డు మం జూరు చేసిన కేంద్ర ప్రభుత్వం ఇక తూర్పు బైపాస్ అవసరం లేదని తేల్చేసింది. గతంలో కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీ తూర్పు బైపాస్‌కు ఆమోదం తెలిపి ప్రత్యేకంగా నిధుల ను కూడా కేటాయించారు. బైపాస్ నిర్మాణానికి అలైన్‌మెంట్ కూడా ఖరారు చేశారు. ఇక భూ సేకరణ పనులు ప్రారంభమవుతాయ నుకుంటున్న సమయంలో తాజాగా మంజూరైన ఓఆర్ఆర్ పేరుతో తూర్పు బైపాస్‌ను రద్దు చేయడం ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల ప్రజలను కలవరపెడుతోంది. ఓఆర్ఆర్, తూర్పు బైపాస్ పక్కపక్క గా వస్తాయి.. ఇక బైపాస్ అవసరం లేదని కేంద్రం చెప్పడం భావ్యం కాదని.. అలైన్‌మెంట్ మారిస్తే సరిపోయే దానికి రద్దు చేయడం సరికాదని ఇటు గుంటూరు, అటు విజయవాడవాసులు అభిప్రాయ పడుతున్నారు.

- ఆచరణకు నోచుకోని కేంద్ర మంత్రి గడ్కరీ హామీ
- విజయవాడ తూర్పు బైపాస్‌కి రూ.2,176 కోట్లు కేటాయించినా రద్దు
- ట్రాఫిక్ కష్టాలు ఇప్పట్లో తొలగే అవకాశం లేదని గుంటూరు, కృష్ణా జిల్లా వాసుల ఆందోళన
- తూర్పు బైపాస్ రద్దుతో ఎయిర్‌పోర్టు కనెక్టవిటీపై ప్రభావం
- ఎన్‌హెచ్- 16తో ట్రాఫిక్ కష్టాలు.. వెస్ట్ బైపాస్‌తో 10-15 కి.మీ. అదనపు ప్రయాణం


గుంటూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి, గుంటూరు, విజ యవాడను అనుసంధానించే అత్యంత కీలక మైన రహదారుల నిర్మాణంపై తాజా పరి ణామాలు ప్రజల్లో నిరాశను కల్పిస్తున్నాయి. రాజధాని అమరావతికి చుట్టూ ఔటర్ రింగు రోడ్డు మంజూరైన సంతోషం మిగలకుండా, అప్పటికే మంజూరైన విజయవాడ తూర్పు బైపాస్‌ను రద్దు చేయడం రెండు జిల్లాల ప్రజలను తీవ్ర నిరాశకు గురి చేస్తోంది. రాజ ధానికి అనుబంధంగా ఉన్న ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల ప్రజల రవాణా అవసరాల్లో అత్యంత కీలకమైన ఈ బైపాస్ రద్దుతో ట్రాఫిక్ కష్టాలు ఇప్పట్లో తొలగే అవకాశం లేదని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గుంటూరు, విజయ వాడ నగరాల మీదగా వెళ్లే అత్యంత కీలకమైన చెన్నై- కోల్‌కతా జాతీయ రహదారి ఎన్‌హెచ్- 16 ట్రాఫిక్ పద్మవ్యూహంగా మారింది. ఈ రహదారి విజయవాడ బెంజిసర్కిల్, మహానాడు జంక్షన్, రామ వరప్పాడు రింగు, రామవరప్పాడు గుండా వెళుతుంది. ఈ నాలుగు చోట్ల గంటల కొద్దీ ట్రాఫిక్ జామ్ అవు తోంది. ఈ నేపథ్యంలో విజయవాడకు తూర్పు, పశ్చి మలుగా రెండు బైపాస్‌లు నిర్మించాలని ప్రభుత్వం భా వించింది. ఈ క్రమంలో పశ్చిమ బైపాస్ నిర్మాణం ఒక కొలిక్కివచ్చింది. ఇక తూర్పు బైపాస్ పనులు జరగాల్సి ఉం డగా కేంద్ర ప్రభుత్వం దాని అవసరం లేదని తేల్చింది.

కీలకమైన రహదారి..

రాజధాని అమరావతి అభివృద్ధిలో రహదారుల కనెక్టివిటీ, పోర్టుల అనుసంధానం అత్యంత కీలకం. ఈ నేపథ్యంలో విజయవాడ తూర్పు బైపాస్ ఎంతో కీలకమైనది. గుంటూరు, కృష్ణా జిల్లాల ప్రజలు, ప్రధానంగా తీర ప్రాంత ప్రజలను ఎయిర్‌పోర్టుకు అనుసంధానించడంలో ఇదే అత్యంత కీలకమైన రోడ్డుగా భావించారు. ఓఆర్ఆర్ అందుబాటులోకి వచ్చే వరకూ బందరు సీ పోర్టు నుంచి ఎయిర్‌పోర్టును అనుసంధానం చేయడంలో కూడా ఈ రహదారి కీలకమైనది. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాలతో పాటు, తూర్పు రాయలసీమ ప్రాంతాల్లోని ప్రజలకు ట్రాఫిక్ లేని రవాణాను అందుబాటులోకి తేవడంలో ఈ బైపాస్ కీలకమైనది. ఈ పరిస్థితుల్లో కిందటేడాది సెప్టెంబరు నెలాఖరున కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఆమోదముద్ర వేశారు. ఎన్టీఆర్ జిల్లా పొట్టిపాడు టోల్ ప్లాజా నుంచి గుంటూరు జిల్లా చినకాకాని వరకు రూ.50 కి.మీ మేర ఈ రహ దారిని నిర్మించేందుకు ఆమోదం తెలిపి రూ2,176 కోట్లు కేటాయించారు.

అలైన్‌మెంటు మార్చితే పోయేదానికి..

ఓఆర్ఆర్, ఈస్ట్ బైపాస్‌ల నిర్మాణం ఒకదానికి ఒకటి దగ్గరగా ఉంటున్నాయన్న కారణం చూపి కేంద్రం ఈస్ట్ బైపాస్‌ను రద్దు చేసింది. వాస్తవానికి ఈస్ట్ బైపాస్ నిర్మాణానికి ఎన్‌హెచ్ఏఐ 3 అలైన్‌మెంట్లను సూచించింది. ఆప్షన్ 1 కింద విజయవాడకు సమీపంగా 41.230 కి.మీ, ఆప్షన్ 2 కింద మరికొంచెం దూరంలో 44.185 కి.మీ, ఆప్షన్- 3 కింద విజయవాడకు దూరంగా 45.595 కి.మీ పొడవున బైపాస్ నిర్మించుకునే అవ కాశం ఉంది. అయితే ఇందులో మూడో ఆప్షన్‌ను ఎన్ హెచ్ఏఐ ఓకే చేసింది. ఆ రోడ్డు ఇప్పుడు ఓ ఆర్ఆర్‌కు సమీపంలో వస్తోందని, అందుకే ఆ రోడ్డు అవ సరం ఉండదని చెప్పి కేంద్రం బైపాస్‌ను రద్దు చేసింది. రెండు రోడ్లు పక్క పక్కనే వచ్చే అవకాశం ఉన్న ప్పుడు ఆప్షన్ మార్చి తొలి రెం డు ఆప్షన్లలో ఏదో ఒక ఆప్షన్ ను ఎంచుకుంటే బాగుండేదని ప్రజలు భావిస్తున్నారు. ఆ దిశ గా రాష్ట్ర ప్రభుత్వం ప్రయ త్నించాలని కోరుకుం టున్నారు.



ఈస్ట్ బైపాస్ నమూనా ప్రతిపాదనలు

ట్రాఫిక్ కష్టాలు..

రాజధాని నిర్మాణ నేపథ్యంలో ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు సంస్థల రాక, కార్యకలాపాలు విపరీతంగా పెరిగిపోయాయి. దీంతో విజయవాడలో ట్రాఫిక్ విపరీతంగా పెరిగింది. సాధారణ రవా ణాతోపాటు విజయవాడ ఆటోనగర్ రవాణా, బందరు పోర్టు రవాణా కు నాలుగు చోట్ల అవకాశం కల్పించారు. దీంతో మహానాడు జంక్షన్, రింగురోడ్డు జంక్షన్, రామవరప్పాడు గ్రామాల్లో ట్రాఫిక్ గంటల కొద్దీ ఆగి పోతోంది. దీంతో ఎయిర్‌పోర్టు చెకిన్ వద్ద ప్రయాణికులు ఇబ్బందులు పడు తున్నారు. విజయవాడ వెస్ట్ బైపాస్ నుంచి ఎయిర్‌పోర్టుకు వెళ్లాలంటే పొట్టి పాడు టోల్‌గేటు వరకు వెళ్లి, అక్కడి నుంచి తిరిగి వెనక్కి రావాల్సి ఉం టుంది. అలా చేస్తే కనీసం 10 నుంచి 15 కి.మీ మేర అదనంగా ప్రయా ణించాల్సి ఉంటుంది. అదే ఈస్ట్ బైపాస్ అయితే నేరుగా ఎయిర్‌పోర్టుకు కనెక్టివిటీ ఉంటుంది. ఈస్ట్ బైపాస్ రద్దు వల్ల రాజధాని అమరావతి సహా, గుంటూరు, తెనాలి, మంగళగిరి, రేపల్లె, దుగ్గిరాల, పొన్నూరు, చిలకలూరిపేట, మార్టూరు తదితర ప్రాంతాల ప్రజలతోపాటు కృష్ణా జిల్లాలోని బందరు, అవనిగడ్డ, పామర్రు, గు డి వాడ ప్రజలు ఎయిర్‌పోర్టుకు వెళ్లాలంటే ఇ బ్బందులు పడక తప్పదు.



బాపట్ల కేంద్రంగా డ్రగ్స్ దందా

విద్యార్థులే టార్గెట్‌గా సాగుతున్న విక్రయాలు

మత్తు..చిత్తు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

గంజాయి.. డ్రగ్స్.. మత్తు బిళ్లల దందా బాపట్ల కేంద్రంగా సాగుతోంది. గత వైసీపీ హయాంలో గంజాయి విక్రయాలు జరిగాయి. అయితే ప్రభుత్వం మారి గంజాయిపై కఠినంగా ఉంటున్నా జిల్లాలో మాత్రం ఇంకా ఆ ఆనవాళ్లు దర్శనమిస్తూనే ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వం తాలూకా నిర్లిప్తత ఇంకా అధికారులను వీడకపోవడంతో గంజాయి, డ్రగ్స్ దందా యథేచ్ఛగా సాగుతోంది. ఇటీవల టాబ్లెట్ల విక్రయాలు, బహిరంగంగా మత్తు ఇంజక్షన్లు ఘటనలు చూసి జిల్లావాసులు షాక్‌కు గురయ్యారు. ఇటీవల బాపట్ల రూరల్ పరిధిలో డ్రగ్స్ అవశేషాలు కలిగి ఉన్న 1600 టాబ్లెట్లు ఓ సాధారణ మహిళ దగ్గర లభ్యమవడం మరింత కలవరపెడుతోంది. ఈ టాబ్లెట్లు పట్టుబడిన ప్రాంతానికి సమీపంలోనే ఓ ప్రముఖ కళాశాల ఉండడంతో విద్యార్థులు టార్గెట్‌గా సాగుతున్న మత్తు పదార్థాల అమ్మకాన్ని కట్టడి చేసే విషయంలో వ్యవస్థల వైఫల్యం పక్కాగా కనబడుతోంది. ఇది కూడా ఎక్సైజ్ సిబ్బంది నాటుసారా తనిఖీలకు వెళ్లగా యాదృచ్ఛికంగా జరిపిన సోదాల్లో టాబ్లెట్లు వెలుగుచూశాయి. దందా వ్యవస్థీకృతంగా నడిస్తే తప్ప మత్తు అవశేషాలు కలిగిన టాబ్లెట్ల విక్రయాలు జరగవనేది అందరికీ తెలిసిందే. వీటి తయారీ ఎక్కడ జరుగుతుంది అనే అంశంతో పాటు ఏ ప్రాంతం నుంచి వాటి సరఫరా జరుగుతుంది, గతంలో పట్టుబడిన గంజాయి నిందితుల పాత్ర ఏమన్నా ఈ రాకెట్‌లో ఉందా అనేకోణంలో కూడా విచారణ చేపట్టాల్సి ఉంది.

పోలీసుల అదుపులో ముగ్గురు యువకులు

బాపట్లలోని జమ్ములపాలెం ఆర్‌వోబీ మెట్లపై మత్తు ఇంజక్షన్లు చేసుకుంటున్న ముగ్గుర్ని యువకులను అదుపులోకి తీసుకొని విచారించినట్లు సీఐ ఆర్.రాంబాబు తెలిపారు. రైలుపేటకు చెందిన కీర్తి వంశీ, భీమావారిపాలేనికి చెందిన షేక్.రియాజ్, ఇస్లాంపేటకు చెందిన ఓ బాలుడు మెడికల్ షాపులలో పెయిన్ కిల్లర్స్ టాబ్లెట్స్ తీసుకుని వాటిని పొడిగా చేసి నీళ్లల్లో కలిపి ఇన్సూలిన్ చేసుకున్నట్లు చేసుకుని మత్తులోకి వెళుతున్నట్లు గుర్తించామన్నారు. దీంతో వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు

తీవ్రత తెలిసినా.....అదే నిర్లక్ష్యం...

విద్యార్థులు టార్గెట్‌గా కళాశాలలను అడ్డాగా చేసుకుని మత్తు పదార్థాలు అమ్ముతున్న ఉదంతాలు గతంలోనూ వెలుగు చూశాయి. ఈ దఫా ఏకంగా అది టాబ్లెట్ల వరకు విస్తరించింది. అయినా క్షేత్రస్థాయిలోని సిబ్బంది విచారణలో వేగం చూపించడం లేదు. డ్రగ్స్ అవశేషాలు ఉన్న మాత్రలు దొరికి ఇప్పటికీ నాలుగు రోజులు అవుతున్నా విచారణ విషయంలో ఒక్క అడుగు ముందుకు పడలేదని సమాచారం. పట్టుబడిన మాత్రలను ల్యాబ్ పరీక్షలకు పంపడం విషయంలో కూడా ఇంకా ఓ నిర్ధరణకు రాలేదనేది సమాచారం. ఇక ఈ విషయం అటుంచితే బాపట్లలోని జమ్ములపాలెం ఆర్‌వోబీ మెట్లపై బహిరంగంగా ముగ్గురు యువకులు మత్తు ఇంజక్షన్లు చేసుకుంటున్న ఘటన కూ డా ఎవరో ఫోన్‌లో వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేసే వరకు పోలీసులకు తెలియకపోవడం విశేషం.

ఒకరిమీద ఒకరు నెపంతో...

టాబ్లెట్లతో ఉన్న నిందితురాలిని పట్టుకుంది ఎక్సైజ్ సిబ్బంది కాగా, విషయం డ్రగ్స్ విభాగానిది కావడంతో విచారణను అక్కడకు పురమాయించారు. కానీ తాము పట్టుకున్నాం, డ్రగ్ విభాగానికి అప్పగించామని ఎక్సైజ్ విభాగం చేతులు దులుపుకోగా, విచారణలో నిందితురాలు కానీ, ఆ ప్రాంతవాసులు సహకరించడం లేదని డ్రగ్స్ విభాగం అధికారులు చెబుతున్నారు. కేసులు నమోదు చేయడమే తమ ఘనత అన్నట్లుగా వ్యవస్థలు ఉంటున్నాయే తప్పితే మూలాలు ఛేదించి మళ్లీ పునరావృతం కాకుండా చూద్దామన్న చిత్తశుద్ధి కొరవడుతోంది. కీలకమైన కేసుల విషయంలో మానిటరింగ్ చేయాల్సిన ఉన్నతాధికారులు కూడా పట్టించుకోకపోవడంతో కిందిసాయి యంత్రాంగం తమకు తోచినప్పుడు తూతూమంత్రంగా విచారణ చేసి మమ అనిపిస్తున్నారు తప్పితే గంజాయి అమ్మకాలను కట్టడి చేయడానికి అనుసరించాల్సిన వ్యూహాలే కరువయ్యాయి. మొక్కుబడిగా కళాశాలల్లో అవగాహన సదస్సులు పెట్టి మమ అనిపించడం తప్పితే నిఘా వ్యవస్థలు కూడా పనితీరు కూడా ఆశాజనకంగా ఉండడం లేదు.

జలజీవన్ మిషన్‌కు రూ.149 కోట్లు

1 మంజూరైన పనులకు టెండర్లు పిలవాలి 1 అధికారులకు కలెక్టర్ వెంకటమురళి ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): జలజీవన్ మిషన్ కింద జిల్లాకు రూ.149 కోట్లు మంజూరైనట్లు కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. డిస్ట్రిక్ వాటర్ శానిటేషన్ మిషన్ జిల్లా స్థాయి కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 337 పనులకు నిధులు మంజూరయ్యాయన్నారు. జలజీవన్‌మిషన్ కింద మంజూరు చేసిన పనులకు టెండర్లు పిలవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు తాగు నీటి ఇబ్బందులు రాకుండా సమ్మర్ యాక్షన్ ప్లాన్ తయారు చేయాలన్నారు. జిల్లాలోని సమగ్రనీటి సరఫరా పథకాలు, తాగునీటి బోర్ల మరమ్మత్తులకి అవసరమైన ప్రణాళికలు తయారు చేయాలని సూచించారు. జిల్లాలోని తాగునీటి పథకాల మరమ్మత్తులకి 15వ ఆర్థిక సంఘ నిధులపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాలలో టాయిలెట్ల మరమ్మత్తులకి ప్రతిపాదనలు తయారు చేయాలన్నారు. మురుగు నీటి కాల్వల నిర్మాణాలకు పంచాయతీకి రూ.50 లక్షలు నిధులు మంజూరు చేసేవిధంగా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సముద్రతీరంలో ఆరు బీచ్‌ల వద్ద 10 బయో టాయిలెట్స్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా గ్రామీణ నీటిసరఫరాశాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ అనంతరాజు, డీపీవో ప్రభాకర్, డ్వామాపీడీ విజయలక్ష్మి, స్త్రీశిశు సంక్షేమశాఖ పీడీ రాదామాధవి, జిల్లా వ్యవసాయాధికారి రామకృష్ణ, గుంటూరు, ప్ర కాశం జడ్పీ డిప్యూటీ సీఈవోలు కృష్ణ, బాలమ్మ పాల్గొన్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.24 (గురువారం సాయంత్రం)

సహరి : 4.55 (శుక్రవారం ఉదయం)

వైసీపీకి మర్రి షాక్

- ఎమ్మెల్సీ పదవికి రాజీనామా
- రెండు రోజుల్లో పార్టీకి రాజశేఖర్ గుడ్‌బై
- అనుయాయులతో కలిసి త్వరలో టీడీపీలో చేరిక
- వరుస పరాభవాలు.. జగన్‌పై ఆగ్రహంతో నిర్ణయం



గుంటూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఆవిర్భావం నుంచి పార్టీకి వెన్నుదన్నుగా ఉండటమే కాకుండా ఉమ్మడి గుంటూరు జిల్లాలో తొలుత రథ సారధ్యం వహించిన మర్రి రాజశేఖర్ వైసీపీకి షాకిచ్చారు. ఎంతోకాలం నుంచి అందరూ ఊహించినట్లుగానే మాజీ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ వైసీపీని వీడేందుకు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా ఆయన తొలుత వైసీపీ ద్వారా తాను పొందిన ఎమ్మెల్సీ పదవిని వదిలేసుకున్నారు. ఈ మేరకు రాజీ నామా పత్రాన్ని బుధవారం శాసనమండలి చైర్మన్‌కు అందజేశారు. చిలకలూరిపేటలో కాంగ్రెస్‌లో రాజకీయ ప్రస్థానం ప్రారంభించి అనంతరం వైసీపీ ఆవిర్భావంతో ఆ పార్టీలో చేరారు. అయితే విడదల రజిని రాజకీయ అరంగేట్రంతో నియోజకవర్గంలో మర్రి రాజశేఖర్ ప్రాధాన్యం తగ్గిపోయింది. 2019 ఎన్నికల్లో ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న రాజశేఖర్‌ను కాదని వైసీపీలో కొత్తగా చేరిన విడదల రజినికి సీటు ఇవ్వడంతో మర్రి అనుయాయులు తిరుగుబాటు చేశారు. ఆ సమయంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా చిలకలూరిపేట వెళ్ళిన వైఎస్ జగన్ రజినిని గెలిపిస్తే రాజశేఖర్‌కు ఎమ్మెల్సీ ఇచ్చి మంత్రిని చేస్తానని హామీ ఇచ్చారు. ఎన్నికల తర్వాత కనీసం ఎమ్మెల్సీ పదవి కూడా వెంటనే ఇవ్వకుండా రజినికి మంత్రి పదవిని కట్టబెట్టారు. ఈ క్రమంలో వరుస పరాభవాలతో రగిలిపోతున్న ఆయన కొద్దికాలంగా పార్టీకి దూరంగా ఉంటున్న విషయం తెలిసిందే. ఈ పరిస్థితుల్లో గుంటూరు పశ్చిమలో ఓడిపోయిన మాజీ మంత్రి విడదల రజినిని తిరిగి చిలకలూరిపేటకు ఇన్‌చార్జిగా నియమించారు. దీంతో ఆయన ఉక్రోషంతో రగిలి పోయారు. ఆ సమయంలోనే ఆయన వైసీపీని వీడతారని కథనాలు వెలువడ్డాయి. అంతకు మునుపు జగన్ రాజశేఖర్‌ను పిలిపించుకుని చిలకలూరిపేట ఇన్‌చార్జి బాధ్యతలు ఇస్తానని హామీ ఇవ్వడమే కాకుండా వచ్చే ఎన్నికల్లో సతీమణికి సీటు ఇస్తానని ఆశ పెట్టారని సమాచారం. ఇది జరిగిన కొద్ది రోజులకే రజిని చక్రం తిప్పడం ఆ తర్వాత వారం రోజులు గడవక ముందే మర్రికి ఇచ్చిన హామీని జగన్ తుంగలో తొక్కి చిలకలూరిపేట ఇన్‌చార్జి బాధ్యతలు రజినికి కట్టబెట్టటంతో మర్రి అవాక్కయ్యారు. ఇక ఆ రోజు నుంచే ఆయన టీడీపీలో చేరాలని నిర్ణయించుకున్నారు. 2023లో ఆయనకు ఎమ్మెల్సీ ఇవ్వగా 2029 వరకు ఆ పదవిలో కొనసాగే అవకాశం ఉన్నా కూడా పదవికి రాజీనామా చేయడం విశేషం. గత ఎన్నికల సమయంలో వైసీపీని వీడి టీడీపీలో చేరి తిరిగి ఎంపీగా గెలుపొందిన లావు శ్రీకృష్ణదేవరాయులతో రాజశేఖర్‌కు సన్నిహిత సంబంధాలున్నాయి. కాగా త్వరలో మంచి ముహూర్తం చూసుకుని తన అనుయాయులతో వైసీపీకి గుడ్ బై చెప్పి టీడీపీలో చేరేందుకు ఆయన సన్నద్ధమవుతున్నారు.

మండల పరిషత్ అధ్యక్షుల ఎన్నిక 27న

- ఉమ్మడి గుంటూరు జిల్లాలో మూడు స్థానాల్లో ఖాళీలు
- అదే రోజున ఉపాధ్యక్ష, కో-ఆప్షన్ సభ్యుల ఎంపిక

గుంటూరు సిటీ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ ల్లో ఎన్నికల నగారా మోగింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఖాళీ గా ఉన్న మండల పరిషత్ అధ్యక్ష, ఉపాధ్యక్ష, కో- ఆప్షన్ సభ్యుల ను ఎన్నుకునేందుకు ఎన్నికల కమిషన్ బుధవారం అనుమతి ఇచ్చింది. తొలుత ఆయా పదవులు ఖాళీగా ఉన్న మండలాలకు కలెక్టర్ ప్రత్యేక అధికారులను నియమిస్తారు. నియమించబడిన ప్రత్యేక అధికారులు ఈ నెల 23 నాటికి మండల పరిషత్‌లోని సభ్యులకు నోటీసులు అందజేస్తారు. 27న నిర్వహించే ప్రత్యేక సాధారణ సమావేశంలో ఎంపీపీ, ఉప ఎంపీపీ, కో-ఆప్షన్ సభ్యుల ను ఎన్నుకుంటారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని అచ్చంపేట, పిట్టలవానిపాలెం, దుగ్గిరాల మండల పరిషత్‌ల్లో అధ్యక్ష స్థానాలు ఖాళీగా ఉన్నాయి. నరసరావుపేట, గుంటూరు రూరల్, కారంపూడి మండలాల్లో ఉపాధ్యక్ష స్థానాలు ఖాళీగా ఉన్నాయి. భట్టిప్రోలు, తెనాలి, ముప్పాళ్ల మండల పరిషత్‌ల్లో కో-ఆప్షన్ సభ్యుల స్థానాలు ఖాళీగా ఉన్నాయి. ఆయా స్థానాల్లో ఎన్నికల కార్యక్రమం నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

పేటలో సిండికేట్లు

చిలకలూరిపేటలో గంట ముందే వైన్స్ మూత

(చిలకలూరిపేట, ఆంధ్రజ్యోతి)

వ్యాపారం.. అంటే ఎక్కడైనా పోటీ ఉంటుంది. కానీ చిలకలూరిపేటలో మద్యం వ్యాపారులు కలిసికట్టుగా వ్యాపారం చేసుకుంటూ మందుబాబులను దోచుకుం టున్నారు.. ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. వీరికి అధికార పార్టీ నేతల అండగా ఉంటుండగా.. చర్యలు తీసుకోవాల్సిన ఎక్సైజ్, పోలీసు అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారు. సాధారణంగా ఎక్కడైనా వైన్స్‌ల్లో నిబంధనలకు విరుద్ధంగా ఎక్కువ సమయం మద్యం విక్రయాలు చేస్తుంటారు. కానీ చిలకలూరిపేటలో ఇందుకు భిన్నంగా నిర్ణీత సమయం కన్నా ముందుగానే మూసివేస్తున్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా చిలకలూరిపేటలో పరిస్థితి నెల కొంది. చిలకలూరిపేటలో మొత్తం 11 బార్లు, 6 వైన్స్ ఉండగా 9 బార్లు 6 వైన్ షాపుల వారు సిండికేట్ అయ్యారు. వీరంతా కలిసి ఒకవైపు మందుబాబులను దోచుకుంటూ మరోవైపు ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నిబంధనల ప్రకారం రాత్రి 10 గంటలకు వైన్ షాపులు మూసి వేయాలి. అయితే రాత్రి 9 గంటలకే ఇక్కడ వైన్ షాపులను మూసి వేస్తున్నారు. మందుబాబులకు రాత్రి 9 గంటల నుంచి మద్యం దొరకకుండా చేస్తున్నారు. దీంతో తప్పని సరిగా మందు బాబులు బార్లకు వెళ్లాల్సి వస్తోంది. ఇక ఇక్కడ అదనపు ధర పెట్టి కొనుగోలు చేయాల్సిన పరి స్థితిని సృష్టించారు. నిబంధనలను అతిక్రమించి బార్లు, వైన్ షాపుల నిర్వాహకులు వ్యాపారం చేస్తున్నారు.

నెల రోజులుగా తగ్గిన ఇండెంట్

బార్ల నిర్వాహకులు నరసరావుపేటలోని ఎక్సైజ్ డిపో నుంచి మద్యం కొనుగోలు చేస్తారు. నెల రోజులుగా డిపో నుంచి కొనుగోలు చేసే సరుకు సగానికి సగం తగ్గించారు. బార్ల వ్యాపారులు నిత్యం 50 శాతం సరుకు కొనుగోలు ఇండెంట్ మాత్రమే పెడుతున్నారు. మిగతా సగం సరుకును వైన్‌షాపుల నుంచి సేకరిస్తున్నారు. ఈ సరుకుపై క్వార్టర్ బాటిల్‌కు రూ.50 చొప్పున ధర పెంచి బార్లలో విక్రయిస్తున్నారు. వచ్చే లాభాన్ని బార్లు, వైన్ షాపులవారు కలిసి పంచుకుంటున్నారు.

విద్యుత్ బిల్లుల నుంచి విద్యాలయాలకు విముక్తి

» సుమారు రూ.20లక్షల వరకు ఊరట
» కూటమి ప్రభుత్వానికి ఉపాధ్యాయుల కృతజ్ఞతలు

చీరాల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో విద్యుత్ బిల్లులు పెండింగ్‌లో ఉండగా, నానా యాతన పడుతున్న ఉపాధ్యాయులకు టీడీపీ కూటమి ప్రభుత్వం తీపి కబురు అందజేసింది. గత వైసీపీ పాలకులు విద్యారంగ అభివృద్ధిని గాలికొదిలేశారు. కేవలం ప్రచారార్భాటాలకే పరిమితమయ్యారు. విద్యార్థులకు అందించిన కిట్‌లు నాణ్యతా లోపంతో రోజులకే మూలనపడ్డాయి. నాడు - నేడు అంటూ కాసులు దండుకుందే తప్ప పూర్తి స్థాయిలో పనులు జరిగిన దాఖలాలు లేవు. ఈక్రమంలో నిధులు లేక విద్యాలయాలు అభివృద్ధికి నోచుకోక పాఠశాలల పరిస్థితి దయనీయంగా మారింది. దీంతో విద్యుత్ బిల్లులు మోత మోగడంతో అప్పట్లో కొంత వరకు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తిప్పలు పడి కొంత



మేరకు బిల్లులు చెల్లించారు. అయినా పూర్తి స్థాయిలో చెల్లింపులు జరగక గతంలోనే ఆయా విద్యాలయాలకు విద్యుత్ శాఖ నుంచి నోటీసులు అందాయి. ఈవిధంగా దుర్భర పరిస్థితులలో ఉన్న పాఠశాలలకు కూటమి ప్రభుత్వం వరాల జల్లు కురిపించింది. పెండింగ్‌లో ఉన్న బిల్లులను మేమే కడతామని అసెంబ్లీ సమావేశాల్లో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రకటించడంతో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు హమ్మయ్య అంటూ ఊపిరిపీల్చుకుంటున్నారు. మంత్రి లోకేష్ ప్రకటనతో చీరాల పట్టణం, గ్రామీణ ప్రాంతాల్లోని సుమారు 84 స్కూళ్లకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న రూ.12 లక్షలు, వేటపాలెం మండల పరిధిలోని 54 స్కూళ్లకు పెండింగ్‌లో ఉన్న సుమారు రూ.8 లక్షల కరెంట్ బిల్లులు ఉపాధ్యాయులకు భారంగా మారేవి. ఎట్టకేలకు ప్రభుత్వ నిర్ణయంతో ఊరట లభించింది.

సర్క్యులర్ అందాల్సి ఉంది



ప్రభుత్వం తాజాగా ప్రకటించిన విద్యుత్ బిలులు చెల్లింపుల విషయం విద్యా రంగానికి ఊరటనిచ్చింది. అయితే సర్క్యులర్ అందాక పూర్తిగా పరిశీలన చేసిన అనంతరం పాఠశాలలకు అమలు చేస్తాం.

- సుబ్రహ్మణ్యేశ్వరరావు, చీరాల మండల విద్యాశాఖ అధికారి

ప్రభుత్వ నిర్ణయం ఆనందదాయకం



గతంలో విద్యుత్ సమస్యల కారణంగా బిల్లుల చెల్లింపుల్లో చా లా ఇబ్బందులు పడ్డాం. ప్రస్తుతం ఇంకా రూ.50వేల బకాయి ఉన్నాం. పలుమార్లు మా సొంత జీతాల నుంచి చెల్లింపులు చేశాం. ఈక్రమంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చాలా సంతోషంగా ఉంది.

- మెడబలిమి శేఖరరావు
పందిళ్లపల్లి ప్రధానోపాధ్యాయులు

నిర్ణయం భేష్



విద్యుత్ బిల్లులు కట్టేందుకు నానా తంటాలు పడ్డాం. ఇంకా రూ.40 వేలు వరకు బకాయి పడ్డాం. జీతాలు ఆపుకుని బిల్లులు చెల్లించాం. తాజా నిర్ణయంతో స్కూళ్లకు పూర్వ వైభవం అందుకుంటుంది. మాకు భారం తగ్గుతుంది. థాంక్యూ సీఎం.

- శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయుడు
వాడరేవు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల



సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు పత్రాలను అందిస్తున్న టీడీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి మహేంద్రనాథ్

విద్య, వైద్యానికి ప్రాధాన్యం

టీడీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి డాక్టర్ మహేంద్రనాథ్

చీరాల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు మొదటి ప్రాధాన్యతను ఇస్తుందని టీడీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి డా.మహేంద్రనాథ్ పేర్కొన్నారు. వివిధ ఆరోగ్య సమస్యలు నిమిత్తం వైద్యం పొందిన 36 మందికి ప్రభుత్వం నుంచి విడుదలైన రూ.42లక్షలు విలువగల సిఎం రిలీఫ్ ఫండ్ మంజూరు పత్రాలను బుధవారం క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ నిరుపేదలకు కూడా కార్పోరేట్ స్థాయి వైద్యం అందించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు మహేంద్రనాధ్ తెలిపారు. ఆయన వెంట పలువురు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

మోడల్ కాలేజీలో ప్రవేశాలకు ఆహ్వానం

చీరాల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : ఏపీ మోడల్ జూనియర్ కళాశాలలో జూనియర్ ఇంటర్ బైపీసీ, ఎంపీసీ, సీఈసీ, ఎంఈసీ విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సరళ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన వారు ఈనెల 22వ తేదీ లోపు ఆన్‌లైన్ ద్వారా అర్జీలు చేసుకోవాలని వివరాలకు కళాశాల సిబ్బందిని సంప్రదించాలని తెలిపారు.

మణికేశ్వరంలో ప్రత్యేక అధికారి పరిశీలన



గ్రామస్థులతో మాట్లాడుతున్న గుండ్లకమ్మ ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విజయజ్యోతి కుమారి

అద్దంకి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : గుండ్లకమ్మ రిజర్వాయర్ ముంపు గ్రామమైన మణికేశ్వరంలో గుండ్లకమ్మ ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విజయజ్యోతి కుమారి బుధవారం పరిశీలించారు. పునరావాసకాలనీలో పరిశీలించారు. ఎస్సీ కాలనీలకు భూసేకరణ, ముస్లిం కాలనీ వాసులకు స్థలాల పంపిణీ, పునరావాస కాలనీలో మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై గ్రామస్థులతో చర్చించారు. ఇటీవల మంత్రి రవికుమార్ దృష్టికి మణికేశ్వరం గ్రామస్థులు సమస్యలను తీసుకు పోవడంతో గుండ్లకమ్మ ప్రాజెక్టు అధికారులు బుధవారం పర్యటించారు. గ్రామస్థులు వినతిపత్రం అందజేశారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరి, టీడీపీ నేతలు కరిముల్లా, నాగయ్య, మీరావలి, బడావలి, ఆదినారాయణ, బలరామిరెడ్డి, రామయ్య, మాథ్యూస్, ప్రసాద్, రఫీ పాల్గొన్నారు.

అధిక ఎరువులతో భూసారానికి దెబ్బ

పంగులూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : పంటసాగులో మోతాదును మించి ఎరువుల వాడకం మంచిది కాదని, అధిక ఎరువుల వినియోగంతో భూసాంద్రత దెబ్బ తింటుందని వ్యవసాయాధికారి డి.సుబ్బారెడ్డి అన్నారు. మండలంలోని నూజెళ్లపల్లి, చందలూరు గ్రామాలలో బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. సాగులో ఉన్న పలు పంటలను రైతులతో కలసి పరిశీలించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మురకొండ సుబ్బారావు, సిబ్బంది లక్ష్మీప్రియ, రైతులు పాల్గొన్నారు

మామిడి పూతలో తెగుళ్లు లేకుండా సాగు చేయాలి

వేటపాలెం (చీరాల), మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : మామిడి పూతలోని తెగుళ్లు సోకకుండా సాగు చేస్తే మంచి దిగుబడలు వస్తాయని ఏవో కాశీ విశ్వనాథ్ పేర్కొన్నారు. పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల పరిధిలోని పందిళ్లపల్లి మామిడి సాగును పరిశీలించారు. ఈసందర్భంగా పిందె దశలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది అలేఖ్య, కుసుమ, రాజేష్, జశ్వంత్, రైతులు పాల్గొన్నారు

కారంచేడు (పర్చూరు) : పంటల సాగుపై రైతులు అవగాహన పెంచుకోవాలని ఏవో సుధీర్‌బాబు అన్నారు. బుధవారం కారంచేడు మండల పరిధిలోని ఆదిపూడి, యర్రంవారిపాలెం గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా సాగుపై రైతులకు అవగాహన కల్పించారు.

రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలు

అద్దంకిటౌన్ : రాయితీపై ప్రభుత్వం అందిస్తున్న వ్యవసాయంత్ర పరికరాలను రైతులు సద్వినియోగపర్చుకోవాలని ఏవో కొర్రపాటి వెంకటకృష్ణ తెలిపారు. బుధవారం మండలంలోని తిమ్మయపాలెం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ 9చెక్కల గొర్రులు, తైవాన్ స్ప్రేయర్లు రాయితీపై అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో కోటేశ్వరరావు, వీఏఏ ఖాజాబీ పాల్గొన్నారు.

వాసవీ ఆధ్వర్యంలో చలివేంద్రం

అద్దంకిటౌన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం పాత ఆంధ్రాబ్యాంక్ ఎదురుగా చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని ముఖ్య అతిథిగా హాజరైన కొత్తమాస తాతయ్య ప్రారంభించారు. కార్యక్రమంలో క్లబ్ ఇంటర్నేషనల్ జాయింట్ సెక్రటరీ ఉమా అన్నపూర్ణ, రీజనల్ చైర్మన్ రాజా, రీజనల్ సెక్రటరీ గుణశేఖర్, జోన్ చైర్మన్ వీ ఆదినారాయణ, క్లబ్ ప్రెసిడెంట్ నాగండ్ల వెంకట రమణ, సెక్రటరీ తాతా హరిబాబు, ట్రెజరర్ వేముల జయరాం, టి. శ్రీనివాసరావు, కౌన్సిలర్ రమేష్, సుబ్బయ్య పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సభ్యులు

సోలార్ పవర్ ఉత్పత్తికి ప్రతిపాదనలు

విద్యుత్ శాఖ ఈఈ మస్తాన్‌రావు

అద్దంకి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : సోలార్ విద్యుత్ ఉత్పత్తికి అనువైన 12 సబ్ స్టేషన్‌లను గుర్తించి ప్రతిపాదనలు పంపినట్లు ఈఈ నల్లూరి మస్తాన్‌రావు అన్నారు. అద్దంకి డివిజన్ పరిధిలోని డీఈఈలు, ఏఈలు, సబ్ ఇంజనీర్‌లతో బుధవారం ఈఈ మస్తాన్‌రావు, అకౌంట్స్ ఆఫీసర్ శ్రీనివాసరెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మస్తాన్‌రావు మాట్లాడుతూ ప్రధానమంత్రి కిసాన్ ఊర్జా సురక్ష ఏవం ఉద్దాన్ మహాభియాన్ యోజన పథకంలో భాగంగా ఫీడర్ సోలరైజేషన్ ప్లాంట్‌లు ఏర్పాటు చేసి వ్యవసాయ విద్యుత్ వినియోగం ఉన్న 11కేవీ ఫీడర్‌కు అనుసంధానించడం జరుగుతుందన్నారు. అద్దంకి డివిజన్ పరిధిలోని ముప్పవరం, ధర్మవరం, కుంకుపాడు, శంఖవరప్పాడు, సాధునగర్, కొమ్మాలపాడు, వి.కొప్పెరపాడు, వల్లాపల్లి, కొమ్మినేనివారిపాలెం, ఉప్పుమాగులూరు, బల్లికురవ, వెలమవారిపాలెం సబ్‌స్టేషన్‌లను



సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న విద్యుత్ ఈఈ మస్తాన్‌రావు

ఎంపిక చేసి 20 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. సోలార్ ప్లాంట్ నిర్మాణం ఒక్కో మెగా వాట్‌కు 4.5 ఎకరాల భూమి అవసరం అవుతుందన్నారు. ప్రభుత్వ భూమి అందుబాటులో లేని చోట రైతుల నుంచి కౌలుకు తీసుకోవడం జరుగుతుందన్నారు. టెండర్‌లు పూర్తయిన వెంటనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

50శాతం రాయితీపై అధికలోడు క్రమబద్ధీకరణకు అవకాశం

గృహ వివియోగానికి సంబంధించి అధిక లోడు ను 50 శాతం రాయితీతో క్రమబద్ధీకరించుకునేందుకు ఏపీ ఈఆర్‌సీ అవకాశం కల్పించదని ఈఈ మస్తాన్‌రావు తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు వినియోగించుకోవాలన్నారు.

ఒక కిలోవాట్‌కు 2350 రూపాయలు చెల్లించాల్సి ఉండగా, 50 శాతం రాయితీతో 1250 రూపాయలు చెల్లిస్తే సరిపోతుందన్నారు. 5 కిలో వాట్‌ల లోపు అయితే స్థానిక విద్యుత్ కార్యాలయంలోని కౌంటర్‌లో, అంతకు మించితే మీ సేవా కేం ద్రాలలో చెల్లించాలని తెలిపారు. ఈ అవకాశం జూన్ 30వ తేదీ వరకు ఉంటుందన్నారు.అధికారులు క్షేత్ర స్థాయిలో వినియోగదారులలో మరింత అవగాహన కల్పించాలని కోరారు. ఈ సమవేశంలో డీఈఈలు దామోదర్, సురేం ద్రబాబు, ఈఆర్‌వో కార్యాలయాల ఏఏవోలు శ్రీనివాసులు, శ్రీనివాసరావు, డివిజన్ పరిధిలోని ఎఈలు, సబ్ ఇంజనీర్ లు పాల్గొన్నారు.



నగదును అందజేస్తున్న మద్దిపాడుకు చెందిన అనందకుమార్, పద్మావతి దంపతులు

శింగరకొండ ముఖమండపానికి రూ.లక్ష విరాళం

అద్దంకి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం రాతి ముఖ మండపం పునఃనిర్మాణ పనులకు మద్దిపాడుకు చెందిన యండ్రపాటి ఆనందకుమార్, పద్మావతి దంపతులు రూ.1,01,116 విరాళాన్ని బుధవారం అందజేశారు. అనంతరం ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలి

అద్దంకి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి పట్టణం పరిధిలోని బీసీ, ఈడబ్ల్యూఎస్, కాపు కులాలకు చెందిన వ్యక్తులు చంద్రన్న స్వయం ఉపాధి పథకం కింద రుణాలు, కుట్టు మిషన్‌లు పొందేందుకు ఈనెల 22లోపు దరఖాస్తు చేసుకోవాలని కమిషనర్ రవీంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ లేదా సమీప సచివాలయాల్లో పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

గ్రీన్‌ఫీల్డ్ పోర్ట్ ఏర్పాటుకు ముందడుగు

ఎమ్మెల్యే ఏలూరి

చినగంజాం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : చినగంజాం మండలంలో గ్రీన్ ఫీల్డ్ పోర్ట్, నౌకాశ్రయం తయారీ భారీ యూనిట్ ఏర్పాటుకు ముందడుగు పడిందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తెలిపారు. ఇప్పటికే దీని ఆవశ్యకతపై కేంద్ర మంత్రికి లేఖ రాశామని పేర్కొన్నారు. ఈ యూనిట్ ఏర్పాటుకు కేంద్రమంత్రి సర్బానందసోనోవాల్ సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు. మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి కృషి చేయడం పట్ల ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. ఈ పరిశ్రమతో ఈ ప్రాంత రూపురేఖలు మారతాయన్నారు. నిరుద్యోగులకు పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పర్చూరు నియోజకవర్గం దిక్సూచీగా మారుతుందన్నారు. వేలాదిమందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. రవాణా వ్యవస్థ మెరుగుపడవంతోపాటు పలు పరిశ్రమలు వచ్చే అవకాశం ఉందని ఎమ్మెల్యే ఏలూరి తెలిపారు.

వైభవంగా రామలింగేశ్వరస్వామి తిరునాళ్ల

బల్లికురవ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉప్పుమాగులూరు గ్రామంలో ఉన్న శ్రీ రామలింగేశ్వర స్వామి వారి వార్షిక తిరునాళ్ల బుధవారం వైభవంగా జరిగింది. గ్రామానికి సమీప కొండ ప్రాం తంలో ఉన్న పురాతన కాలం నుంచి ఉన్న రామలింగేశ్వర స్వామి తిరునాళ్ల సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున దేవాలయానికి చేరి ప్రత్యేక అభిషేకాలలో పాల్గొన్నా రు. గ్రామస్థులు సమష్టి కృషితో దేవాలయం వద్ద ఉదయం నుంచి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. తిరునాళ్లలో భాగంగా టీడీపీ ఆధ్వర్యంలో విద్యుత్ ప్రభను ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. గ్రామ పరిసర గ్రామాలకు చెందిన భక్తులు తిరునాళ్లకు తరలి వచ్చారు. బల్లికురవ ఎస్ఐ జీవీ చౌదరి తిరునాళ్లలో ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు.



టీడీపీ ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభ

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

» ఐదుగురికి తీవ్ర గాయాలు
» ముప్పవరం నుంచి కూలి పనుల కోసం వెళ్తుండగా ఘటన

పంగులూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అలవలపాడు గ్రామ అడ్డరోడ్డు సమీపం జాతీయ రహదారిపై బుధవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందగా ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. మరికొందరు స్వల్పగాయాలతో బయటపడ్డారు. ప్రమాదం బారిన పడిన మహిళలు ముప్పవరం గ్రామానికి చెందిన మహిళా కూలీలు. వీరిలో షేక్ అఫీర్ బీ (60) మార్టూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మృతి చెందింది. రేణంగివరం ఎస్ఐ వినోద్‌బాబు సమాచారం మేరకు.. ముప్పవరం గ్రామానికి చెందిన మహిళా కూలీలు ఆటోలో బుధవారం ఉదయం 5 గంటల సమయంలో మిరప కోతలకు రావినూతలకు బయలు దేరారు. అదే రోడ్డుపై గుంటూరు వైపు వెళ్తున్న గుర్తు తెలియని లారీ అత్యవసర ల్యాండింగ్ రోడ్డు మధ్య భాగంలో అమర్చిన దిమ్మెను ఢీకొట్టగా ఆ దిమ్మె ఒంగోలువైపు వెళ్లే



షేక్ అఫీర్ బీ మృతదేహం | అఫీర్ బీ (ఫైల్)

రోడ్డులో పడి పోయింది. ఈ రహదారిలో మహిళా కూలీలతో వెలుతున్న ఆటో డ్రైవర్ రోడ్డుపై పడి ఉన్న దిమ్మెను గుర్తించక ఢీకొట్టడంతో ఈ ఘటన జరిగింది. ఈ ప్రమాదంలో షేక్ అఫీర్‌బీ మృతి చెందగా, దాసరి పుష్పాలు, కొమ్ము పాపమ్మ, చింతల లక్ష్మి, వరపర్ల భారతి, కొమ్ము సలోమీలకు తీవ్ర గాయాలు కాగా మిగిలిన వారు సల్ప గాయాలతో బయటపడ్డారు. గాయాలైన ఐదుగురు మహిళలను చికిత్స నిమిత్తం హైవే అంబులెన్స్‌లో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం వెంకటరమణ హాస్పటల్స్‌కు తరలలించారు. ఆటో నడుపుతున్న నందిపాగు ఇమానియేల్ శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా ఉందనడంతో గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలిలించినట్లు ఎస్ఐ తెలిపారు. అఫీర్ బీ మృత దేహానికి మార్టూరు ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టం నిర్వహిస్తున్నామని, ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వినోద్‌బాబు తెలిపారు.

బాధితులను పరామర్శించిన మంత్రి గొట్టిపాటి

రోడ్డు ప్రమాదంపై మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పందించారు. సమాచారం తెలుసుకున్న మంత్రి గొట్టిపాటి ఘటనలో ప్రాణాలు కోల్పోయిన షేక్ అఫీర్ బీ కుటుంబ సభ్యులను ఫోన్ ద్వారా పరామర్శించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామన్నారు. ఈ ఘటనలో క్షతగాత్రులైన మహిళలను మంత్రి గొట్టిపాటి ఫోన్ ద్వారా పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించాలని వైద్యులకు సూచించారు. బాధితులను ముప్పవరం టీడీపీ నేతలు కుక్కపల్లి ఏడుకొండలు, ఎస్.సి. సెల్ అధ్యక్షులు వరపర్ల సుబాబరావు, చింతల సహదేవుడు శ్రీనివాసరావు పరామర్శించారు.



మైలవరంలో బస్సు ఎక్కేందుకు సిద్ధంగా ఉన్న విద్యార్థులు

టెన్త్ విద్యార్థులకు బస్సు

మైలవరం నుంచి ప్రారంభమైన ఆర్టీసీ సేవలు

అద్దంకి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పదోతరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల కోసం ఎట్టకేలకు అద్దంకి ఆర్టీసీ డిపో అధికారులు బస్సును ఏర్పాటు చేశారు. అద్దంకి మండలం మైలవరం హైస్కూల్ నుంచి 45 మంది 10వ తరగతి విద్యార్థులు బల్లికురవ మండలం వైదనలోని పరీక్షా కేంద్రానికి వెళ్లాల్సి ఉంది. ముందుగా విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యా కమిటీ చైర్మన్ కృష్ణమారుతీ ఆర్టీసీ అధికారులను కలిసి సమస్యను వివరించినా బస్సు ఏర్పాటుకు ఒప్పుకోలేదు. దీంతో సోమవారం విద్యార్థులు ఆటోలలో పరీక్షా కేంద్రానికి వెళ్లారు. ఆంధ్రజ్యోతిలో సోమవారం కథనం ప్రచురితం కావడంతో పాటు సమస్యను విద్యా కమిటీ చైర్మన్ కృష్ణమారుతి పోలీస్ అధికారుల దృష్టికి తీసుకుపోవడంతో సీఐ సుబ్బరాజు ఆర్టీసీ డీఎం రామ్మోహనరావుతో ఫోన్‌లో మాట్లాడారు. బుధవారం నుంచి ఐదురోజులపాటు పరీక్షలకు బస్సు సేవలను కల్పించినట్లు డీఎం రామ్మోహనరావు హామీ ఇచ్చారు. దీంతో బుధవారం ఉదయం మైలవరం నుంచి పరీక్షా కేంద్రానికి విద్యార్థులను తీసుకువెళ్లి తిరిగి పరీక్ష ముగిశాక మైలవరంకు చేర్చేలా బస్సును ఏర్పాటు చేశారు. దీనిపై తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

రేపు వలపర్లలో ఆంజనేయస్వామి తిరునాళ్ల

మార్టూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వలపర్ల గ్రామంలో సాగర్ కాలువ పక్కన ఉన్న ఆంజనేయస్వామి దేవస్థానం తిరునాళ్ల మహోత్సవాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్లు బుధవారం కమిటీ సభ్యులు బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం దేవస్థానంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. అంతేగాకుండా భారీగా అన్నదానాన్ని కూడా ఏర్పాటు చేసినట్లు సభ్యులు తెలిపారు.

రేపు నర్సరీల నిర్వహణపై సదస్సు

మార్టూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాజుపాలెం సెంటర్ వద్ద శ్రీసాయి బాలాజీ కల్యాణ మండపంలో శుక్రవారం ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని నర్సరీ యజమానులకు రక్షిత వ్యవసాయ సాగు పద్ధతులు, నర్సరీల నిర్వహణపై అవగాహన సదస్సును ఏర్పాటు చేసినట్లు ఉద్యాన అధికారి బీ హనుమంతనాయక్ బుధవారం ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి జిల్లాలోని నర్సరీ యజమానులందరూ హాజరుకావాలని ఆయన కోరారు.

పర్చూరు బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా జాన్‌బాబు



అధ్యక్ష, కార్యదర్శులు జాన్‌బాబు, రుక్సానా

పర్చూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా పూరిమెట్ల జన్‌బాబును బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా షేక్ రుక్సానా, జాయింట్ సెక్రటరీగా కాసా అశోక్ కుమార్, కోశాధికారిగా కరి ప్రవీణ్ నియమితులయ్యారు. 2025-26 సంవత్సరానికి సంబంధించి పర్చూరు కోర్టు భవనాల సముదాయ బార్‌అసోషియేషన్ ప్రతినిధులుగా కొనసాగుతారు. నూతనంగా ఎంపికైన కమిటీని న్యాయవాదులు అభినందించారు.

రూ.15లక్షలతో వాకింగ్ ట్రాక్ నిర్మాణం

ఇంకొల్లు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : నాగులచెరువుకట్టపై రూ.15 లక్షలతో వాకింగ్ ట్రాక్‌ను నిర్మిస్తామని పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి వెంకటేశ్వర్లు తెలిపారు. ఎమ్మెల్యే ఏలూరి సూచన మేరకు గురువారం పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు.

టిప్పర్ లారీ బోల్తా.. తప్పిన ప్రమాదం

పర్చూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : టిప్పర్ లారీ బోల్తాపడిన ఘటన బుధవారం కారంచేడు - చీరాల రోడ్డులో చోటుచేసుకుంది. హైవే రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా తిప్పుతున్న టిప్పర్ లారీ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న మార్జిన్‌లో బోల్తా పడింది. అయితే ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతితో విషాదఛాయలు

బల్లికురవ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎస్ఎల్ గుడిపాడు గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి బండ్ల హనుమంతరావు (29) మంగళవారం నర్సరావుపేటలోని లాడ్జీలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బుధవారం స్వగ్రామం ఎస్ఎల్ గుడిపాడు గ్రామానికి మృతదేహాన్ని తీసుకు వచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. నాలుగు నెలల క్రితం వివాహమైన హనుమంతరావు భార్యను పుట్టింట్లో వదిలిపెట్టి ఆత్మహత్యకు పాల్పడడంతో ఎస్ఎల్ గుడిపాడులో విషాదఛాయలు అలముకున్నాయి. హనుమంతరావు భార్య కూడా భర్త మృతి చెందినట్లు తెలుసుకొని పుట్టింట్లో ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆమె పరిస్థితి నిలకడగా ఉందని బంధువులు తెలిపారు.

వేర్వేరు రైలు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

చీరాల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : వేర్వేరు చోట్ల జరిగిన రైలు ప్రమాదాల్లో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు మృతి చెందారు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బుధవారం రైల్వే స్టేషన్‌కు దక్షిణం వైపు గుర్తుతెలియని వ్యక్తి రైలు ఢీకొని మృతి చెందగా, ఉదయం 10 గంటల సమయంలో ఈపూరుపాలెం సమీపంలో మరో వ్యక్తి రైలు ఢీకొని మృతి చెందాడు. ఈ రెండు ఘటనలపై కేసు నమోదు చేసి, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు.

పోతినవారిపాలెంలో ట్రాక్టర్ చోరీ


పోతినవారిపాలెం (పర్చూరు), మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : కారంచేడు మండల పరిధిలోని పోతినవారిపాలెం గ్రామంలో ట్రాక్టర్ చోరీ అయిన ఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన పోతిన బాలకృష్ణ మంగళవారం రాత్రి తన పొలం వద్ద ఉంచిన ట్రాక్టర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించినట్లు సమాచారం. ఈవిషయమై కారంచేడు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నిరసన

అద్దంకిటౌన్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా బుధవారం అంబేడ్కర్ విగ్రహం వద్ద మాల మహానాడు, మాల ఉద్యోగుల కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. బంగ్లా రోడ్డు నుంచి పొట్టి శ్రీరాములు విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. నాయకులు కిరణ్‌కుమార్, కాంతారావు, రాజశేఖర్, శ్రీకృష్ణ, శ్రీనివాసరావు, ఆంజనేయులు, గురవయ్య, వంశీ కృష్ణ, నాగరాజు పాల్గొన్నారు.

గాయత్రి పరివార్ శక్తి పీఠానికి విరాళం

చీరాల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు జిల్లా నారా కోడూరులో నూతనంగా నిర్మిస్తున్న గాయత్రి పరివార్ శక్తిపీఠానికి స్థానిక వాకర్స్ అసోసియేషన్ సభ్యులు చెక్క చెన్న నారాయణ రూ.10,116 నగదు అందజేశారు. శక్తిపీఠం స్థానిక ప్రతినిధి దివ్వెల వెంకట రాధాకృష్ణమూర్తికి ఆ నగదును అందజేశారు. వాకర్స్ సభ్యులు రామకృష్ణ, గురుప్రసాద్, వీరాంజనేయులు, రమేష్, పూర్ణా, తిరుపతిరావు పాల్గొన్నారు.






తెగనమ్ముకుంటున్న రైతులు

కొనుగోలు కేంద్రాల్లో పుట్టి ధర రూ.19,500. బయట మార్కెట్‌లో దళారులకు అమ్ముకొంటున్న ధర రూ.16వేలు. తేడా 3500 రూపాయలు. ఈ లెక్కన 2.40 లక్షల పుట్ల ధాన్యాన్ని సుమారు రూ.84 కోట్ల నష్టానికి అమ్ముకోవడానికి రైతులు సిద్ధపడ్డారంటే వీరి కష్టం ఏమిటో అర్థం అవుతోంది. మిల్లుల వద్దకు వెళితే గోతాలు ఇవ్వరు. ఒకవేళ గోతాలు చేతికొచ్చినా లారీలు పంపరు. ఇదేమంటే జీపీఎస్ ఉన్న లారీలు తక్కువగా ఉన్నాయనే సమాధానం వస్తోంది. ఒకవేళ లారీ దొరికినా దళారులను కాదని కూలీలు రైతుల సరుకు లోడింగ్‌కు రారు. కానీ వీటితో సంబంధం లేకుండా దళారులు ఎంచక్కా రోజుకు వందల లోడ్ల ధాన్యం మిల్లులకు అమ్ముకొంటున్నారు.

ఉలవపాడు : విక్రయం కోసం ఒకేచోట ధాన్యం పోసిన చాగొల్లు రైతులు

బీపీ రా!





జిల్లాలో ప్రధానంగా మూడు రకాల వరి సాగవుతోంది. ఒకటి ఆర్‌ఎన్‌ఆర్. రెండు కేఎన్‌ఎం, మూడు బీపీటీ. వీటిలో ఆర్‌ఎన్‌ఆర్, కెఎన్‌ఎం రకాల ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వ సహాయ సహకారం అవసరం లేదు. ఇవి సన్న రకాలు. ఎక్స్‌పోర్టు క్వాలిటీ. కొనుగోలు కేంద్రాల్లో వీటికి పుట్టి రూ. 19,720గా నిర్ణయించినా బహిరంగ మార్కెట్‌లో వీటికి రూ.21వేల వరకు ధర లభిస్తోంది. దీంతో రైతులు ఈ ధాన్యాన్ని నేరుగా విక్రయించుకొంటున్నారు. కొంతమంది నిల్వ చేసి ఇంకా ధర పెరిగిన తరువాత విక్రయించుకోవడానికి సిద్ధమయ్యారు.

జిల్లాలో 70 శాతం వరకు ఈ రెండు రకాలు సాగు అయ్యాయి. ఇక మూడోది బీపీటీ 30 శాతం విస్తీర్ణంలో మాత్రమే సాగయ్యింది. వ్యవసాయ శాఖ అధికారుల లెక్కల ప్రకారం 93 వేల ఎకరాల్లో సాగు అయ్యింది. ఇప్పటికి 80వేల ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయి. ఎకరాకు మూడు పుట్లు చొప్పున 80వేల ఎకరాలకు 2.40 లక్షల పుట్ల ధాన్యం అమ్మకానికి సిద్ధంగా ఉంది. ఈ మాత్రం ధాన్యం కొనడం ప్రభుత్వానికి పెద్ద కష్టం కాదు. అధికారులు శ్రద్ధగా పనిచేస్తే అసాధ్యమూ కాదు. అయితే అధికారులు గిరిగీసుకున్నట్లు కూర్చోవడం, నోరు తెరిస్తే ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందేమోనని ప్రజాప్రతినిధులు నోళ్లకు తాళం వేసుకొని కూర్చోవడంతో ఈ కాసింత ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయలేకపోతున్నారు. 26 రోజుల్లో కేవలం 15వేల టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేశారంటే యంత్రాంగం వేగం ఏమిటో అర్థం అవుతోంది.

● గతానికి ఇప్పటికి తేడా ఏమిటో!?

గత వైసీపీ ప్రభుత్వంలోనూ ఇదే తరహా దోపిడీ జరిగింది. అయితే అప్పట్లో వైసీపీ నాయకులే దళారుల అవతారం ఎత్తారని విమర్శలు వెల్లువెత్తాయి. టీడీపీ నాయకులు రైతు పక్షాన నిలబడి ఆందోళనలు చేశారు. కానీ కూటమి ప్రభుత్వంలో కూడా రైతులకు అదే కష్టం ఎదురయ్యింది. ప్రభుత్వాలు మారాయి తప్ప ధాన్యం అమ్మకాల్లో తేడాలు మాత్రం మారలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విశేషమేంటే అప్పుడు రైతుల తరఫున ప్రతిపక్ష హోదాలో టీడీపీ నాయకులు నిలబడి పోరాడారు. కానీ ఇప్పుడు అధికారంలో ఉన్నా రైతుల పక్షాన నిలబడలేకపోతున్నారు. జిల్లాలో ఇద్దరు మంత్రులు, ఆరుగురు ఎమ్మెల్యేలు ఉన్నా నోరు మెదపడం లేదు. అసెంబ్లీకి పోయారు కాబట్టి పక్కనే ఉన్న పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చాంబర్‌కు వెళ్లి వచ్చారు తప్ప చేసిందేమీ లేదని, 2 లక్షల టన్నుల ధాన్యం కొనలేరు కానీ పండించిన ప్రతి గింజా కొంటామని మాటలు చెబుతున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో పల్లెలకో, పొలాలకో, కొనుగోలు కేంద్రాల వద్దకో వెళ్లి రైతుల కష్టం ఏమిటి!? దాని పరిష్కార మార్గం ఏమిటి!? అనే కోణంలో ఎమ్మెల్యేలు స్పందించడం లేదనే ఆరోపణలు వినవస్తున్నాయి. ప్రభుత్వ పనితీరుపట్ల రైతుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొని ఉందన్నది సత్యమని అధికార టీడీపీలోని ఓ ముఖ్యనాయకుడే వ్యాఖ్యానించడం గమనార్హం.

- నెల్లూరు (ఆంధ్రజ్యోతి)

● కష్టంలో వాటాలు

బీపీటీ పుట్టి రూ.16 వేలకు కొలుస్తున్నారు. దానిని దళారులు 17,500లకు మిల్లర్లకు అమ్ముతున్నారు. దీనివల్ల దళారీకి పుట్టి మీద 1500 లాభం. మిల్లరుకు 2,500 లాభం. ఎందుకంటే ఇదే ధాన్యాన్ని కొనుగోలు కేంద్రం ద్వారా కొనుగోలు చేస్తే టన్నుకు 19,500 చెల్లించాలి. అదే దళారి దగ్గరయితే 17,500లకే దొరుకుతుంది. కాబట్టి మిల్లర్లు దళారులకు సహకరించినంతగా రైతులకు సహకరించడం లేదనే వాదన రైతు వర్గాల్లో వినిపిస్తోంది. రైతులు విధిలేక దళారులకు అమ్ముకునే పరిస్థితిని తీసుకొస్తున్నారనే ఆవేదన మెజారిటీ రైతుల నుంచి వ్యక్తం అవుతోంది.

ఈ రకం సాగుచేసిన రైతుల బెంబేలు

చేతులెత్తేసిన ప్రభుత్వ యంత్రాంగం

కొనుగోలు కేంద్రాల్లో 15 వేల టన్నులే!

లేనిపోని కొర్రీలతో బహిరంగ మార్కెట్లోనే విక్రయం

పుట్టికి రూ.3,500 నష్టపోతున్న అన్నదాత

దళారులదే రాజ్యం.. మిల్లర్ల సహకారం

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో పుట్టి (850 కిలోలు) ధర రూ.19,500గా నిర్ణయించారు. అయినా రైతులు దళారులకే అమ్ముకుంటున్నారు. కారణం ఆ కొనుగోలు కేంద్రాల్లో పరిస్థితి సామాన్య రైతులకు ఏమాత్రం అనుకూలంగా లేదు. కొనుగోలు కేంద్రానికి, రైస్ మిల్లుకు కాళ్లరిగేలా తిరిగినా ప్రయోజనం లేకపోవడంతో పుట్టికి 3-4వేల రూపాయలు తగ్గినా దళారులకే అమ్ముకొంటున్నారు.

రైతుల వద్ద కొనుగోలు చేసిన దళారులు ఆ ధాన్యాన్ని పక్కరాష్ట్రాలకు అమ్ముకోవడం లేదు. తిరిగి మన రైస్ మిల్లులకే విక్రయిస్తున్నారు. అటు దళారులు, ఇటు మిల్లుల మధ్య కొనుగోలు కేంద్రాలు ఉత్సవ విగ్రహాలుగా మారాయనే విమర్శలు రైతుల నుంచి వినిపిస్తున్నాయి.

ఫిబ్రవరి 22వ తేదీన రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సంగంలో అట్టహాసంగా ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అయితే, కొనుగోళ్లలో మాత్రం ఇప్పటికీ ఆ అట్టహాసం కనిపించలేదు. దళారుల వికటాట్టహాసమే వినిపిస్తోంది. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి ఇప్పటికి 26 రోజులు గడుస్తున్నా కొన్నది మాత్రం 15వేల టన్నులే. వరి కోతలు ఆరంభమైన తొలి దశలో బీపీటీ రకం టన్ను రూ.18వేల నుంచి 19వేల వరకు ధర పలికింది. 40శాతం కోతలు పూర్తయ్యేసరికి రూ.15 వేల నుంచి 16వేలకు పడిపోయాయి.

వజ్రోత్సవ సంబరం

● డీకేడబ్ల్యూలో పూర్వ విద్యార్థినుల కోలాహలం

నెల్లూరు (విద్య) : డీకే ప్రభుత్వ మహిళా కళాశాల వజ్రోత్సవ సంబరాలు అంబరాన్నంటాయి. పూర్వవిద్యార్థినుల ఆప్యాయతలు-ఆలింగనాలతో మధురాతి మధురమైన సన్నివేశాలు కళ్లను కట్టిపడేశాయి. పూర్వవిద్యార్థినులు, ప్రస్తుత విద్యార్థినులతో కళాశాల ప్రాంగణం కోలాహలంగా మారింది. నగరంలోని డీకే ప్రభుత్వ మహిళా కళాశాల 60 వసంతాల పూర్తి చేసుకున్న సందర్భంగా రెండురోజులు నిర్వహిస్తున్న వజ్రోత్సవ వేడుకలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా తరలివచ్చిన పూర్వ విద్యార్థినులు అప్యాయంగా పలకరించుకుంటూ తీపి జ్ఞాపకాలతో మమేకమయ్యారు. ఎంత ఎదిగినా ఒదిగే ఉండాలని నిరూపిస్తూ చదువులు చెప్పిన గురువులను స్మరించుకున్నారు. నాటి పాత మధురాలను గుర్తు చేసుకుంటూ చిన్నపిల్లలుగా మారిపోయారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, వైద్యులు, న్యాయవాదులు, ప్రజాప్రతినిధులు ఇలా ఎంతోమంది తమ హోదాలను పక్కనపెట్టి అందరితో కలివిడిగా మనసువిప్పి మాట్లాడుకుంటూ తనివితీరా ఆనందాన్ని పంచుకున్నారు. ప్రతి ఒక్కరూతమ గురించి పరిచయం చేసుకుంటూ ప్రస్తుతం ఎవరు ఏ స్థాయిలో ఉన్నామో చెప్పుకుంటూ ఆనందాన్ని పొందారు. ఈ స్నేహం, బంధం ఇలానే కొనసాగాలంటూ ఒకేమాటగా తీర్మానం చేసుకు న్నారు. అనంతరం సావనీర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఇక రాత్రి జరిగిన క్యాంప్ ఫైర్‌లో వయసుతో నిమిత్తం లేకుండా నేటితరం విద్యార్థినులతో కలిసి అందరూ నృత్యం చేశారు.



నృత్యం చేస్తున్న ప్రస్తుత, పూర్వ విద్యార్థినులు

- వివరాలు 8లో..

దళారులను నమ్మి మోసపోవద్దు

పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

నెల్లూరు (హరనాథపురం) మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం అమ్మి మద్దతు ధర పొందాలని, దళారులను నమ్మి మోసపోవద్దని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ రైతులకు సూచించారు. బుధవారం శాసనసభా ప్రాంగణంలోని తన చాంబర్‌లో జిల్లా ఇన్చార్జి మంత్రి ఫరూక్ అబ్దుల్లా, జిల్లాకు చెందిన మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, నారాయణ, ఎమ్మెల్యేలు, కలెక్టర్ ఆనంద్, ఇతర అధికారులతో మంత్రి నాదెండ్ల సమీక్షిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే జిల్లాలో 46శాతం వరి కోతలు పూర్తయ్యాయన్నారు. పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే అమ్మి 24గంటల్లోనే డబ్బు పొందవచ్చన్నారు. 5 లక్షల గన్నీ బ్యాగ్‌లను అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజాప్రతినిధులు పర్యటించి ఏమైనా సమస్యలు ఉంటే పరిష్కరించుకునేందుకు చొరవ చూపాలని ఆదేశించారు. అలాగే రవాణా విషయంలో ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ప్రతి మిల్లు వద్ద రెవెన్యూ సిబ్బందిని నియమించాలని ఆదేశించారు. సంగం, కోవూరు ప్రాంతాల్లో ధాన్యం కొనుగోలు ముమ్మరంగా జరుగుతోందని, రైస్ మిల్లర్ అసోసియేషన్ నాయకులతో మాట్లాడి దళారుల ప్రమేయం తగ్గించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, కృష్ణారెడ్డి, కాకర్ల సురేష్, పౌరసరఫరాల శాఖ అధికారులు పాల్గొన్నారు.



మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.25	సహరి : 4.57
(గురువారం సాయంత్రం)	(శుక్రవారం ఉదయం)

వైద్య రంగంలో ఏఐ వినియోగంపై పరిశోధన చేస్తా!

● 'గేట్' టాప్ ర్యాంకర్ నిఖిల్ చౌదరి

కందుకూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : వైద్య రంగంలో ఆర్టిఫిసియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ప్రభావంపై పరిశోధనలు చేయడమే తన లక్ష్యమని గేట్-2025లో ఏఐ విభాగంలో ఆల్ ఇండియా మొదటి ర్యాంక్ సాధించిన సాదినేని నిఖిల్ చౌదరి స్పష్టం చేశారు. బుధవారం వెల్లడైన ఫలితాల అనంతరం 'ఆంధ్రజ్యోతి'తో నిఖిల్ చౌదరి మాట్లాడుతూ తన తండ్రి సాదినేని శ్రీనివాసులు కందుకూరులోని ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజిలో సీఎస్ఈ విభాగంలో హెచ్‌వోడీగా విధులు నిర్వహిస్తుండటంతో ఆయన ఆకాంక్ష మేరకు ఎంబీబీఎస్ చదివినట్లు తెలిపారు. అయితే తన ఆసక్తికి అనుగుణంగా మద్రాస్ ఐఐటీ దూర విద్య ద్వారా ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌లో గ్రాడియేషన్ పూర్తి చేసి సాఫ్ట్‌వేర్ రంగంలో స్థిరపడినట్లు తెలిపారు. భవిష్యత్తులో వైద్య రంగంలో ఏఐ క్రియాశీల భూమిక పోషించనున్నందున ఆదిశగా పరిశోధనలు చేయడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. గేట్‌లో మొదటి ర్యాంక్ సాధిం చడం తనకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని, భవిష్యత్తులో తన పరిశోధనలకు ఈ ర్యాంక్ మరింత ప్రోత్సాహకంగా నిలుస్తుందని అన్నారు.



తండ్రి శ్రీనివాసులుతో నిఖిల్ చౌదరి

● నిఖిల్ చౌదరి ర్యాంకు సాధించడం ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల మేనేజ్‌మెంట్, అధ్యాపక బృందానికి గర్వకారణంగా ఉందని కరస్పాండెంట్ కంచర్ల రామయ్య అన్నారు. నిఖిల్ విజయం విద్యార్థులకు ప్రేరణగా నిలుస్తుందని, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది నిఖిల్ తండ్రి ప్రొఫెసర్ శ్రీనివాసులకు శుభాకాంక్షలు తెలిపారు.

● సాదినేని నిఖిల్ చౌదరికి కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అభినందనలు తెలిపారు భవిష్యత్తులో నిఖిల్ మరెన్నో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

నేస్తమా ఏమయ్యావ్!?

నేడు ప్రపంచ పిచ్చుకల దినోత్సవం

కిచ్.. కిచ్... అని అరుస్తూ ఇంటిల్లిపాదిని ఆకట్టుకుంటాయి. ఇంటా.. బయటా అవి చేసే సందడి అంతా ఇంతా కాదు.. ఇక పైరును తినేసే పురుగులను ఆరగిస్తూ రైతు నేస్తాలుగా పిలవబడే పిచ్చుకలు కనుమరుగవుతున్నాయి. ఒకప్పుడు చెరువులు, బావుల ఒడ్డున చెట్లన్నీ ఆ గిజిగాడి గూళ్లతో ఎంతో అందంగా కనిపించేవి. పర్యావరణానికి మేలు చేసే ఈ పక్షిజాతి చూద్దామన్నా కనిపించడం లేదు. భవంతులు, అపార్ట్‌మెంట్ కల్చర్ పెరగడంతో వాటి గూళ్లకు స్థానం లేకుండా పోయింది. దీనికితోడు వాతావరణంలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, రేడియేషన్, శబ్ద కాలుష్యం మరో కారణమవు తోంది. ఒకప్పుడు మన జీవన విధానంలో భాగమైన ఈ పక్షిజాతిని సంరక్షించుకోకుంటే పూర్తిగా అంతరించే ప్రమాదం ఉంది. గురువారం ప్రపంచ పిచ్చుకల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..

జాడలేని పిచ్చుకలు

కాలగర్భంలో కలిసిపోతున్న చిరుప్రాణులు

రేడియేషన్, శబ్ద కాలుష్యమే కారణం

మేల్కొనకుంటే తీవ్ర పరిణామాలు



ఉదయగిరి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : ఇళ్ల ముందు, చెట్ల కొమ్మలపై, గుడిసెల్లో గూళ్లు కట్టుకుని కనిపించే పిచ్చుకలు నేడు కనుమరుగయ్యాయి. పెరుగుతున్న రేడియే షన్, కాలుష్యం, ఆహార కొరత, మానవుల అవగాహన రాహిత్యంతో నానాటికీ పిచ్చుక జాతి అంతరించి పోతున్నది. మారుతున్న కాలానికి అనుగుణంగా మాన వుడి జీవన విధానంలో చోటు చేసుకున్న మార్పులు పిచ్చుకలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానం పిచ్చుకలకు ప్రాణసంకటంగా మారింది. మొబైల్ టవర్ల సంఖ్య విపరీతంగా పెరగడంతో వాటి నుంచి వెలువడే ఎలక్ట్రోమాగ్నెటిక్ రేడియే షన్ పిచ్చుకల దిశానిర్దేశక శక్తిని దెబ్బతీస్తోంది. ఫలితంగా అవి సరైన ఆహార వనరులను గుర్తించలేక జీవనయాత్రలో ఇబ్బం దులు ఎదుర్కొంటున్నాయి. దీనికితోడు వ్యవసాయ రంగంలో పాత వ్యవసాయ విధానాలకు స్వస్తి పలికి ఆధునాతన పద్ధతులు పాటిస్తూ పంటల్లో రసాయనిక మందుల వినియోగం అధికమైంది. ఈ మందులు పిచ్చుకలకు ఆహారంగా మారే పురుగులను నాశనం చేయడమే కాదు.. వాటి శరీరాల్లో చేరి నెమ్మదిగా ప్రాణాలు తీసే మారణాయుధాలుగా మారుతున్నాయి. అలాగే కాంక్రీట్ భవనాల సంఖ్య అధికమవడంతోపాటు వ్యవసాయ బావులు కాలగర్భంలో కలిసిపోతున్నాయి. పిచ్చుకలకు ఆవాస ప్రాంతాలైన ఇంటి సూరు, పెరటలు, బావులు వంటి సహజమైన ప్రదేశాలు దొరకకపోవడం, అవి జీవించేందుకు తగిన వాతావరణం లేకపోవడంతో వాటికి ముప్పు ఏర్పడుతోంది. పర్యావరణంలో మార్పులు, ఉష్ణోగ్రతలు పెరుగుదల, గాలి కాలుష్యం, వర్షపాతం మార్పులు ఈ చిన్నపాటి పక్షుల మనుగడ ప్రమాదకరంగా మారింది.



పిచ్చుకలకు ప్రాణసంకటంగా మారిన ఇళ్ల మధ్య సెల్ టవర్స్

● 2010 నుంచి...

దేశంలోని నాసిక్‌కు చెందిన మహ్మద్ దిల్‌వార్ అనే ప్రకృతి ప్రేమికుడు మానవ జీవనంలో పక్షులు పాత్రను తెలిపేందుకు 2008లో నేచర్ ఫరెవర్ సొసైటీని నెలకొల్పారు. ఈ సొసైటీ సౌరూప్య లక్ష్యాలను కలిగిన అనేక ప్రపంచ సంస్థలతో కలసి మార్చి 20న ప్రపంచ పిచ్చుకల దినోత్సవంగా ప్రకటించింది. 2010లో మొదటిసారి నిర్వహించిన ప్రపంచ పిచ్చుకల దినోత్సవంలో పక్షుల సంరక్షణ, వాటి ఆవశ్యకత, ప్రకృతి ప్రభావం, తదితర అంశాలపై ప్రజలను చైతన్యం చేసేందుకు నడుం బిగించింది. ఇప్పటికి భారత్, యూరప్, ఫ్రాన్స్, ఆస్ట్రేలియాలతోపాటు 50 దేశాలు ఈ దినోత్సవాన్ని జరుపుకుంటు న్నాయి. దీంతో నేడు పక్షి ప్రేమికులు, పర్యావరణవేత్తలు సేవ్ ది స్పారో అంటూ నినదిస్తున్నారు.

సంరక్షణ అందరి బాధ్యత

రోజు రోజుకూ వేడుక్కుతున్న భూగోళం మానవజాతి మనుగడనే ప్రశ్నార్థకం చేస్తుం టే, ఇక పిచ్చుకల సంగతి చెప్పనక్కర్లేదు. వాతావరణంలో హాని చేస్తున్న శబ్దకాలుష్యాలను తగ్గించడం మన చేతిలో పనే. అయినదానికి, కానిదానికి రేడియేషన్ పెంచే పరిక రాల వాడకం సాధ్యమైనంత వరకు తగ్గించుకోవాలి. ఇంటి లోగిళ్లలో వాలే పిచ్చుకలను దూరం చేసుకోవడం స్వయం కృతాపరాధం. పాతతరం వారు ఇంట్లో పిచ్చుకలు గూడు కట్టుకుంటే శుభం జరుగుతుందని భావించి వాటిని మురిపంగా పెంచేవారు. వాటి ఆహారంగా ధాన్యాన్ని వేసేవారు. పంట పొల్లో నుంచి వరి కంకులను తీసుకు వచ్చి ఇళ్ల ముందు వేలాడి కట్టేవారు. ఇప్పుడు వాటిని చూడడమంటే ప్రదర్శనశాలలకు, సినిమానో, టీవీల్లో చూడాల్సిందే. మళ్లీ పాత రోజులు రావాలంటే ఎవరికి వారు తమ వంతుగా వాటిని కాపాడేందుకు కృషి చేయాలి.

ఇలా రక్షించుకుందాం!

- కిటికీలు, వెంటిలేటర్లు, డాబాలు, చెట్లు వరండాల్లో కృత్రిమ గూళ్లను ఉంచి వాటికి ఆశ్రయం కల్పిద్దాం.
- ఇంటి బయటా, బాల్కనీలో, మేడపైనా గుప్పెడు జొన్నలు, సజ్జలు, బియ్యం, గోధుమలు వంటి ధాన్యాలను వెదజల్లి వాటి ఆకలి తీరుద్దాం.
- పాఠశాల, కార్యాలయాలు, ఇళ్లు, పార్కులు, సినిమా థియేటర్లలో చిన్న నీటి తొట్టెల్లో నీళ్లు పోసి ఉంచండి. ఈ నీటి తొట్టెలను రసాయనాలు కలిపిన సబ్బులు, సర్ఫ్‌లతో శుభ్రం చేయకూడదు.
- ఇంటి ఆవరణలోనూ, ప్రభుత్వ ఆఫీసుల్లోనూ, ఇతర ప్రదేశాల్లోనూ చెట్లను పెంచడం వల్ల పిచ్చుకలను రక్షించుకోవచ్చు.
- పంటల సాగులో పురుగుమందుల వినియోగాన్ని తగ్గించి రైతులు సహజసిద్ధమైన ఎరువుల వైపు మొగ్గు చూపాలి. సేంద్రీయ వ్యవసాయాన్ని పెంచడంవల్ల పిచ్చుకలకు ఆహార వనరులు పెంచవచ్చు.
- పిచ్చుకల్లో 35 రకాల జాతులు ఉన్నాయి. పిచ్చుకలు ఈత కూడా కొడతాయి. శత్రువుల నుంచి రక్షించుకోవడానికి అవి నీళ్లలో ఈదుతాయి.
- పిచ్చుక గంటకు దాదాపు 40 నుంచి 45 కిలోమీటర్లు వేగంతో ప్రయాణిస్తాయి. వీటి జీవిత కాలం 4 నుంచి 5 సంవత్సరాలు

నీరు, మేత సౌకర్యం కల్పించాలి



పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానం వల్ల పిచ్చుకల సంఖ్య తగ్గిపోతోంది. అరకొరగా ఉన్నవాటినైనా రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉంది. ప్రస్తుతం వాటికి నీరు, ఆహారం దొరకడం కష్టమైంది. ప్రతిఒక్కరు తమ ఇంటి మిద్దెపైన, ఇంటి పెరట్లో నీటిపాత్రలు, మేత సౌకర్యం కల్పిస్తే కొంతమేరకైనా పిచ్చుకలను రక్షించుకోవచ్చు.

- బీఎస్ కుమారరాజా, అటవీ శాఖాధికారి, ఉదయగిరి

పక్షి జాతిని కాపాడుకోవాలి



ప్రకృతిలో సమతుల్యతను కాపాడే పక్షులను ప్రతిఒక్కరు రక్షించుకోవాల్సిన బాధ్యత ఉంది. 45 ఏళ్లుగా నేను పావురాలను పెంచుతున్నా. ఒకప్పుడు పిచ్చుకల కిలకిలరావాలతో గ్రామాల్లో ప్రకృతి శోభ సంతరించుకునేది. ఇళ్లు, తోటల్లో ఆ కిలకిలరావాలను మళ్లీ వినాలంటే వాటిని రక్షించుకోవాల్సిన అవసరం ఉంది.

- వెంకట్రావు, పక్షుల ప్రేమికుడు, ఉదయగిరి

సేంద్రియ ఎరువులు వాడాలి



పిచ్చుకలు రైతు సహాయకులని చెప్పుకోవాలి. నా చిన్నతనంలో వందలాది పిచ్చుకలు సాగు చేసిన పంటలపై ఆహారపు వేటలో ఉండేవి. మారుతున్న కాలానుగుణంగా వ్యవసాయంలో రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడకం అధికం కావడంతో ప్రస్తుతం తోటల్లో పిచ్చుకలను చూద్దామన్నా కనిపించడంలేదు. పంటల సాగులో సేంద్రీయ ఎరువుల వాడి ఇలాంటి చిన్నజీవులను కాపాడాకోవాలి.

- కమలకూరి కృష్ణారెడ్డి, రైతు, గంగిరెడ్డిపల్లి

కేజీబీవీలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కావలిరూరల్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణ పరిధిలోని ముసునూరులో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ)లో ఖాళీ సీట్లకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సంధ్యారాణి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2025-26 విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో 40, ఇంటర్ మొదటి సంవత్సరంలో 40, ద్వితీయ సంవత్సరంలో మిగిలి ఉన్న 3 సీట్లకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాలకు 7013502569ను సంప్రదించాలని తెలిపారు.

న్యూస్ బాక్స్

'ఎమ్మెల్యే కాకర్లపై ఆరోపణలు మానుకోండి'

జలదంకి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అమెరికాలో స్థిరపడి తన జన్మభూమికి సేవ చేయాలనే కాంక్షతో రాజకీయాల్లోకి వచ్చి ఎమ్మెల్యే అయ్యాడని, అలాంటి వ్యక్తికి అవినీతి మరకలు అంటించడం మానుకోవాలని వైసీపీ నాయకులకు మండలంలోని ఎన్డీఏ కూటమి నాయకులు హితవు పలికారు. జలదంకిలో బుధవారం జరిగిన విలేకరుల సమావే శంలో టీడీపీ మండల అధ్యక్షుడు పీ.మధు రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు ముడి కిషో ర్‌రెడ్డి, జనసేన నాయకుడు నిమ్మలపల్లి రామ్‌చైతన్య మాట్లాడుతూ ఎమ్మెల్యే కాకర్ల నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధిని చూ సి ఓర్వలేక ఆరోపణలు చేయడం మంచిది కాదన్నారు. ఈ సమావేశంలో కూటమి నాయకులు గంటా అశోక్, పచ్చా పెంచల య్యనాయుడు, కుట్టుబోయిన మాధవరావు, నక్కా మాధవరావు పాల్గొన్నారు.

పాఠశాలలో మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

బిట్రగుంట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కొండబిట్రగుంట ప్రాథమిక పాఠశాల్లో హెచ్‌ఎం మద్దులూరి ప్రసా ద్‌రావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని బుధవారం ఎంపీడీవో సుబ్ర హ్మణ్యం ప్రారంభించారు. ఈ చలివేంద్రం ఏర్పాటుకు ముందుకువచ్చిన దాత సంజ య్ రవికొండను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో జయమ్మ, ఏఎంసీ వైస్‌చైర్మన్ కౌసల్య, ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యచారి, విజిత పాల్గొన్నారు.

పేదలంటే పాలకులకు చిన్నచూపు : సీపీఎం

కావలిటౌన్, మార్చి 19(ఆంధ్రజ్యోతి) : పేదలంటే పాలకులకెందుకంత చిన్నచూపని సీపీఎం నేతలు ప్రశ్నించారు. బుధవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో పట్టణ కార్యదర్శి పెంచలయ్య మాట్లాడుతూ పది రోజులుగా నిర్వహించిన ప్రజాచైతన్య యాత్రలో భాగంగా పట్టణంలోని 40 వార్డులు తిరిగి ప్రజాసమస్యలు తెలుసుకున్నామన్నారు. ప్రధానంగా పేదలు నివశించే ఇందిరమ్మ కాలనీ, గిరిజన కాలనీల్లో ఇప్పటికీ కనీస మౌలిక వసతులు లేవన్నారు. గుక్కెడు నీటికి, సీసీ రోడ్లు, డ్రైన్లు, వీధి లైట్లు లేక ఇబ్బందిపడుతున్నార న్నారు. ఈ సమావేశంలో కృష్ణమోహన్, మధుసూదన్‌రావు, కృష్ణయ్య, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎస్ఐ

దుత్తలూరు (ఉదయగిరి), మార్చి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్‌స్టేషన్‌లో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం ఎస్ఐ ఆదిలక్ష్మీ ఉగాది క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సేవాసమితి అధ్యక్షుడు ప్రసాద్, సభ్యులు సుధాకర్, వెంకటేశ్వర రెడ్డి, ప్రేమ్‌కుమార్, సంతోష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ముళ్ల చెట్లకు నిప్పు

సీతారామపురం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక తోటవీధిలో గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం ముళ్లచెట్లకు నిప్పు పెట్టడంతో మంటలు ఎగిసి పడ్డాయి. గ్రామమంతా పొగతో నిండి నివాసాలకు మంటలు ఎక్కడ వ్యాపిస్తాయోనని ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఉదయగిరి అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించడంతో వారు వచ్చి మంటలను అదుపు చేశారు.

ప్రమాదంలో గాయపడ్డ వృద్ధుడి మృతి

ఉదయగిరి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాసాయిపేట బీసీ కాలనీ సమీపంలో ఆటోలో నుంచి జారిపడి కోమాలోకి వెళ్లిన వేమూరి కొండయ్య (75) బుధవారం మృతిచెందినట్లు ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి తెలిపారు. కొండయ్య మంగళవారం ఉదయగిరి నుంచి ఆటోలో స్వగ్రామమైన తిరుమలా పురం ఎస్టీ కాలనీకి వెళుతుండగా ప్రమాదవశాత్తు ఆటోలో నుంచి జారిపడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం నెల్లూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు పరీక్షలు నిర్వహించి కోమాలోకి వెళ్లాడని, బతకడం కష్టమని తెలపడంతో కుటుంబ సభ్యులు వెంటిలేటర్‌పై ఇంటికి తీసుకొచ్చారు. పరిస్థితి విషమించడంతో బుధవారం మృతి చెందాడన్నారు. దీంతో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఆయన తెలిపారు.

ఊళ్లకు వెళుతున్నామని ప్రచారం చేసుకోవద్దు : డీఎస్పీ

కావలి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): వేసవి కాలంలో ఊర్లకు వెళ్లే వారు గుట్టుచప్పుడు కాకుండా ఉంచుకోవాలని, ముందుగా ప్రచారం చేసుకుంటే దొంగలకు సమాచారం ఇచ్చినట్లు అవుతోందని కావలి డీఎస్పీ పీ.శ్రీధర్ తెలిపారు. డీఎస్పీ కార్యాలయంలో బుధవారం సాయంత్రం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలు ఊర్లకు వెళ్లే విషయం బయటకు తెలపకుండా పోలీస్‌లకు సమాచారం ఇస్తే మీ ప్రాంతంలో పోలీస్ నిఘా పెంచుతామన్నారు. ఊర్లకు వెళ్లేటప్పుడు విలువైన వస్తువులు తమ ఇళ్లలో ఉంచకుండా లాకర్లలో, బంధువుల ఇళ్లలో పెట్టి వెళ్లాలన్నారు. ఇంటి



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీధర్

బయట అందరికీ కనపడేట్లు తాళాలు వేయకుండా లోపల వేసుకోవాలన్నారు. అవకాశం ఉన్నంత వరకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే దొంగలు బెడద తగ్గటమే కాక చోరీలు జరిగితే వారిని పట్టుకోవటం సులభతరంగా ఉంటుందని చెప్పారు. ఇళ్లకు, బయట పార్కింగ్ చేసే ద్విచక్ర వాహనాలకు అలారం తాళాలు వేస్తే ఎవరైనా వాటిని టచ్ చేసినప్పుడు అలారం మోగి చుట్టుపక్కల వారు బయటకు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. మీ ప్రాంతంలో ఎవరైనా కొంత వ్యక్తులు తిరుగుతుంటే పోలీస్‌లకు సమాచారం ఇవ్వాలని ఆయన పేర్కొన్నారు.

ప్రైవేట్ వ్యాపారుల వైపు రైతుల చూపు!

● ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలపై చూపని ఆసక్తి

ఉలవపాడు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిబంధనలు పాటించి ధాన్యం విక్రయిస్తే నష్టం తప్పదని భావిస్తున్న రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని ప్రైవేట్ వ్యాపారులకు విక్రయించేందుకే మొగ్గు చూపుతున్నారు. మండలంలోని ఉలవపాడు, చాగొల్లు గ్రామాల్లో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించింది. ఈ-క్రాప్ నమోదై 17 శాతం తేమ ఉండి టోకెన్స్ ప్రకారం విక్రయాలు చేపడతారని వ్యవసాయ, సొసైటీ అధికారులు రైతులకు సూచించారు. బస్తాల కాటా, లోడింగ్ కూలీలు ప్రభుత్వం ప్రకటించిన ధర రూ.17 కంటే అదనపు ఖర్చుల భారం రైతలపై పడటం, ధాన్యం ఆరబోసేందుకు పట్టల బాడుగ, ప్రభుత్వం గిట్టుబాటు ధర ప్రకారం రైతులకు చెల్లింపులు ఆలస్యం వంటి వాటిని బేరీజు చేసుకొని రైతులు ప్రైవేటు వ్యక్తులకే విక్రయించగానికి మొగ్గు చూపుతున్నారు. చాగొల్లు గ్రామంలో 90 శాతం ధాన్యం విక్రయాలు జరిగిపోయాయి. ప్రైవేటు వ్యాపారులు 75 కిలోల ధాన్యం బస్తాకు మరుసటి రోజే రూ.1600 లెక్కన నగదు చెల్లిస్తున్నారని రైతులు చెప్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధాన్యం విక్రయించలేక, నగదు కోసం ఎదురు చూడలేక ప్రైవేటు వ్యాపారులకు రూ.160 తేడాతో విక్రయిస్తున్నామని రైతులు అంటున్నారు.

కుల ధ్రువీకరణపై విచారణ వాయిదా

బిట్రగుంట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కప్పరాళ్లతిప్ప బాడన్‌పేట చర్చి ఆవరణలో కుల ధ్రువీకరణ విషయంపై తహసీల్దారు సురేష్‌బాబు బుధవారం చేపట్టిన బహిరంగ విచారణ వాయిదా పడింది. ఆరోపణలు ఎదుర్కొంటున్న పీట్ల ధనమ్మకు నోటీసు జారీ చేసినా విచారణకు రాలేదని, ఫిర్యాదు చేసిన గుర్రంకొండ సుమతిని, స్థానికులను విచారించి వివరాలు సేకరించినట్లు తహసీల్దారు తెలిపారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వారి నిర్ణయం మేరకు మళ్లీ విచారణ తేదీని తెలియచేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ రమాకుమారి, వీఆర్వో హరిబాబు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల అందజేత



విద్యార్థులతో మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్

కావలి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్, కాలుష్య నివారణ చర్యలపై నిర్వహించిన ప్రతిభా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు కావలి మున్సిపల్ కమిషనర్ జీ.శ్రావణ్‌కుమార్ బుధవారం బహుమతులను అందచేశారు. స్వచ్ఛాంధ్ర -స్వర్ణాంధ్రలో భాగంగా ప్రతి నెల మూడవ శనివారం పారిశుధ్యం మెరుగుకు చేపడుతున్న ప్రత్యేక కార్యక్రమాలలో భాగంగా ఈనెల 15వ తేదీన కావలి జిల్లా పరిషత్ బాలబాలికల పాఠశాల విద్యార్థులకు ప్లాస్టిక్, కాలుష్య నివారణపై ప్రతిభా పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు.

'పది' పరీక్ష కేంద్రాల తనిఖీ

లింగసముద్రం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): లింగసముద్రం, పెదపవని జడ్పీ హైస్కూళ్లలోని పదవ తరగతి పరీక్ష కేంద్రాలను స్క్వాడ్ అధికారులైన కందుకూరు డిప్యూటీ డీఈవో పీ.నరసింహారావు, ఎంఈఓ-1 కె.రవికుమార్‌లు బుధవారం తనిఖీ చేశారు.

ఇంటూరి అవినాష్ జన్మదిన వేడుకలు

కందుకూరు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తనయుడు అవినాష్ పుట్టినరోజు వేడుకలు టీడీపీ పట్టణ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. టెలికం బోర్డు మెంబర్ గుర్రం మాల్యాద్రి, రాజ్యలక్ష్మి దంపతులు పేదలకు అన్నాక్యాంటీన్‌లో, స్వర్ణ స్వయంకృషి మానసిక వికలాంగుల పాఠశాలలో భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముచ్చు శ్రీనివాసరావు, చిలకపాటి మధుబాబు, బెజవాడ ప్రసాద్, రవిచంద్ర, వెంకటేశ్వర్లు మున్నా పాల్గొన్నారు.

● ఉలవపాడు: ఇంటూరి అవినాష్ జన్మదిన వేడుకలను టీడీపీ మండల అధ్యక్షుడు రాచగల్లు సుబ్బారావు ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. నాయకులు ఏ.రమేష్, ఎం.మహేంద్ర, ఏ.మాధవ పాల్గొన్నారు.

గర్భిణులకు ఆరోగ్యం, లింగ వివక్షపై అవగాహన

కావలిటౌన్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ముసునూరు మర్రిచెట్టు గిరిజన సంఘం కాలనీలో బుధవారం డాక్టర్ రామ్ సెంటర్ ఆధ్వర్యంలో మహిళలు, గర్భిణులకు ఆరోగ్యం, లింగ వివక్షపై అవగాహన కల్పించారు. గర్భిణులకు ఐరన్‌ఫోలిక్ సిరప్‌లు అందజేశారు. కార్యక్రమంలో రామ్ సెంటర్ చైర్మన్ దొడ్ల మనోహర్‌రెడ్డి, కూనం తాతిరెడ్డి, సామాజిక కార్యకర్త ఎం.మాలకొండారెడ్డి పాల్గొన్నారు.

పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేయాలి

ఉలవపాడు(ఆంధ్రజ్యోతి): పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేసి ఐఆర్ ప్రకటించాలని ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం మండల నాయకులు బుధవారం తహసీల్దారు శ్రీనివాసులకు వినతిపత్రం అందజేశారు.

శిథిలావస్థలో పక్కాగృహాలు

● నూతన గృహాలు మంజూరుకాక చల్లా యానాదుల అవస్థలు

సంగం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): శిథిలమైన పక్కాగృహాల్లో వర్షం వస్తే ఎపుడు కూలుతాయోనని బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నామంటూ సంగం మండలంలోని తరుణవాయి గ్రామ గిరిజన కాలనీలోని చల్లాయానాదులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని తరుణవాయి పంచాయతీ వాటర్ ట్యాంకు వద్ద ఉన్న గిరిజన కాలనీలో సుమారు 50 కుటుంబాల చల్లాయానాదులు నివసిస్తున్నారు. 30 ఏళ్ల కిందట ఈ కాలనీలోని కొందరు చల్లాయానాదులకు 20 పక్కాగృహాలు నిర్మించారు. అప్పట్లో ఈ కాలనీఇళ్ల గోడలకు సిమెంట్ పూతపని కూడా చేయలేదు. వీరికి సొంతంగా కాలనీ ఇళ్లు నిర్మించుకునే స్థోమత లేకపోవడంతో ఎవరో కాంట్రాక్టర్ పక్కాగృహాలు కట్టించి ఇచ్చారు. కాగా, పక్కాగృహాల నిర్మాణం నాసిరకంగా చేపట్టడంతో పాటు నిర్మించి ముప్పై ఏళ్ల కావడంతో శిథిలమై శ్లాబు పెచ్చులూడి కమ్ములు బయటపడ్డాయి. వర్షంవస్తే



గిరిజన కాలనీలో శిథిలమైన పక్కాగృహాలు

కూలిపోయో పరిస్థితి నెలకొంది. గత్యంతరంలేని పరిస్థితిలో శిథిల గృహాలలోనే కాలం వెళ్లదీస్తూ భయంభయంగా కాలం గడుపుతున్నారు.

నూతన గృహాల కోసం ఎదురుచూపు

శిథిలమైన పక్కాగృహాల గిరిజనులు నూతన పక్కాగృహాల కోసం ఎదురుచూస్తున్నారు. నూతన పక్కాగృహాలు మంజూరు చేయాలని అటు అధికారులను ఇటు పాలకులను వేడుకుంటున్నా కనికరించిన నాథుడే కరువయ్యారు. దీంతో వారు నూతన పక్కాగృహాలపై ఆశలు వదులుకుని శిథిల గృహాలలోనే కాలం వెళ్లదీస్తూ వర్షాలు వచ్చినప్పుడు పాఠశాల వరండాలలో తలదాచుకుంటున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పీఎంఏవై కింద నూతన పక్కాగృహాలు మంజూరు చేయాలని చల్లాయానాదులు కోరుతున్నారు.

ప్రమాదకరంగా వాల్వు గుంత

● ప్రజలు, వాహనదారుల అవస్థలు

ఉదయగిరి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లే ప్రధాన రహదారిలో మూతలేకుండా వాల్వు గుంత ఉండడంతో వాహనదారులు, ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారు. పంచాయతీ సిబ్బంది వాల్వు గుంతపై ఉన్న మూత తీసి పక్కన బెట్టి గత కొన్నిరోజులుగా అలాగే వదిలేశారు. వైద్యశాలకు వచ్చే వాహనాలు, రోగులు గుంతను గమనించక ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వాల్వు గుంతపై మూత ఏర్పాటుచేసి ప్రమాదాలను నివారించాలని పలువురు కోరుతున్నారు.



మూత లేకుండా రహదారి మధ్యలో ప్రమాదకరంగా ఉన్న వాల్వు గుంత

అక్రమార్కుల మధ్య విభేదాలతో

రేషన్ బియ్యం అక్రమ రవాణా గుట్టురట్టు

కలువాయి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): అక్రమార్కుల మధ్య నెలకొన్న విభేదాలు కారణంగా రేషన్ బియ్యం అక్రమ రవాణా వ్యవహారం గుట్టు బట్టబయలైంది. అక్రమార్కులు ఒకొక్కరు ఒకొక్క మండలాన్ని ఎంచుకుని రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నారు. ఎవరు ఎంచుకున్న మండలంలో వారి వ్యక్తులు మాత్రమే బియ్యం కొనుగోలు చేయాలి. అలా కాకుండా ఎవరైనా పక్కవారు వచ్చి కొంటే మాత్రం ఒప్పుకోరు. మంగళవారం రాత్రి కూడా అలాగే బయట మండలానికి సంబంధించిన వ్యక్తి వచ్చి ఇక్కడ బియ్యం ఆటోలో తీసుకుపోతున్నారని స్థానిక దళారులు పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. దీంతో పోలీసులు ఆ ఆటోను వెంబడించి పట్టుకుని కేసు నమోదు చేశారు. కలువాయి మండలంలో సుమారు 14వేల రేషన్‌కార్డులు ఉన్నాయి. వీరందరికీ ప్రతి నెలా 200 టన్నులు (4000 బస్తాలు) బియ్యం పంపిణీ జరుగుతోంది. ఇందులో పెద్దఎత్తున సుమారు 700 బస్తాలు



పోలీసులకు పట్టుబడిన రేషన్ బియ్యం ఆటో

కార్డుదారుల నుంచి కొనుగోలు చేసి అక్రమంగా తరలించి జేబులు నింపుకుంటున్నట్లు సమాచారం. పౌరసరఫరాల శాఖ అధికారులు ప్రతి నెలా నిర్వహించాల్సిన సాధారణ తనిఖీలు లేకపోవడంతో ఈ అక్రమ వ్యాపారం అడ్డూ ఆపూ లేకుండా జరుగుతోందని, తనిఖీలు నిర్వహించి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.

లీకులతో

నక్కలగండి నీరు వృథా

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నక్కలగండి రిజర్వాయర్‌లో సాగునీరు అధికారుల నిర్లక్ష్యం కారణంగా నెలల తరబడి తూము నుంచి లీకుల ద్వారా వృథా అవుతోందని ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ రిజర్వాయర్‌లోని రొయ్యలు పట్టుకునేందుకు అనుకూలంగా క్రమేణా నీటిని తగ్గుముఖం చేసేందుకు వ్యాపారులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు సైతం విన్పిస్తున్నాయి. అదేజరిగితే భవిష్యత్తులో రైతులు సాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవాల్సిన పరిస్థితి తలెత్తుతోంది. ఇదేమిటని ప్రశ్నిస్తే కుంటి సాకులు చెప్పి తప్పించుకుంటున్నారని మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టి నీటి వృథాను అరికట్టాలని కోరుతున్నారు.

అర్హులకు అదనపు నిధులు : హౌసింగ్ పీడీ

అల్లూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీల ఇళ్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం అదనపు నిధులు మంజూరు చేస్తుందని హౌసింగ్ పీడీ టి.వేణుగోపాల్ అన్నారు. మండలంలోని పలు ప్రాంతాల్లో ఆయన బుధవారం పర్యటించి క్షేత్రస్థాయిలో లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ గృహాల నిర్మాణం చేపట్టి జూన్ మొదటివారం లోగా పూర్తి చేయాలన్నారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను మంజూరు చేసి వారికి నగదు జమయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం ఎంపీడీవో రజనీకాంత్, కమిషనర్ ఉమామహేశ్వరరావులతో చర్చించారు. ఆయన వెంట హౌసింగ్ ఏఈ వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.



లబ్ధిదారులతో మాట్లాడుతున్న పీడీ వేణుగోపాల్

రాళ్లపాడు కార్యాలయాలకు సిబ్బంది

లింగసముద్రం, మార్చి 19(ఆంధ్రజ్యోతి) : రాళ్లపాడు ప్రాజెక్టు కార్యాలయాలకు సిబ్బంది రెగ్యులర్‌గా హాజరయ్యేలా చర్యలు తీసుకుంటామని ప్రాజెక్టు డీఈ ఏం వెంకటేశ్వర్లు బుధవారం చెప్పారు. ఈనెల 13వ తేదీన ఆంధ్రజ్యోతిలో 'ప్రాజెక్టు కార్యాలయాలు ఎప్పుడు తెరుచుకుంటాయో' వార్త ప్రచురితం అయింది. అందుకు స్పందించిన ఆయన మాట్లాడుతూ ఈ రెండు కార్యాలయాల పరిధిలో ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లు, ఒక అటెండరు, ఇద్దరు లస్కర్లు మాత్రమే ఉన్నారని చెప్పారు. ఈ ఏడాది ప్రాజెక్టు పూర్తి సామర్థ్యంతో నిండడంతో ఆయకట్టు పరిధిలోని 16 వేల ఎకరాలకు నీరు సరఫరా చేసేందుకు తగినంత మంది లస్కర్లు లేనందున నీటి నిర్వహణకు ఆఫీసు అటెండరును వాడుకొంటున్నట్టు చెప్పారు. ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లు కందుకూరు డివిజన్ కార్యాలయానికి వెళ్లాల్సి ఉంటున్నందున అప్పుడప్పుడు మాత్రమే కార్యాలయాలు మూసివేసి ఉండవచ్చన్నారు. ప్రస్తుతం నీటి నిర్వహణ చివరి దశలో ఉన్నందున ఆఫీసు సిబ్బంది ఇక నుంచి రెగ్యులర్‌గా హాజరవుతారని చెప్పారు. ఆఫీసు ఆవరణలో ఎలాంటి పిచ్చి మొక్కలు లేవని ఈ నెల 15న స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా ఆవరణను శుభ్రం చేసినట్టు చెప్పారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నేటి నుంచి ఉపాధి పనులపై విచారణ

లింగసముద్రం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు జరిగిన రూ.14.40 కోట్ల ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ అధికారులు గురువారం నుంచి విచారణ చేపడుతున్నట్లు స్టేట్ రిసోర్స్ పర్సన్ నీలకంఠం చెప్పారు. బుధవారం లింగసముద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో కడప, కర్నూలు నుంచి వచ్చిన డీఆర్పీలు, విలేజ్ సోషల్ ఆడిటర్‌లతో కలిసి ఆయన ఉపాధి హామీ రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉపాధిహామీలో చేపట్టిన పనులపై ముందుగా ఎంపీడీవో కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించి, అదే రోజు గ్రామాలకు వెళ్లి కూలీలను విచారించడంతో పాటు పనులను కూడా తనిఖీ చేస్తారన్నారు. విచారణ పూర్తయిన తరువాత త్వరలో ఎంపీడీవో కార్యాలయంలో సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తామన్నారు.



ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధిహామీ రికార్డులు పరిశీలిస్తున్న సామాజిక తనిఖీ అధికారులు, సిబ్బంది

'పీఎం కిసాన్'కు రైతులు దరఖాస్తు చేసుకోవాలి

గుడ్లూరు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): రైతులకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పీఎం కిసాన్ పథకానికి అసైన్‌మెంట్, డీకేటీ పట్టాలు పొందిన రైతులు గ్రామ వ్యవసాయ లేద ఉద్యాన సహాయకులను సంప్రదించి పేరు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి రవికుమార్ తెలిపారు. బుధవారం మండలంలోని నాయుడుపాలెంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఆయన రైతులతో సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బందితో పాటు గ్రామ రైతులు, నాయకులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలి

● ఎంపీడీవో ఐజాక్ ప్రవీణ్

ఆత్మకూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని సచివాలయాల సిబ్బంది సమయ పాలన పాటించాలని ఎంపీడీవో ఐజాక్ ప్రవీణ్ సూచించారు. బుధవారం ఆయన మండలంలోని బోయిల చిరువెళ్ల, కరటంపాడు సచివాలయాలను తనిఖీచేసి హాజరు పరిశీలించారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బందితో ఆయన మాట్లాడుతూ మండలంలో పీ4, వర్క్ ఫ్రమ్ హోం సర్వేలను త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. పీ4 సర్వే పూర్తయిన తరువాత లబ్ధిదారుల జాబితాను సచివాలయంలో ప్రదర్శించి ఏవైనా అభ్యంతరాలు ఉంటే స్వీకరించి ఈనెల 22వ తేదీ లోగా తుది జాబితాను రూపొందించాలని తెలిపారు. అదేవిధంగా గృహనిర్మాణ లబ్ధిదారులకు అదనపు సాయంపై అవగాహన కల్పించి ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేసే విధంగా చైతన్యం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.



సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీవో ఐజాక్ ప్రవీణ్

పని ప్రదేశంలో వసతులు కల్పించాలి

ఉదయగిరి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనుల వద్ద కూలీలకు వసతులు కల్పించాలని ఎంపీడీవో అప్పాజీ, ఏపీవో శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో ఉపాధి హామీ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పనుల్లో కూలీల సంఖ్యను పెంచాలన్నారు. సిబ్బందికి కేటాయించిన లక్ష్యాలను అధిగమించాలన్నారు. ఫారంపాండ్ తవ్వకాలను వేగవంతం చేయాలన్నారు.

ఆస్తి వివాదం : అన్నపై తమ్ముడి దాడి

కలువాయి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): అన్నపై తమ్ముడు కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన బుధవారం సాయంత్రం కలువాయి మండలం దాచూరులో చోటుచేసుకుంది. గ్రామస్థుల సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. దాచూరుకు చెందిన కండ్లగుంట సుబ్బారెడ్డి, వెంకటరెడ్డిలు అన్నదమ్ములు. వీరి మధ్య చాలా కాలంగా ఆస్తి తగాదాలు ఉన్నాయి. ఈనేపథ్యంలో సాయంత్రం బస్టాండు సెంటర్‌లో ఉన్న వెంకటరెడ్డిపై అతని తమ్ముడు సుబ్బారెడ్డి కత్తితో దాడిచేశాడు. తీవ్రంగా గాయపడిన వెంకటరెడ్డిని బంధువులు వైద్యశాలకు తరలించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేశారు.

బీఎల్‌వోలతో సమీక్ష

దుత్తలూరు (ఉదయగిరి), మార్చి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దారు కార్యాలయంలో బుధవారం తహసీల్దారు వై నాగరాజు మండలంలోని బూత్ లెవల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ డోరు నెంబర్లు, ఫారం-8కు సంబంధించి సవరణలు పూర్తిచేయాలని, ఓటర్ల జాబితాలో చనిపోయిన వారి పేర్లు తొలగించాలన్నారు.

సోమశిలలో 54.930 టీఎంసీల నీరు

అనంతసాగరం మార్చి19 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా బుధవారం నాటికి 54.930 టీఎంసీలు నిల్వ ఉంది. డెల్టాకు 500, ఉత్తర కాలువకు 400, దక్షిణ కాలువకు 350, కండలేరుకు 200 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.